www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 230
మంగళవారం | 18-11-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ.7:12 తదుపరి చతుర్దశి; నక్షత్రం: స్వాతి పూర్తి; వర్జ్యం: ఉ.11:18-మ.1:06; దుర్ముహూర్తం: ఉ.8:39-9:24, రా.9:48-10:38; అమృతఘడియలు: రా.10:05-11:53; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 5:35
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మూడు తరాలు మాయం
13

సౌదీ దుర్ఘటనలో బుగ్గిపాలైన హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం

ఇంటిపెద్ద నసీరుద్దీన్, ఆయన భార్య సహా 8 మంది పెద్దవాళ్లు..

ఆయనకు ఉన్న 10 మంది మనుమలు, మనుమరాళ్ల దుర్మరణం

ఇంటివద్దే ఉండడంతో బతికిన తల్లి.. టికెట్ దొరక్క అమెరికాలో పెద్దకొడుకు



సౌదీ అరేబియాకు వెళ్లే ముందు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో నసీరుద్దీన్ కుటుంబం

సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం 45 మంది సజీవదహనం

మృతుల్లో 44 మంది హైదరాబాదీలే.. వారిలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది..

మక్కా నుంచి మదీనా వెళ్తుండగా దుర్ఘటన.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన టూరిస్ట్ బస్సు

46 మందిలో ప్రాణాలతో బయటపడ్డ ఒకే ఒక్కడు.. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఉమ్రా యాత్రకు 54 మంది

బస్సు ఎక్కని 8 మంది హైదరాబాదీలు సురక్షితం.. వివరాలు వెల్లడించిన తెలంగాణ హజ్ కమిటీ

సౌదీలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన భారత ఎంబసీ.. డీఎన్ఏ పరీక్షలతోనే మృతుల గుర్తింపు

మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం.. మంత్రి అజారుద్దీన్ ఆధ్వర్యంలో సౌదీకి ప్రతినిధులు

ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరిని పంపేలా ఏర్పాట్లు.. అక్కడే మృతులకు అంత్యక్రియలు

గల్ఫ్ ప్రతినిధి/హైదరాబాద్ సిటీ/ న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉమ్రా యాత్ర కోసం హైదరాబాద్ నుంచి మక్కా వెళ్లిన 45 మంది యాత్రికులు సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగి, యాత్రికులు సజీవ దహనమయ్యారు. బస్సులో 46 మంది ఉండగా.. ఓ వ్యక్తి మాత్రం తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మక్కాలో ఉమ్రా చేసుకొని 440 కి.మీ. దూరంలోని మదీనాకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. యాత్రికులు గాఢ నిద్రలో ఉండగా.. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బస్సు, డీజిల్ ట్యాంకర్ ఢీకొన్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్రా యాత్రలో భాగంగా 54 మంది బృందం

మిగతా 13వ పేజీలో...



బాధిత కుటుంబానికి చెందిన ఓ వ్యక్తిని ఓదార్చుతున్న మంత్రి అజారుద్దీన్

అత్యంత దురదృష్టకరం

సౌదీ ప్రమాదంపై ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దిగ్ర్భాంతి

సీఎం, డిప్యూటీ సీఎం, రాష్ట్ర, కేంద్ర మంత్రుల సంతాపం

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

కిషన్‌రెడ్డి, సంజయ్ ప్రకటన

బాధిత కుటుంబాలకు అండగా ఉండండి

సీఎం రేవంత్‌కు ఖర్గే సూచన

13

ఎన్నికలు.. తొలుత పంచాయతీలకు

బీసీలకు పార్టీ పరంగా 42 శాతం సీట్లు

డిసెంబరులోనే ఎన్నికలు పూర్తి చేసే యోచన

సుప్రీం సూచనలు, హైకోర్టు తీర్పు, 3 వేల కోట్లు మురిగిపోయే ప్రమాదం.. వీటి వల్లే నిర్ణయం

కోర్టుల నుంచి స్పష్టత వచ్చాకే ప్రాదేశిక ఎన్నికలు

పాఠ్యపుస్తకాల్లో 'జయజయహే తెలంగాణ'

అందెశ్రీ కుమారుడికి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు

గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రత బిల్లుకు ఆమోదం

8, 9న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'

ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2 కెనాల్‌కు దామోదర్‌రెడ్డి పేరు

క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు.. సుదీర్ఘంగా భేటీ

ఇద్దరికి కన్నా ఎక్కువ సంతానం ఉన్నా పోటీకి అర్హులే.. గెజిట్ నోటిఫికేషన్ విడుదల

పది రోజుల్లో 'పంచాయతీ' నోటిఫికేషన్

బీసీలకు పార్టీ పరంగా కనిష్ఠంగా 42%, గరిష్ఠంగా 60% రిజర్వేషన్ ఇద్దాం

క్యాబినెట్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన

అంగీకారం తెలిపిన మంత్రులు



క్యాబినెట్ భేటీ వివరాలు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి అడ్లూరి, షబ్బీర్ అలీ

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా సందిగ్ధంగా మారిన స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం పూర్తి స్పష్టతనిచ్చింది. ఈ ఎన్నికల ప్రక్రియను త్వరగా చేపట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అయితే గతంలో నిర్ణయించినట్లు ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కాకుండా.. గ్రామ పంచాయతీ ఎన్నికలను తొలుత నిర్వహించాలని తీర్మానించింది. రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.3 వేల కోట్ల వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది. వచ్చే ఏడాది మార్చిలోపు ఈ నిధులు మురిగిపోయే పరిస్థితి నెలకొంది. అందుకే అప్పటిలోగానే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి, పాలక వర్గాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆ నిధులను రాబట్టాలని నిర్ణయించింది. ఈ దృష్ట్యా పంచాయతీ ఎన్నికలను డిసెంబరు లోపే నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చింది. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన సమావేశం 5 గంటలకు పైగా సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అంతకుముందు మంత్రి వివేక్ వెంకటస్వామి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలు, రిజర్వేషన్లపై హైకోర్టు నుంచి వచ్చిన ప్రభుత్వ వ్యతిరేక తీర్పు నేపథ్యంలో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం

మిగతా 12వ పేజీలో...



న్యూ ఇయర్‌కి ఎక్కడుంటారో
తేల్చుకోండి!

ఆదేశాలు పాటిస్తారా? ధిక్కారం కేసు ఎదుర్కొంటారా?.. 4 వారాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తేల్చండి

తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక.. నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యంపై తీవ్ర అసహనం

రోజువారీగా విచారించాలని గతంలోనే చెప్పాం.. ఎమ్మెల్యేలు సహకరించకపోతే వేటు వేయాలన్నాం

సభాపతికి గుర్తు చేసిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్.. స్పీకర్‌తోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ

న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 10 మంది శాసన సభ్యుల ఫిరాయింపు వ్యవహారంపై స్పీకర్ విచారణలో జాప్యాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. రోజువారీగా విచారించాలని, ఎమ్మెల్యేలు సహకరించకపోతే వేటు వేయాలని గత ఆదేశాల్లోనే స్పష్టం చేశామని గుర్తు చేసింది. తమ ఆదేశాలు పాటిస్తారో? లేదంటే కోర్టు ధిక్కారాన్ని ఎదుర్కొంటారో? సభాపతి తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. "అనర్హత అంశంపై నాలుగు వారాల్లో తేల్చండి.. లేదంటే న్యూ ఇయర్ వేడుకలు ఎక్కడ చేసుకుంటారో నిర్ణయించుకోండి?" అని స్పీకర్‌ను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హత అంశంపై వీలైనంత త్వరగా, లేదంటే మూడు నెలల్లో విచారించి నిర్ణయం తీసుకోవాలని ఈ ఏడాది జూలై 31 సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు విధించిన గడువు అక్టోబరు 31తో ముగిసింది. స్పీకర్‌గా రాజ్యాంగ బాధ్యతలు, హైదరాబాద్‌లో వరదలు, రోజువారీ కార్యక్రమాలు, అంతర్జాతీయ

మిగతా 14వ పేజీలో...

స్పీకర్‌పై సుప్రీం వ్యాఖ్యలు రాష్ట్రానికి అవమానకరం

ఫిరాయింపులపై చట్టానికి లోబడి చర్యలు తీసుకోవాలి

స్పీకర్‌కు కిషన్‌రెడ్డి సూచన

14

రిజర్వేషన్లు 50% దాటొద్దు!

మహారాష్ట్ర స్థానిక సంస్థల కేసులో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

2

మా కుటుంబంలోనూ ఒకరు డిజిటల్ అరెస్టు

రెండ్రోజులు నిర్బంధించారు

సైబర్ మోసాల సెగ మా ఇంటికి కూడా తగిలింది

సినీ హీరో అక్కినేని నాగార్జున

హైదరాబాద్ సిటీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్న సైబర్ మోసాల సెగ తన ఇంటికి కూడా తాకిందని టాలీవుడ్ హీరో నాగార్జున తెలిపారు. తమ కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్ మోసం బారినపడ్డారని వెల్లడించారు. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిని సైబర్

మిగతా 9వ పేజీలో...

కర్ణాటకలో టెకీపై సైబర్ వల

ఆరు నెలల్లో రూ.32 కోట్ల దోపిడీ

2



హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో చిరంజీవి, నాగార్జున, దిల్‌రాజు

ఐబొమ్మ ద్వారా బెట్టింగ్ యాప్‌ల ప్రచారం

- ఉచిత సినిమా ఎరతో 50 లక్షల మంది డేటా తస్కరణ
- రవి వందల కోట్లు క్రిప్టో కరెన్సీగా తరలించాడు
- మేమే పట్టుకున్నాం.. ఎవరూ సహకరించలేదు: సజ్జనార్
- లక్షల మంది కష్టం దోచుకున్నారు: చిరంజీవి
- ఉచితం వెనుక ప్రాణాంతక ముప్పు: రాజమౌళి
- ఐబొమ్మ, బప్పంటీవీ వెబ్‌సైట్ల మూసివేత

9

అల్ ఫలాహ్ వర్సిటీ చాన్స్‌లర్ తమ్ముడు

హైదరాబాద్‌లో అరెస్టు

ఆర్థిక అక్రమాల కేసులో హమూద్ సిద్దిఖీని అరెస్టు చేసిన మధ్యప్రదేశ్ పోలీసులు

పాతికేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న హమూద్

హైదరాబాద్‌లో షేర్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ జావేద్ సిద్దిఖీ సోదరుడు హమూద్ సిద్దిఖీని మధ్యప్రదేశ్ పోలీసులు హైదరాబాద్‌లో ఆదివారం అరెస్టు చేశారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారుబాంబు పేలుడు కేసులో ఈ యూనివర్సిటీ వైద్యులే కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌లోని మౌ పట్టణానికి చెందిన హమూద్ సిద్దిఖీపై 2000 సంవత్సరంలో పలువురిని మోసం చేసినట్లు కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి అతడు

మిగతా 2వ పేజీలో...

6 నగరాల్లో పేలుళ్లకు కుట్ర!

నాలుగేళ్లుగా ప్రణాళికలు.. ఆయుధాలు, నిధుల సేకరణ

ఢిల్లీ బాంబు పేలుడు దర్యాప్తులో వివరాల వెల్లడి

2

షేక్ హసీనాకు మరణశిక్ష

బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ ట్రైబ్యునల్ సంచలన తీర్పు

2

మానవత్వానికి వ్యతిరేకంగా ఆమె నేర చర్యలు

విద్యార్థుల హత్యలకు ఆదేశాలు ఇచ్చారు

మాజీ ప్రధానికి మరణశిక్షే తగిన దండన: ట్రైబ్యునల్

15 నెలలుగా భారత్‌లోనే షేక్ హసీనా

తీర్పును గుర్తించడం లేదు

'హేగ్'లో విచారణ జరిపించాలని డిమాండ్



అమెరికా నుంచి వంట గ్యాస్!

- ఏటా 10% చొప్పున కొనుగోలు
- ఒప్పందం చేసుకున్న భారత్
- ఎల్‌పీజీ వినియోగంలో ప్రపంచ దేశాల్లో రెండో స్థానంలో మనం

న్యూఢిల్లీ, నవంబరు 17: అమెరికా నుంచి వంటగ్యాస్(ఎల్‌పీజీ) దిగుమతి చేసుకునే ఒప్పందంపై భారత్ సంతకం చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండో దఫ పాలనలో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ఇదేనని కేంద్రం ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం.. ఎల్‌పీజీ దిగుమతుల్లో ఏటా 10 శాతం అమెరికా నుంచి భారత్ తీసుకుంటుంది. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేసినట్టు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి సోమవారం తెలిపారు. దీనిని చరిత్రాత్మక ఒప్పందంగా ఆయన

మిగతా 2వ పేజీలో...

20న బిహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

2

హాజరుకానున్న ప్రధాని మోదీ ఎన్‌డీఏ అగ్ర నేతలు

రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన నితీశ్

అసెంబ్లీ రద్దుకు సిఫారసు



గచ్చిబౌలిలో సంధ్య కన్వెన్షన్ ఆక్రమణల తొలగింపు

హైకోర్టు ఆదేశాలతో హైడ్రా చర్యలు

12

కూల్చివేతలపై కోర్టు ధిక్కరణ పిటిషన్

చలి పులి పంజా

పలు చోట్ల 10 డిగ్రీలకంటే దిగువకు..

ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7 డిగ్రీలు

9

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లిలో 8.8 డిగ్రీలు నమోదు

మరో రెండు రోజులు ఇదే పరిస్థితి

పత్తి కొనుగోళ్లు బంద్

12

మిల్లర్ల నిరవధిక సమ్మెతో జిన్నింగ్ మిల్లుల మూసివేత

డిమాండ్లు తీర్చేదాకా సమ్మె

తెలంగాణ కాటన్ అసోసియేషన్ స్పష్టీకరణ

ఎవరిపై ఆరోపణలు వస్తే.. వారే వివరణ ఇవ్వాలి

వందిమాగధులతో తిట్టిస్తానంటే కుదరదు

హరీశ్‌రావును ఉద్దేశించి మరోసారి కవిత వ్యాఖ్యలు



14

అల్ ఫలాహ్ వర్సిటీ చాన్స్‌లర్ తమ్ముడు
హైదరాబాద్‌లో అరెస్టు
(మొదటి పేజీ తరువాయి)

పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతున్నారు. అతడి సమాచారం తెలిపినవారికి రూ.10 వేల బహుమతి ఇస్తామని 2019లో పోలీసులు ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ పేలుడు కేసులో జావేద్‌ను ప్రశ్నించగా హమూద్ తన కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. దీంతో నలుగురు సభ్యులతో కూడిన మధ్యప్రదేశ్ పోలీసు బృందం హైదరాబాద్ పోలీసుల సహకారంతో స్పెషల్ ఆపరేషన్ చేపట్టి హమూద్‌ను అరెస్టు చేశారు. అతడిని స్థానిక కోర్టులో హాజరుపర్చి ట్రాన్సిట్ వారెంట్‌పై మధ్యప్రదేశ్‌కు తరలించారు. హమూద్ సిద్దిఖీపై మౌలో అనేక కేసులు ఉన్నాయని మధ్యప్రదేశ్ పోలీస్ అధికారి యాంచెన్ దోల్కర్ భూటియా సోమవారం తెలిపారు. 1995లో హమూద్ సిద్దిఖీ మౌలో ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ప్రారంభించి స్థానికుల నుంచి పెట్టుబడుల రూపంలో రూ.40 లక్షల వరకు వసూలు చేసి పరారయ్యాడని చెప్పారు. హమూద్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కూడా ఒక షేర్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ నడుపుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, ఢిల్లీ కారు పేలుడు కేసులో సహ కుట్రదారు జసిర్ బిలాల్ వనీ అలియాస్ డానిష్‌ను ఎన్ఐఏ జమ్మూకశ్మీర్‌లో అరెస్టు చేసింది. కారు పేలుడులో ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ నబీకి సన్నిహితుడైన వనీ అనంతనాగ్ జిల్లా ఖాజీగుండ్ వాసి. ఉగ్రదాడులు చేసేందుకు వనీ సాంకేతిక సహకారం అందించాడని, డ్రోన్లను ఆధునీకరించి రాకెట్లుగా మార్చేందుకు యత్నించినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు.

ఆరు నగరాల్లో డిసెంబరు 6న పేలుళ్లకు కుట్ర!
» నాలుగేళ్లుగా ప్రణాళికలు.. దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 17: దేశవ్యాప్తంగా కనీసం ఆరు నగరాల్లో పేలుళ్లు జరిపి భయోత్పాతం సృష్టించాలని ఉగ్రవైద్యులు కుట్ర పన్నినట్లుగా తాజాగా వెల్లడైంది. అదుపులో ఉన్న ఉగ్ర డాక్టర్లను ప్రశ్నిస్తూ, వారి నుంచి స్వాధీనం చేసుకున్న డెయిరీలు, నోట్స్, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్న క్రమంలో దర్యాప్తు అధికారులు పలు కొత్త కోణాలను వెలికి తీస్తున్నారు. దీని ప్రకారం.. ఉగ్ర డాక్టర్లు తమ కుట్ర అమలు ప్రణాళికను నాలుగేళ్ల క్రితం 2021లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డబ్బులు, సురక్షిత స్థావరాల్ని సమకూర్చుకోవటం వంటి పనులు కొనసాగిస్తున్నారు. ఢిల్లీలో పేలుడు సంభవించిన కారును నడిపిన ఉమర్ నబీతో ఇదంతా ప్రారంభమైంది. 2020లో శ్రీనగర్‌లోని అతడి క్లినిక్‌కు ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ అనే వ్యక్తి తన కుమారుడిని చికిత్స కోసం తీసుకొచ్చాడు. నబీతో అతడికి పరిచయం పెరిగింది. దీన్ని అవకాశంగా తీసుకొని నబీకి ఇర్ఫాన్ ఉగ్రవాద సాహిత్యం పరిచయం చేశాడు. ఈ క్రమంలో ఉమర్‌నబీ ఉగ్రవాదంవైపు మరలాడు. హరియాణాలోని అల్‌ఫలా యూనివర్సిటీలో తనతోపాటు పని చేస్తున్న ఇతర వైద్యుల్ని కూడా ఈ దారిలోకి తీసుకొచ్చాడు. ఫరీదాబాద్‌కు చెందిన మహిళా డాక్టర్ షాహిన్ సయీద్ కూడా వీరితో కలిసింది. 2021లో వీరందరూ పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాదుల్ని జమ్మూకశ్మీర్‌లో కలుసుకున్నారు. 2022 మార్చిలో టర్కీకి వెళ్లి జైషే మహమ్మద్ విదేశీ కార్యకలాపాలు నిర్వహించే అబు ఉక్సాను కలిశారు. ఈ నేపథ్యంలోనే, భారత్‌లో డిసెంబరు 6వ తేదీన(బాబ్రీమసీదును కూల్చిన రోజు) కనీసం ఆరు నగరాల్లో పేలుళ్లు జరపాలన్న కుట్ర అమలు వేగవంతమైంది. వీరు 2022 నుంచి హవాలా మార్గంలో రూ.20 లక్షల మొత్తం సేకరించినట్లు వెల్లడైంది.

'సర్' మా వల్ల కాదు.. పనులను బహిష్కరిస్తాం
» తమిళనాడు రెవెన్యూ సంఘాల సమాఖ్య ప్రకటన

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పనులు తమ వల్ల కావడం లేదని తమిళనాడు రెవెన్యూ సంఘాల సమాఖ్య ప్రకటించింది. ఎన్నికల సంఘం సరైన ప్రణాళికలు, తగు శిక్షణ, అదనపు సిబ్బందిని ఇవ్వకుండా, కనీస ఆర్థిక కేటాయింపులు కూడా లేకుండా తమపై పనిభారాన్ని మోపుతోందని, ఈ కారణంగా మంగళవారం నుంచి తాము సర్ పనులను బహిష్కరిస్తున్నామని ఆ సమాఖ్య వెల్లడించింది. ఈ మేరకు ఆ సమాఖ్య అధ్యక్షుడు మురుగయ్యన్ విలేకరులతో మాట్లాడారు. సర్ పనులను త్వరగా ముగించాలంటూ ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు అదే పనిగా తమపై ఒత్తిడి చేస్తున్నారని, వీటికి తోడు రోజూ రెవెన్యూ శాఖ పనులను కూడా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. పనిభారానికి తగినట్టు తమకు ఎలాంటి ఆర్థిక కేటాయింపులు లేవని ఆరోపించారు. ఇదిలా ఉండగా సర్ పనులకు గైర్హాజరయ్యే ఉద్యోగుల జీతంలో కోత తప్పదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హెచ్చరించారు.

శారీరకంగా బాగున్నవారికీ వీల్‌చైర్‌లా?
» విమానాశ్రయాల్లో రూ.5 వేలు వసూలు చేయండి
» పారిశ్రామికవేత్త కిరణ్ మజుందార్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 17: శారీరకంగా బాగున్న వారు సయితం విమానాశ్రయాల్లో వీల్‌చైర్లు వినియోగిస్తుండడంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలో ప్రముఖ పారిశ్రామికవేత్త, బయోకాన్ సంస్థ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్-షా భాగస్వామి అయ్యారు. 'వీల్‌చైర్ వినియోగానికి అదనంగా రూ.5,000 రుసుము వసూలు చేయండి, అప్పుడు చూడండి ఎంతమందికి నిజంగా అవసరం ఉందో..'అంటూ పోస్టు పెట్టారు. దీనిపై మిశ్రమ స్పందన లభించింది. ఉచితంగా లభిస్తుంటే ఎందుకు వద్దంటారని ఒకరు కామెంట్ పెట్టారు. చైనాకు చెందిన ఓ ప్రయాణికుడు పోస్టు చేసిన ఫొటోతో ఈ చర్చ మొదలైంది. ఒక విమానాశ్రయంలో వీల్‌చైర్ల కోసం పెద్ద లైను కనిపించింది. విమానయాన సంస్థ సిబ్బందే వాటిని తోసుకెళ్లే సౌకర్యం ఉండడంతో చాలా మంది ఆ లైనులో ఉన్నారు. వీల్‌చైర్‌లో అయితే త్వరగా విమానం ఎక్కొచ్చన్న ఉద్దేశంతో వారంతా ఆ సేవలవైపు మొగ్గు చూపారు.

ఈడీ ముందు అనిల్ అంబానీ మళ్లీ గైర్హాజరు

న్యూఢిల్లీ, నవంబరు 17: విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద నమోదైన కేసులో ఈడీ విచారణకు రిలయన్స్ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీ మరోసారి గైర్హాజరయ్యారు. సోమవారం విచారణకు రావాలంటూ ఈడీ పంపిన సమన్లను పట్టించుకోలేదు. తనను వర్చువల్ విధానంలోగానీ, వీడియో తీసి రికార్డు చేయడం ద్వారాగానీ విచారణ జరపాలని కోరారు. తొలుత ఈ నెల 14న విచారణకు రావాలని ఈడీ సమన్లు పంపింది.

భారతీయులకు ఇరాన్ 'వీసా ఫ్రీ ఎంట్రీ' రద్దు

న్యూఢిల్లీ, నవంబరు 17: భారతీయులు వీసా లేకున్నా తమ దేశంలో పర్యటించే వెసులుబాటు(వీసా ఫ్రీ ఎంట్రీ)ను ఇరాన్ రద్దు చేసింది. ఆర్డినరీ పాస్‌పోర్టు ఉన్న ప్రయాణికులెవరైనా ఇక నుంచి ఇరాన్‌కు వెళ్లాలన్నా.. ఇరాన్ మీదుగా వేరే దేశానికి వెళ్లాలన్నా(ట్రాన్సిట్) వీసా తప్పనిసరి కానుంది. ఇది ఈ నెల 22 నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటివరకు భారతీయులు వీసా లేకున్నా కొన్ని షరతులతో ఇరాన్‌లో పర్యటించడానికి అవకాశం ఉండేది. తమ దేశంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఇరాన్ గతంలో ఈ వెసులుబాటు కల్పించింది.

రేపు పీఎం కిసాన్ నిధుల విడుదల

న్యూఢిల్లీ, నవంబరు 17: ప్రధాని మోదీ బుధవారం పీఎం కిసాన్ 21వ విడత నిధుల్ని విడుదల చేయనున్నారు. ఈ విడతతో ఈ పథకం కింద ప్రత్యక్ష నగదు బదిలీలు రూ.3.70లక్షల కోట్లు దాటనున్నాయి. దేశవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. కేంద్రం ఏటా అర్హులైన రైతులకు రూ.6వేల చొప్పున పంటసాయం అందిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద నగదు బదిలీ పథకాల్లో ఇదొకటి.

20న బిహార్ సీఎంగా నితీశ్ మళ్లీ ప్రమాణం

పట్నా, నవంబరు 17: బిహార్ సీఎంగా మరోసారి జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. దీంతో ఆయన బిహార్ సీఎంగా పదోసారి ప్రమాణ స్వీకారం చేసినట్టవుతుంది. రాష్ట్రంలో కొత్త ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా సీఎం నితీశ్ కుమార్ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని కోరారు. నితీశ్ బుధవారం గవర్నర్‌తో మళ్లీ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా తన రాజీనామాను సమర్పించనున్నారు. అదే రోజు అసెంబ్లీ రద్దుకానుంది. శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఆ రోజే ఎన్నుకోనున్నారు. నితీశ్ కుమారే సీఎంగా కొనసాగుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ కూడా వెల్లడించారు. పట్నాలోని గాంధీ మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని జేడీయూ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

షేక్ హసీనాకు మరణశిక్ష
బంగ్లాదేశ్ అల్లర్ల కేసుపై ఢాకాలోని ఇంటర్నేషనల్ ట్రైబ్యునల్ సంచలన తీర్పు



ఢాకా, నవంబరు 17 : బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో మాజీ ప్రధాని, ప్రస్తుతం భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న నాయకురాలు షేక్ హసీనాకు ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్(ఐసీటీ) మరణశిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా హసీనా నేరాలకు పాల్పడ్డారని ఈ తీర్పు సందర్భంగా ట్రైబ్యునల్ ఆక్షేపించింది. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనలను హసీనా ప్రభుత్వం హింసాత్మకంగా అణచివేసినట్టు నమోదైన అభియోగాలపై దాదాపు నెలరోజులపాటు విచారణ జరిగింది. జస్టిస్ మొహమ్మద్ గొలామ్ మొర్తుజా మజుందార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ట్రైబ్యునల్ సోమవారం ఆమెను దోషిగా తేల్చింది. ఇవే అభియోగాలపై హోంశాఖ మాజీ మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, పోలీసు శాఖ మాజీ చీఫ్ చౌధురీ అబ్దుల్లా-అల్-మామున్‌లను కూడా దోషులుగా ప్రకటించింది. వీరిలో కమల్‌కు మరణశిక్షను; ట్రైబ్యునల్‌ను, దేశ ప్రజలను క్షమాపణలు కోరిన అబ్దుల్లాకు ఐదేళ్ల శిక్షను విధించింది. గత ఏడాది ఆందోళనకారుల హత్యలకు దేశవ్యాప్తంగా ఈ ముగ్గురు కలిసికట్టుగా నిర్ణయం తీసుకుని, అమలుచేశారని ట్రైబ్యునల్ తేల్చింది. అల్లర్లను ప్రేరేపించడం...ఆందోళనకారుల హత్యలకు ఆదేశాలు...విద్యార్థులపై హింసను ఆపడానికి చర్యలు తీసుకోకపోవడం వంటి మూడు కారణాల రీత్యా హసీనాను దోషిగా ప్రకటిస్తున్నామని, ఆమె నేరాలకు మరణశిక్ష తప్ప మరే దండనా సరిపోదని ట్రైబ్యునల్ వ్యాఖ్యానించింది. "విద్యార్థుల డిమాండ్లను, వారి ఉద్యమాన్ని నాటి హసీనా ప్రభుత్వం లక్ష్యపెట్టకపోగా, 'రజాకార్లు' అంటూ నిందార్థ పదాలను ఉపయోగించింది. ఆందోళనకారులు గుమిగూడిన స్థలాలను డ్రోన్ల ద్వారా గుర్తించి హెలికాప్టర్లు, ప్రాణాంతక ఆయుధాలతో దాడులు చేసి చంపివేయాలంటూ శాంతిభద్రతల విభాగాలను హసీనా ఆదేశించగా, ఆ ఆదేశాలను అప్పటి హోం మంత్రి కమల్, నాటి పోలీస్ చీఫ్ అబ్దుల్లా అమలుచేశారు. విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉండటం హసీనా, కమల్‌ల దోషిత్వాన్ని సూచిస్తోంది" అని ట్రైబ్యునల్ వ్యాఖ్యానించింది. తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. పోలీసులు, పౌరులపై ఎవరు దాడులు చేసినా కాల్చివేయాలంటూ ఢాకా మెట్రోపాలిటన్ కమిషనర్ ఆదేశించారు. కాగా, మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ భారత్ ప్రభుత్వాన్ని బంగ్లా సర్కారు కోరింది. నేరస్థుల పరస్పర అప్పగింత ఒప్పందం ప్రకారం తమ విజ్ఞప్తిని భారత్ పాటించి తీరాల్సిందేనని పేర్కొంది. ట్రైబ్యునల్ నిర్ణయాన్ని బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ అధినేత యూనస్ చరిత్రాత్మక తీర్పుగా అభివర్ణించారు.

మా వైఖరిలో మార్పు ఉండదు

బంగ్లాదేశీయులకు ఏది మంచి చేస్తుందో, దానికే కట్టుబడి ఉంటామని భారత్ పునరుద్ఘాటించింది. షేక్ హసీనాకు మరణశిక్ష ప్రకటించడం, ఆ తర్వాతి పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఒక పొరుగుదేశంగా.. బంగ్లాలో శాంతి, ప్రజాస్వామ్యం నెలకొనాలని కోరుకుంటున్నామంది.

తీర్పును గుర్తించను: షేక్ హసీనా

ప్రజలు ఎన్నుకోని ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఉగ్రవాద శక్తుల్లో దాగిన అనాగరిక, హత్యాపూరిత ఉద్దేశాలను ఈ తీర్పు బయటపెట్టిందని హసీనా విమర్శించారు. నిష్పక్షపాత విచారణ జరగలేదని, తమ వాదనలు వినిపించడానికి ట్రైబ్యునల్ అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఆందోళనకారుల హత్యలకు తానుగానీ, ప్రభుత్వంలోని నాయకులుగానీ ఆదేశించలేదని పేర్కొన్నారు. తీర్పును తాను గుర్తించడం లేదన్నారు. సరైన న్యాయస్థానంలో విచారణ జరగాలని, హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారణ జరిపించాలని యూనస్ ప్రభుత్వాన్ని తాను పదేపదే కోరినట్లు హసీనా తెలిపారు. కాగా, ఆమె పెళ్లి రోజునే(నవంబరు 17) ట్రైబ్యునల్ హసీనాకు మరణశిక్ష విధించడం విశేషం.

నాడూ భారత్‌లోనే ఆశ్రయం

1975లో తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌ను, తల్లిని, కుటుంబసభ్యులను హత్యచేసిన అర్ధరాత్రి సైనిక తిరుగుబాటు నుంచి హసీనా తప్పించుకున్నారు. ఆ మారణకాండలో మొత్తం 36 మందిని అదే నివాసంలో ఊచకోత కోశారు. ఆ ఘటన తర్వాత హసీనా తన భర్త, పిల్లలు, సోదరి రెహనాతో కలిసి భారత్‌కు చేరుకుని 1981 వరకు ప్రవాస జీవితం గడిపారు. ఆమె భారత్‌లో ఉండగానే ఆమె తండ్రి పార్టీ అయిన అవామీ లీగ్ కార్యకర్తలు హసీనాను తమ అధ్యక్షురాలిగా ఎన్నుకొన్నారు. ఇప్పుడు కూడా గత ఏడాది ఆగస్టు 4వ తేదీ నుంచి హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

లోకం తీరు



డిజిటల్ అరెస్టు అంటూ.. 6 నెలల్లో 32 కోట్ల దోపిడీ
» కర్ణాటకలో అతిపెద్ద సైబర్ నేరం

బెంగళూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఓ మహిళా టెకీని 'మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి.. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ.. బెదిరించిన కేటుగాళ్లు ఆమె నుంచి ఆరు నెలల్లో దాదాపు రూ.32 కోట్లు కాజేయడం తీవ్ర సంచలనం రేపింది. కర్ణాటకలో చోటుచేసుకున్న ఈ అతిపెద్ద సైబర్ క్రైం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందిరానగర్‌కు చెందిన 57 ఏళ్ల మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు 2024 సెప్టెంబరు 15న డీహెచ్ఎల్ కొరియర్ సర్వీస్ నుంచి మాట్లాడుతున్నామని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో 3 క్రెడిట్ కార్డులు, 4 పాస్‌పోర్టులు, నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ ఉన్నాయి. ముంబై అంధేరిలోని డీహెచ్ఎల్ కొరియర్‌కు ఈ పార్సిల్ వచ్చింది..' అని సమాచారం ఇచ్చారు. తాను బెంగళూరులో నివసిస్తున్నానని, ఆ పార్సిల్ తనది కాదని ఆమె బదులిచ్చారు. దీంతో 'మీ ఫోన్ నంబరు ఈ పార్సిల్‌కు లింక్ అయింది. ఇది సైబర్ నేరం. సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశాం. అక్కడి నుంచి ఓ సీబీఐ అధికారి మిమ్మల్ని సంప్రదిస్తారు..' అని చెప్పి ఆ వ్యక్తి ఫోన్ పెట్టేశాడు. కాసేపటికి మరో ఫోన్‌కాల్ వచ్చింది. అతను సీబీఐ అధికారినని పరిచయం చేసుకున్నాడు. పార్సిల్ విషయమై బెదిరించాడు. 'కేసు ముంబైలో నమోదైంది. ఇక్కడివారితోనే మాట్లాడాలి' అని హెచ్చరించాడు. రెండు రోజుల తర్వాత స్కైప్ వీడియో కాల్ చేసి టెకీని 'డిజిటల్ అరెస్టు' చేస్తున్నట్లు బెదిరించారు. దీంతో ఆమె తన బ్యాంకు ఖాతా, ఆస్తుల వివరాలు వారికి అందజేశారు. ఆ తర్వాత మీరు ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటపడాలంటే కొంత నగదు డిపాజిట్ చేయాలని ఒత్తిడి చేసిన మోసగాళ్లు విడతలవారీగా నగదు బదిలీ చేయించుకున్నారు. బాధిత మహిళ వారు కోరిన ప్పుడల్లా మొత్తం 187 సార్లు తన ఫిక్స్‌డ్ డిపాజిట్లు మినహా.. రూ.31.83 కోట్లను వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశారు.

బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు
» ఆయుధాలున్నాయన్న టీఎంసీ ఎంపీ ఆరోపణతో గవర్నర్ ఆదేశం



న్యూఢిల్లీ, నవంబరు 17: బీజేపీ నేరస్థులు గవర్నర్ అధికారిక నివాసంలో ఆశ్రయం పొందుతున్నారని, లోపల ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా ఉందంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ గత శనివారం తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో సోమవారం పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్‌లో తనిఖీలు నిర్వహించారు. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ సారథ్యంలో కోల్‌కతా పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు, బాంబు స్క్వాడ్స్, డాగ్ స్క్వాడ్‌లతో కూడిన బృందాలు సోమవారం రాజ్‌భవన్‌లో ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఆ తర్వాత గవర్నర్ ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ తనిఖీల్లో నిషేధిత వస్తువులేమీ దొరకలేదన్నారు. కల్యాణ్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలు దారుణమైనవేకాకుండా దురుద్దేశంతో కూడినవి, నిరాధారమైనవన్నారు. బెంగాల్‌లోని రాజకీయ నాయకులు క్రూరమైన ఆరోపణలు చేస్తుండటాన్ని తాను గమనించానని, బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని నిరూపితమైందని, ఆయనపై చాలా కఠినమైన చర్య తీసుకోనున్నట్టు గవర్నర్ బోస్ తెలిపారు.

ఎస్పీ నేత ఆజంఖాన్‌కు ఏడేళ్ల జైలు
» డబుల్ పాన్ కార్డు కేసులో ఆయన కుమారుడికి కూడా



రాంపూర్, నవంబరు 17: డబుల్ పాన్ కార్డు కేసులో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సీనియర్ నేత ఆజంఖాన్, ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజంలను ప్రత్యేక ప్రజా ప్రతినిధుల కోర్టు దోషులుగా తేల్చింది. అబ్దుల్లా ఆజం అసలు పుట్టిన తేదీ 1993 జనవరి 1వ తేదీ కాగా, ఆయన 2017 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వయసు అడ్డంకిగా మారింది. దీంతో అప్పటికే ఉన్న పాన్ కార్డును పక్కనపెట్టి.. 1990 సెప్టెంబరు 30న జన్మించినట్లు తప్పుడు పత్రాలు చూపి మరో పాన్ కార్డు తీసుకున్నారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన గెలుపొందారు. దీనిపై బీజేపీ నేత ఆకాశ్ సక్సేనా 2019లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్లా ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు పాన్ నంబర్ ఇచ్చారని.. ఆజంఖానే తన కొడుకును ఎలాగైనా ఎన్నికల్లో పోటీ చేయించేందుకు కుట్ర చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక 77 ఏళ్ల ఆజంఖాన్‌పై భూకబ్జా, అవినీతి, మోసం, మేకల దొంగతనం వంటి మొత్తం 84 కేసులున్నాయి.

రిజర్వేషన్లు 50% దాటొద్దు!
» మహారాష్ట్ర స్థానిక సంస్థలపై సుప్రీంకోర్టు
» తదుపరి విచారణ 19వ తేదీకి వాయిదా



న్యూఢిల్లీ, నవంబరు 17: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు యాభై శాతం దాటరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి గతంలో తాము ఇచ్చిన తీర్పును మహారాష్ట్ర అధికారులు తప్పుగా అన్వయించారని వ్యాఖ్యానించింది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు సహా అన్ని రిజర్వేషన్లు యాభై శాతం దాటకుండా చూడాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బాంటియా కమిషన్ సిఫార్సుల మేరకు ఓబీసీ రిజర్వేషన్లను పెంచి అమలు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దాన్ని అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించగా సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. ఓబీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి 'ట్రిపుల్ టెస్ట్' పేరుతో మూడు షరతులు విధించింది. 1) రాష్ట్ర ప్రభుత్వం ఇదే అంశం మీద డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలి. కమిషన్ ఓబీసీల వెనుకబాటుతనం మీద ప్రతీ స్థానిక సంస్థ స్థాయిలో విశ్వసనీయమైన డేటాను సేకరించాలి. 2) ఆ డేటా ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ కోటాను నిర్ణయించాలి. 3) కోటాను నిర్ణయించే క్రమంలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు. సుప్రీంకోర్టు ఆదేశాన్ని అనుసరించి మహారాష్ట్ర ప్రభుత్వం బాంటియా కమిషన్ వేసింది. కమిషన్ సూచన మేరకు రిజర్వేషన్లు ఖరారు చేసింది. దాన్ని అమలు చేసే క్రమంలో రిజర్వేషన్లు 50 శాతం దాటాయంటూ ఇతరులు వేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ రాజ్యాంగ పరిధిలోనే ఉన్నట్లు ఎలా చెప్పగలరని సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు కదా? అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ జనరల్ తుషార్ మెహతాకు గుర్తు చేసింది. రేపట్నుంచే నామినేషన్లు మొదలవుతాయని తుషార్ మెహతా ప్రస్తావించారు. ఎన్నికల షెడ్యూల్‌పై తమకు అవగాహన ఉందని, దాని పేరుతో రాజ్యాంగ వ్యవస్థలను పలుచన చేయలేమని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ముందు 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రాతిపదిక అయిన బాంటియా కమిషన్ నివేదికను తాము అధ్యయనం చేయాల్సి ఉందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని, అయితే, 50 శాతం సీలింగ్‌ను దాటితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గతంలో మహారాష్ట్ర అంతటా జనాభా విస్తరణ తీరును పట్టించుకోకుండా 27 శాతం రిజర్వేషన్లను ప్రకటించారని, దాన్ని తాము కొట్టేశామని గుర్తు చేశారు. బాంటియా నివేదికకు ముందు, తర్వాత ఓబీసీ రిజర్వేషన్ల మీద రాష్ట్ర ప్రభుత్వ విధానంలో మార్పును నివేదిక రూపంలో సమర్పిస్తామని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఏ మార్పులు చేసినా రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశించిన 50 శాతం గీత దాటకుండా చూడాల్సిందేనని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. "ఎలాగైనా ఎన్నికలు జరిగేలా చూస్తాం కానీ రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ఉల్లంఘించేందుకు అనుమతించం" అని చెప్పారు. బాంటియా కమిషన్ నివేదిక ట్రిపుల్ టెస్ట్‌కు లోబడి ఉందా? లేదా చూస్తామని ప్రకటించారు. ఇక్కడ ఓబీసీ రిజర్వేషన్లనే చర్చిస్తున్నప్పటికీ మొత్తం వర్టికల్ రిజర్వేషన్లు 50 శాతం దాటడానికి వీల్లేదని జస్టిస్ బాగ్చీ తేల్చిచెప్పారు. శుక్రవారం(21వ తేదీ) వరకు విచారణను వాయిదా వేయాలని సొలిసిటర్ జనరల్ కోరారు. అప్పటికి నామినేషన్ల ప్రక్రియ పూర్తవుతుందని, దాన్ని వాయిదా వేస్తే విచారణను వాయిదా వేస్తామని జస్టిస్ సూర్యకాంత్ మెలిక పెట్టారు. ఈ మధ్యకాలంలో జరిగే ప్రక్రియ మొత్తం సుప్రీంకోర్టు తుది ఆదేశాలకు లోబడి ఉంటుందని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. దాంతో విచారణను బుధవారం(19వ తేదీ) వరకు వాయిదా వేశారు. ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేయగా హైకోర్టు జీవోపై స్టే ఇచ్చింది. స్టే నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దాంతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయి.




ఢిల్లీలో ఎవరికి వారే!
» ప్రధానిని ఒంటరిగా కలిసిన ముఖ్యమంత్రి
» ఖర్గేతో డీకే, సిద్దూ వేర్వేరుగా సంప్రదింపులు

బెంగళూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. సీఎం సిద్దరామయ్య సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకుని, సాయంత్రం ప్రధాని మోదీని కలిశారు. 40 నిమిషాలపాటు చర్చించారు. ఉప ముఖ్యమంత్రి శివకుమార్ 3రోజులుగా ఢిల్లీలోనే ఉన్నా, సీఎం ఒంటరిగానే ప్రధానిని కలవడం గమనార్హం. డీకే శివకుమార్ ఢిల్లీ నుంచి 3 గంటలకు బెంగళూరు బయల్దేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో రాత్రి సిద్దరామయ్య భేటీ అయ్యారు. ఢిల్లీలో మూడు రోజులు గడిపిన డీకే శివకుమార్, తన తమ్ముడు సురేశ్‌తో కలసి ఆదివారం ఖర్గేతో భేటీ అయ్యారు. కాగా, సీఎం సిద్దరామయ్య శనివారం మధ్యాహ్నం రాహుల్‌గాంధీని కలిసిన విషయం తెలిసిందే. అప్పటికే ఢిల్లీకి డీకే శివకుమార్ కూడా చేరుకున్నారు. అయినా రాహుల్‌గాంధీని, ఖర్గేని సీఎం ఒంటరిగానే కలిశారు. మొత్తంగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మూడు రోజులుగా ఢిల్లీలో ఎవరికి వారే అన్నట్లు వ్యవహరించారు.

రష్యాతో వ్యాపారం చేస్తే 500% టారిఫ్
» సెనెట్‌లో ట్రంప్ బిల్లు
» మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రకటన
» భారత్‌పై తీవ్ర ప్రభావం



వాషింగ్టన్, నవంబరు 17: రష్యాతో వ్యాపారాలు చేసే దేశాలపై మరింత కఠినంగా వ్యవహరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించుకున్నారు. రష్యా నుంచి వస్తువులను దిగుమతి చేసుకునే భారత్ వంటి కొన్ని దేశాలపై ఇప్పటికే సుంకాలను 25% వరకు పెంచారు. దానికితోడు మరో 25% జరిమానా విధించారు. దాంతో అమెరికా విధించే టారిఫ్ 50 శాతానికి పెరిగింది. అది చాలదన్నట్టుగా టారిఫ్‌ను ఏకంగా 500 శాతానికి పెంచాలని ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం సెనేట్‌లో బిల్లును ప్రవేశపెట్టారు. అది ఆమోదం పొందితే రష్యాతో వ్యాపారం చేసే అన్ని దేశాలపై సుంకాలు పెంచే చట్టబద్ధ అధికారం అమెరికాకు లభిస్తుంది. దీనిపై ఉదయం మీడియాతో మాట్లాడుతూ 'రష్యాతో వ్యాపారం చేసే దేశమేదైనా సరే చాలా భారీగా ఆంక్షలు మోపుతామ'ని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై దాడి చేసిన దగ్గర నుంచి గత మూడేళ్లుగా పలు రూపాల్లో రష్యాపై ఆంక్షలు విధిస్తున్న ట్రంప్ ప్రస్తుతం ఆ దేశంతో వ్యాపారాలు చేసే దేశాలపైనా మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఆ దేశాలు అమెరికాకు చేసే ఎగుమతులపై అతి భారీగా పన్నులు పెంచాలని నిర్ణయించారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడాన్ని నిలిపివేయాలని ఇప్పటికే భారత్‌కు గట్టిగా చెప్పారు. ఈ నేపథ్యంలో భారత్ కూడా కొనుగోళ్లను నిలిపివేసిందని గత నెలలో ఆయన ప్రకటించారు. మరోవైపు ద్వైపాక్షిక వాణిజ్యంపై భారత్-అమెరికాల మధ్య జరుగుతున్న చర్చలు కీలక దశకు చేరుకున్న సమయంలో ట్రంప్ తీసుకొస్తున్న తాజా బిల్లు తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ కారణంగా భారత్ కొన్ని అంశాల్లో తగ్గాల్సిన పరిస్థితి ఎదురయింది. ప్రస్తుతం విధిస్తున్న 50 శాతం టారిఫ్‌ల కారణంగా గత అయిదు నెలల్లో భారత్ నుంచి అమెరికాకు జరిగే ఎగుమతులు 37 శాతం పడిపోయాయి. క్రిస్మస్ పండగ కోసం పెట్టే దుస్తుల ఆర్డర్లలోనూ తగ్గుదల కనిపించింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో చర్చలు ద్వారా తగిన సర్దుబాట్లు చేసుకొని బయటపడాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు ఒక్క రష్యానే కాకుండా, ఇరాన్‌తోనూ వ్యాపారాలు చేసే దేశాలపైనా ఇదేవిధంగా భారీగా ఆంక్షలు విధిస్తామని ట్రంప్ స్వయంగా చెప్పడం గమనార్హం.

అమెరికా నుంచి వంట గ్యాస్!
(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. అమెరికాలోని గల్ఫ్ తీరం నుంచి 2026 సంవత్సరానికి 22 లక్షల టన్నుల ఎల్‌పీజీని చమురు కంపెనీలు దిగుమతి చేసుకుంటాయని తెలిపారు. ఇది భారత్ ఏటా దిగుమతి చేసుకునే ఎల్‌పీజీలో 10% ఉంటుందని తెలిపారు. అమెరికాతో ఎల్‌పీజీ కొనుగోలు ఒప్పందం చేసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి అని మంత్రి చెప్పారు. కాగా, "ఈ ఒప్పందానికి కొన్ని నెలల ముందు నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ), భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్)కు చెందిన అధికారుల బృందం పలు మార్లు అమెరికాలో పర్యటించింది. ఆ దేశంలోని పలు పెద్ద సంస్థలతో చర్చలు జరిపింది. ఇదొక చరిత్రాత్మక ఒప్పందం." అని మంత్రి పురి అన్నారు. ఎల్‌పీజీ వినియోగించే దేశాల్లో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాది ఎల్‌పీజీ ధరలు 60% మేర పెరిగాయని కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి తెలిపారు. దీని ప్రకారం ఒక్కొక్క సిలిండర్ ధర రూ.1,100లకు చేరిందన్నారు. అయినా ఆ భారాన్ని ప్రజలపై వేయడం లేదని, రూ.40 వేల కోట్లకు పైగా సొమ్మును ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు.

కొత్త జిల్లాల్లో 'ఫోరం'లు ఏర్పాటు చేయండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటయిన 23 జిల్లాల్లో వినియోగదారుల 'ఫోరం'లు ఏర్పాటు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. వినియోగదారుల రక్షణ చట్టం - 2019 సెక్షన్ 28 ప్రకారం కొత్త జిల్లాల్లో 'ఫోరం'లు ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం.. ఈ అంశంపై ఇప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని గుర్తు చేసింది. ప్రభుత్వ న్యాయవాదులు నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరగా అందుకు ధర్మాసనం అంగీకరించింది. రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌ను నియమించడం లేదని పేర్కొంటూ న్యాయవాది బాగ్లేకర్ ఆకాశ్‌కుమార్ దాఖలు చేసిన 'పిల్'పైనా విచారణ జరిపింది. వారంరోజులు సమయం ఇస్తే నియామకం పూర్తిచేస్తామని ప్రభుత్వ న్యాయవాదులు చెప్పడంతో అందుకు అంగీకరించింది.

పీసీబీ అధికారిపై కలుషిత నీళ్లు పారబోత

» కాలుష్య పరిశ్రమలను మూసేయాలని డిమాండ్

» సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

సంగారెడ్డి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాలుష్య కారక పరిశ్రమలను మూసేయాలని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. దోమడుగు శివారులోని హెటిరో డ్రగ్స్-1 యూనిట్‌తో పాటు ఇతర రసాయన పరిశ్రమలను బంద్ చేయాలని కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది రైతులు సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. సమస్యను తెలుసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ప్రజావాణిలో ఉన్న కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) అధికారిని వారి వద్దకు పంపించారు. పీసీబీ అధికారి ఆందోళనకారులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీబీ అధికారుల నిర్లక్ష్యం వల్లే రసాయన పరిశ్రమలు పంట పొలాల్లోకి కాలుష్య జలాలను వదులుతున్నాయని అన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్ ముందు కాలుష్య జలాలను పారబోస్తున్న మహిళలు

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తులైన మహిళలు కలుషిత జలాలను పీసీబీ అధికారి కుమార్ పాదాలపై చల్లడంతో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం రైతులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

రేషన్ డీలర్ నుంచి రూ.30 వేల లంచం

» ఏసీబీ వలలో ఇల్లందు సివిల్ సప్లయీస్ డీటీ

» టెక్నికల్ అసిస్టెంట్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కూడా అరెస్టు


డీటీ యాకుబ్ పాషా, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరీశ్

ఇల్లందు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపు స్టాక్‌లో తేడాను ఆసరాగా చేసుకుని సదరు షాపును సీజ్ చేయకుండా రూ.30 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్.. సోమవారం ఏసీబీకి చిక్కిన ఘటన భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో జరిగింది. ఇల్లందు, టేకులపల్లి మండలాల సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ ఎండీ యాకుబ్ పాషా ఈ నెల 7న ఇల్లందు మండలంలోని ఓ గిరిజన మహిళా డీలర్ నడుపుతున్న రేషన్ షాపును తనిఖీ చేసినప్పుడు ఉండాల్సిన స్టాక్ కంటే తక్కువగా ఉన్నందున ఆ షాపును సీజ్ చేయాల్సి ఉంటుందన్నారు. అలా షాపును సీజ్ చేయకుండా ఉండాలని సదరు మహిళా డీలర్‌ను యాకుబ్ పాషా డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆయన వద్ద టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయ్.. ఆ డబ్బు చెల్లించాలని సదరు డీలర్‌పై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన మహిళా డీలర్.. వారి సూచన మేరకు ఇల్లందులోని జగదాంబ సెంటర్‌లోని ఓ మొబైల్ షాపులో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శబరీశ్‌కు సోమవారం రూ.30 వేల నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శబరీశ్‌తోపాటు డీటీ యాకుబ్ పాషా, ఆయన టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌లను అరెస్టు చేశామని ఏసీబీ ఖమ్మం డీఎస్పీ రమేశ్ మీడియాకు చెప్పారు.

భార్య మరణిస్తుందని తెలిసి భర్త ఆత్మహత్య

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్య మృతి


శ్రావ్య, విజయ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): భార్య మరణిస్తుందనే వార్తను తట్టుకోలేక ఓ భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సోమవారం జరిగింది. బెంగళూరుకు చెందిన విజయ్ (40), శ్రావ్య (40) దంపతులు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ ఏడాదిగా శంషాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. చాలారోజులుగా వారికి సంతానం కలుగకపోవడంతో ఐవీఎఫ్ ద్వారా ప్రయత్నించారు. ప్రస్తుతం 8 నెలల గర్భంతో ఉన్న శ్రావ్యకు ఈ నెల 16న కడుపునొప్పి రావడంతో అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు కడుపులో ఉన్న ఇద్దరు కవల పిల్లలు మృతి చెందారని, ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అది విన్న విజయ్ తట్టుకోలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అటు ఆస్పత్రిలో చావుబతుకుల్లో ఉన్న శ్రావ్యను మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. అందుకోసం విజయ్‌కు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో శ్రావ్యను ఆమె తల్లి మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రావ్య చనిపోయింది. ఆస్పత్రిలో భార్య, ఇంట్లో భర్త చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీజేఐపై దాడి అమానుషం: మందకృష్ణ

న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని, ఇది దేశంలోని 30 కోట్ల దళితుల మీద జరిగిన దాడి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దళిత ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడారు. ధర్మం, విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించవా..? వారి మీద చర్యలు తీసుకోరా..? అని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ, ఢిల్లీ పోలీసు వ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్.. తమ విధులను నిర్వర్తించడంలో పూర్తి వివక్షను ప్రదర్శించాయని ఆరోపించారు. ఎన్నో ఘటనల మీద సుమోటోగా కేసులు తీసుకున్న వ్యవస్థలు.. సీజేఐ మీద దాడి జరిగితే ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. దళితుల విషయంలో వ్యవస్థలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని మందకృష్ణ ఆరోపించారు. సభకు ఎమ్మార్పీఎస్ నేతలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

బీసీ రిజర్వేషన్లపై సీఎం ఢిల్లీకి వెళ్లాలి: జాజుల

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి నేతృత్వంలో వెంటనే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లాలని, దీనికి సంబంధించి తేదీని ఖరారు చేయాలని బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో సమావేశం తర్వాత సచివాలయం మీడియా పాయింట్ వద్ద జాజుల మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. వచ్చేనెలలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా కూటమి తరఫున బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడాలని కాంగ్రెస్ నేతలను కోరారు. కేంద్రాన్ని నిలదీసేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా, వాటిపై స్పష్టత రాకుండా ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని జాజుల హెచ్చరించారు.

శ్రీధర్‌బాబు వల్లే నాపై సీబీఐ విచారణ

» మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

» సీబీఐ విచారణకు హాజరైన మధు దంపతులు



గోదావరిఖని, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రోద్బలంతోనే న్యాయవాదులు గట్టు వామనరావు, నాగమణి దంపతుల హత్య కేసులో తనను వేధింపులకు గురిచేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. ఈ కేసులో మొదట తన పేరు లేదని, వామనరావు తండ్రితో శ్రీధర్‌బాబు తనపై కేసు పెట్టించారని అన్నారు. ఈ హత్య కేసులో సోమవారం తన సతీమణి శైలజతో కలిసి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సీబీఐ విచారణకు మధు హాజరయ్యారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీబీఐ అధికారులు మధు దంపతులను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారించారు. విచారణ అనంతరం పుట్ట మధు మీడియాతో మాట్లాడారు. వామనరావు దంపతుల హత్య కేసులో సీబీఐ విచారణను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. గతంలో పోలీసులు అడిగిన ప్రశ్నలనే సీబీఐ అధికారులు కూడా అడిగారని తెలిపారు. 'ఈ కేసులో నిందితుడు బిట్టు శ్రీనివాస్ నా అక్క కొడుకు. ఈ రోజుల్లో కన్నకొడుకు తప్పు చేస్తేనే తండ్రి బాధ్యత వహించడం లేదు. మేనల్లుడిపై హత్యారోపణలు ఉంటే నేనెలా బాధ్యుడిని అవుతా? హత్య జరిగిన రోజు వామనరావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో నా పేరు లేదు. ఆ తరువాత శ్రీధర్‌బాబు ఆయనను రెచ్చగొట్టి నా పేరు, నా భార్య పేరు, నా అనుచరుడు పూదరి సత్తయ్య పేరును చేర్పించారు' అని ఆరోపించారు. వామనరావు తండ్రికి సుప్రీంకోర్టుకు వెళ్లే స్థోమత లేదని, శ్రీధర్‌బాబే ఆయనను సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లి తమపై సీబీఐ విచారణ జరిపేలా చేశారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన మధుకర్ మృతి వెనుక శ్రీధర్‌బాబు హస్తం ఉందని ఆరోపించారు.

బీడీలు చుడితే బీమారే!

మహిళా బీడీ కార్మికుల్లో 80 శాతం మందికి అనారోగ్య సమస్యలు

» పొగాకు ధూళి, గంటల తరబడి కూర్చుని పనిచేయడం కారణం

» నిజామాబాద్ జిల్లాలో అధ్యయనం

» ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురణ

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జీవనాధారం కోసం బీడీలు చుట్టే వృత్తిలో ఉన్న మహిళా కార్మికులను ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అటు పరిశ్రమలోనైనా.. ఇటు ఇంట్లోనే అయినా.. పొగాకు ధూళి, ఒకే భంగిమలో కూర్చుని గంటల తరబడి పనిచేయడం వల్ల శ్వాసకోశ, కండరాల వ్యాధులతో వారు సతమతమవుతున్నారు. దాదాపు 80 శాతం మంది మహిళా బీడీ కార్మికుల్లో ఏదో ఒక అనారోగ్య సమస్య ఉన్నట్లు తాజా పరిశోధనలో వెల్లడైంది. నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన ఈ అధ్యయనం మహిళా కార్మికుల దుర్భర ఆరోగ్య పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపింది. 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ అండ్ పబ్లిక్ హెల్త్' నవంబరు సంచికలో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి. డాక్టర్ దావా శ్వేత(అరుంధతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్), డాక్టర్ బచ్చు నాగ గాయత్రి, డాక్టర్ సంధ్య గుండ (ప్రభుత్వ ఆస్పత్రి, నిజామాబాద్) సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించారు. దీని ప్రకారం 80శాతం మంది నొప్పి, దగ్గు, తలనొప్పితో బాధపడుతున్నట్లు వెల్లడైంది. 60.8శాతం మంది కండరాల నొప్పులతో, తలనొప్పితో 49.7%, దీర్ఘకాలిక దగ్గుతో 45.9%, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో 34.3 శాతం, కంటి దురదతో 30.9 శాతం, చర్మ సమస్యలతో 19.3 శాతం, నెలసరి సమస్యలతో 13.8 శాతం మంది బాధపడుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా 15-24 ఏళ్ల వయస్సు వారే 29.3% మంది ఉండటం గమనార్హం.



చిన్న వయస్సులోనే వీరి ఆరోగ్యం దెబ్బతింటోంది.

ఇంట్లో పని కాబట్టి సురక్షితమేననే అపోహ

బీడీ కార్మికుల్లో తాము చేసే పనిపై సరైన అవగాహన ఉండటం లేదు. తాము చేస్తున్న పని ప్రమాదం అని తెలిసినప్పటికీ రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఈ అధ్యయనం వెల్లడించింది. 62.4 శాతం మందికి పొగాకు ధూళి హానికరమని తెలుసు. కేవలం 15.5శాతం మందే మాస్కులు, గ్లౌజులు వంటివి వాడుతున్నారు. బీడీలు చుట్టే పనిని ఇంట్లోనే చేస్తున్నందున సురక్షితమైనదని 50.3శాతం మంది భావిస్తున్నారు. సర్వేలో పాల్గొన్న కార్మికుల్లో దాదాపు 60 శాతం మంది ప్రత్యామ్నాయ జీవనోపాధి దొరికితే బీడీలు చుట్టే పనిని వదిలివేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కూడా వీరికి అవగాహన చాలా తక్కువని తేలింది. కేవలం 19.9శాతం మందికే పథకాల గురించి తెలుసన్నారు.

అధ్యయనం ఇలా...:

ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య నిజామాబాద్ జిల్లాలో 181 మంది మహిళా బీడీ కార్మికులపై పరిశోధకులు అధ్యయనం చేశారు. కార్మికుల్లో 15-64 ఏళ్ల వారు ఉన్నారు. వీరిలో 36 శాతం మంది నిరక్షరాస్యులే. 50 శాతం మంది పదేళ్లకు పైగా బీడీలు చుడుతుండగా 33 శాతం మంది 5-10 ఏళ్లుగా పనిచేస్తున్నారు. మిగిలినవారు ఐదేళ్లలోపు ఈ వృత్తిలో ఉన్నారు.

తక్షణ చర్యలు అవసరం: పరిశోధకులు

మహిళా బీడీ కార్మికుల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని అధ్యయనకర్తలు సూచించారు. వృత్తిపరమైన ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన పెంచాలని పేర్కొన్నారు. కార్మికుల కోసం అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేయాలని, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను చూపించాలని సూచించారు.

ప్రమాదమని వారికి తెలియదు



బీడీలు చుట్టడం వల్ల తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలు వస్తాయని మహిళా కార్మికులకు తెలియదు. ప్రమాదకర వాతావరణంలో పనిచేస్తున్నట్లు వారికి అర్థం కావడం లేదు. సాధారణ మహిళలతో పోలిస్తే బీడీలు చుట్టే వారిలో నెలసరి సమస్య చాలా ఎక్కువగా ఉంది. గంటలకొద్దీ బీడీలు చుడుతుండటం వల్ల వారిలో మెడ, నడుంనొప్పి లాంటి సమస్యలు ఎక్కువగా కనిపించాయి. కార్మికుల్లో పాలిచ్చే తల్లులు ఉండడం వల్ల వారి పిల్లల్లోనూ ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

-డాక్టర్ బచ్చు నాగ గాయత్రి, అధ్యయనకర్త, ప్రభుత్వ బోధనాస్పత్రి, నిజామాబాద్

ఢిల్లీ కాలుష్యంపై సమగ్ర ప్రణాళికతో రండి

» మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి

» పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, నవంబరు 17: ఢిల్లీ-ఎన్‌సీఆర్(జాతీయ రాజధాని ప్రాంతం)లో గాలి కాలుష్యం సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక చర్యలు అవసరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, గ్రాప్(గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్) కింద కాలుష్య నియంత్రణకు ఉద్దేశించిన అత్యవసర చర్యలను ఏడాది పొడవునా అమలు చేసేలా ఆదేశించేందుకు నిరాకరించింది. పంట వ్యర్థాల దహనం విషయంలో సీఏక్యూఎం(గాలి నాణ్యత నిర్వహణ కమిషన్) మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను ఆదేశించింది. సీఏక్యూఎం మార్గదర్శకాలను ఆ రెండు రాష్ట్రాలు అమలు చేసి ఉంటే, సాధ్యమైనంత వరకు సమస్య పరిష్కారమయ్యేదని వ్యాఖ్యానించింది. సీఏక్యూఎం మార్గదర్శకాలను చిత్తశుద్ధితో అమలు చేసేందుకు రెండు రాష్ట్రాలు సంయుక్త సమావేశాన్ని నిర్వహించాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజరియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఆదేశించింది. ఈ అంశంపై ఈనెల 11న కేంద్ర పర్యావరణ మంత్రి సమావేశం నిర్వహించారని గుర్తు చేసింది. కాలుష్య సమస్య పరిష్కారానికి తగిన చర్యలు గుర్తించేందుకు తగిన ఆదేశాలను ఒక్క రోజులోనే ఇవ్వొచ్చని వ్యాఖ్యానించింది. బుధవారం సమగ్ర ప్రణాళికతో రావాలని అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. అదే రోజు తాము కూడా మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపింది. తీవ్రస్థాయిలో ఉన్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎప్పటికప్పుడు తగిన ఆదేశాలు జారీ చేస్తామంది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. కాగా, పంట వ్యర్థాల దహనం ఘటనలు తగ్గినప్పటికీ కాలుష్యం స్థాయి తగ్గలేదని పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాన్ని అమికస్ క్యూరీ అపరాజితా సింగ్ ప్రస్తావించగా.. తాత్కాలిక చర్యలు స్థిరమైన పరిష్కారాన్ని ఇవ్వలేవని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌లా మారినందున కాలుష్య కారక కార్యకలాపాలను ఏడాది మొత్తం నిషేధించాలని సీనియర్ అడ్వొకేట్ గోపాల్ శంకరనారాయణన్ చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఏక్యూఐని కొలిచేందుకు అధునాతన పరికరాలు ఉపయోగిస్తున్నారో లేదో ఢిల్లీ ప్రభుత్వంతోపాటు, ఇతర అధికారులు అఫిడవిట్లు దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

మెడికల్ షాపులపై డీసీఏ దాడులు

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) దృష్టి సారించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మందుల షాపులపై అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యంగా 'షెడ్యూల్-1' రకం డ్రగ్స్ విక్రయాలపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో శక్తిమంతమైన యాంటీబయాటిక్స్‌తో పాటు మత్తు కలిగించి, దాన్ని వ్యసనంగా మార్చే ఔషధాలున్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన 196 మెడికల్ షాపులకు 'షోకాజ్' నోటీసులు ఇచ్చామని డీసీఏ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం పేర్కొన్నారు. మందులకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు, నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాల్లో అనుమానాస్పద డ్రగ్స్ తయారీ(నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలు సహా) గురించి ప్రజలు ఫిర్యాదు చేయాలనుకుంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005996969కి ఫోన్ చేయవచ్చన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని నిర్ణయించడానికి అక్కడి ట్రిబ్యునల్‌కు నూటముప్పైరోజులు సరిపోయింది. నూటముప్పైఐదు పేజీల చార్జిషీటు చేతధరించి ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ ఆమె ఎన్నిదుర్మార్గాలకు పాల్పడిందో ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నవారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతా బలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించారంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు బాధపడ్డారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం, మన దేశం పొరుగుదేశాన్ని పొగుడుతూనే, అసలు విషయాన్ని నాన్చివేయడం చూస్తూనే ఉన్నాం.

ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు అని హసీనా కుమారుడు గతంలోనే వ్యాఖ్యానించారు. ట్రిబ్యునల్ విధించబోయేది మరణశిక్ష అని కూడా అన్నారు. హసీనా సైతం తీర్పుకు ముందు ఓ సందేశాన్ని విడుదలచేస్తూ, తీర్పు ఎలా ఉన్నా బాధపడవద్దని తన అవామీలీగ్ కార్యకర్తలను కోరారు. ఆ మాట అంటూనే, తనకు వ్యతిరేకంగా ట్రిబ్యునల్ ఇవ్వబోయే ఏకపక్ష, అప్రజాస్వామిక తీర్పును నిరసించమని కూడా ఆమె ఆదేశించినమేరకు బంగ్లాదేశ్‌లో ఎంత నియంత్రించినా హింస జరిగింది. సరిగ్గా యాభైయేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియావుర్ రహ్మాన్ భార్య ఖలీదా

బంగ్లాకు మరో ఆయుధం!

జియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజిబుర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. గద్దెనెక్కిన ఐదేళ్ళలో మళ్ళీ దిగవలసి వచ్చింది కానీ, ఆ తరువాత అధికారాన్ని శాశ్వతం చేసుకోవడం ఎలాగో ఆమెకు తెలిసొచ్చింది. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండగా ఉన్న జమాతే వంటి ఇస్లామిక్ ఛాందస శక్తులను అధికారికంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండాడారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచిపేరుతెచ్చుకుంది. కానీ, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆమె అనుసరించిన అనైతిక విధానాల మీద విమర్శలు కాదనలేనివి.

తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే.

ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజారింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించుకున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటి వరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజిబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సైతం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోత కోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం.

ట్రిబ్యునల్ తీర్పు వరకూ ఆగకుండానే, యూనిస్ ప్రభుత్వం ఎప్పుడో ఆమె పార్టీని నిషేధించి ఎన్నికల్లో పాల్గొనకుండా చేసింది. అధికార వ్యవస్థలన్నీ కలసికట్టుగా ఆమెను భౌతికంగా అంతం చేయడానికి ఇప్పుడు సిద్ధపడుతున్నాయి. దేవుడు ఇచ్చిన ప్రాణాన్ని ఆయన మాత్రమే తీసుకోగలడు, అప్పటివరకూ ప్రజలకోసం పనిచేస్తాను అని హసీనా తన కార్యకర్తలకు ధైర్యవచనాలు చెబుతున్నారు కానీ, యాభైయేళ్ళ తరువాత, మళ్ళీ మన దేశంలో తలదాచుకున్న ఆమె, తిరిగి బంగ్లాలో కాలూని యుద్ధం చేయగల అవకాశం లేనేలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగింత కోరిన యూనిస్ ప్రభుత్వానికి మన మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది అంతే.

ఎర్రకోట ఘటన దేశానికి ఓ హెచ్చరిక

ఈ నెల 10న ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంతంలో జరిగిన భయంకరమైన పేలుడుతో మన దేశం సహా, ఉగ్రవాదుల చర్యలతో సతమతమవుతున్న అన్ని దేశాలూ ఉలిక్కిపడ్డాయి. కొందరి పాశవిక ఆలోచనలతో కూడిన ప్రవర్తన వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతాయి. ఈ ఘటనపై ప్రభుత్వం సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేయించి, దీన్ని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కు అప్పగించింది. పేలుడు ఘటనకు కారణమైన కారు ఉమర్–ఉన్–నబీ అనే డాక్టర్‌దని, ఆయన కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందినవాడని ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఎర్రకోటను మరొక డాక్టర్ ముజమ్మిల్ గనై సందర్శించాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అయితే, ఘటనకు ముందే (అక్టోబర్ 30న) ఉగ్రవాద అనుమానితుడిగా పేర్కొంటూ ముజమ్మిల్‌ను కశ్మీర్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరి ఫొటోలు దర్యాప్తు సంస్థలకు చిక్కాయి. ఈ ఇద్దరు డాక్టర్లు పుల్వామాకు చెందినవారే. వీరు అల్–ఫలాహ్ యూనివర్సిటీ (హర్యానా)లో పనిచేస్తున్నారు. ముజమ్మిల్, అతని సోదరుడు కొన్నేళ్ల క్రితం టర్కీని సందర్శించినట్లుగా ఆధారాలు ఉన్నాయి. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ టెర్రరిస్టు సంస్థతో వీరికి ఒక హ్యాండ్లర్ ద్వారా సంబంధాలు ఏర్పడ్డాయని తెలుస్తోంది.

వీళ్ళిద్దరూ అల్–ఫలాహ్ యూనివర్సిటీలో పనిచేస్తున్నంత మాత్రాన మొత్తం యూనివర్సిటీ వారందరినీ అనుమానితుల జాబితాలో చేర్చడం తప్పు. ఉగ్రవాదుల ముఖ్యోద్దేశ్యం కూడా అదే. ఏదోవిధంగా మతోన్మాదాన్ని రెండు వర్గాల మధ్య రగిల్చి, ఆ వర్గాలను వీడదీసి, తమ పబ్బం గడుపుకుందామనే. అది సాగనీయకుండా చేయటమే ప్రభుత్వాలు, పాలకులు, ప్రతిపక్షాలు, ప్రజల కర్తవ్యం. రాజకీయాలు ప్రవేశించనంత వరకూ మతానికి సంబంధించిన గొడవలు అడపాదడపా జరుగుతాయి కానీ – మూకుమ్మడిగా చంపుకోవటాలూ, గృహ దహనాలూ, పెచ్చరిల్లిన వైషమ్యాలు... వంటివన్నీ కొంతమంది స్వలాభం కోసం రాజకీయాల్లోకి ప్రవేశించడం వల్లనే ఇవి జరుగుతున్నాయి. సమాజంలో వర్గాలు ఏర్పడినప్పుడే అణచటానికి వీలులేని విధంగా గొడవలు విస్తరిస్తాయి.



ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కౌంటర్ టెర్రరిజం చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. మన చట్టాలను పటిష్ఠరీతిలో అమలుచేయటంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలను బలోపేతం చేసి, ఉగ్రవాద చర్యలకు కేంద్రం చాలావరకు చెక్ పెట్టిన మాట వాస్తవం.

ఈ దాడి మరింత వికృత రూపం దాల్చకుండా ఉండడానికి ఒక ప్రధాన కారణం డా. జీవీ సందీప్ చక్రవర్తి. ఈయన 2014 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. అయన సమయస్ఫూర్తితో అత్యంత చాకచక్యంగా వ్యవహరించారని కథనాలు వస్తున్నాయి. కొంతమంది పోస్టర్లు మాత్రమే చూస్తారు. సందీప్ చక్రవర్తి లాంటి పోలీసు అధికారులు ఆ పోస్టర్ వెనకాల 'ప్లాన్' కూడా కనిపెడతారు. కశ్మీర్‌లోని నవ్‌గాంలో జైషే మహ్మద్ పోస్టర్లు చూసిన వెంటనే సందీప్ ఎంక్వైరీ చేయించారు. దాంతో 2,900 కిలోల ఐఈడీ, స్లీపర్ సెల్స్–నెట్‌వర్క్, ఇండియా మొత్తాన్ని కబళించే ఎత్తుగడలు బయటపడ్డాయి. 'అది కేవలం పోస్టర్' అని సందీప్ తీసిపారేసినట్లయితే ఈపాటికి దేశమంతటా ఎన్నో పేలుళ్లు సంభవించేవి. ఈ ఆఫీసర్ ఇప్పటికే ఆరు గాలంట్రీ అవార్డులు పొందారు. సందీప్ తెలుగువాడు కావటం మనందరికీ గర్వకారణం.

పూర్తి విచారణ తర్వాతే మిగిలిన చాలా అంశాలు వెలుగులోకి వస్తాయి. పేలుడులో చనిపోయిన డాక్టర్‌కు దేశంలో చాలా మందితో లింకులు ఉన్నాయని, వీరంతా 'టెర్రర్ స్ట్రయిక్స్' చేయటానికి ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే అదృష్టవశాత్తూ ఈ కుట్ర భగ్నమైందని తెలుస్తోంది. అందుకే భారత ప్రభుత్వం, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తదితర సంస్థలు ఘటనకు సంబంధించి లోతైన దర్యాప్తును చేపట్టాయి. వార్తా సంస్థలు, ప్రతిపక్షాలు కూడా ఆచితూచి వ్యవహరిస్తేనే నిజానిజాలు శీఘ్రగతిన బయటకు వస్తాయి. లేకపోతే 'నిప్పొకచోట, నీళ్ళు మరో చోట' అన్నరీతిలో అనేక అవరోధాలు కల్పించినవారవుతారు. వ్యవస్థీకృత నేరాలు తరచూ జరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న మాట నిజం. అమెరికాలోని అధికార ప్రతినిధి– ఈ సందర్భంగా 'భారత్‌లోని దర్యాప్తు సంస్థలు క్రమపద్ధతిలో దర్యాప్తు చేస్తుండటం గమనార్హం' అని మీడియాకు చెప్పటం ఒక విధంగా ఉగ్రవాదుల చర్యలను పరోక్షంగా ఖండించినట్లే. భారతదేశ విదేశాంగమంత్రి జైశంకర్‌తో ఆ దేశపు డిఫెన్స్ సెక్రెటరీ మాట్లాడి, వివరాలు తెలుసుకోవటం కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఆసక్తిదాయకంగానే కనపడుతోంది.

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కౌంటర్ టెర్రరిజం చర్యలు ప్రత్యేకంగా సత్ఫలితాలు ఇస్తున్నాయి. నిజానికి ఉగ్రవాదుల చర్యలు అనేక దేశాలను వణికిస్తున్నాయి. మన చట్టాలను పటిష్ఠరీతిలో అమలుచేయటంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలను బలోపేతం చేసి, ఉగ్రవాద చర్యలకు కేంద్రం చాలావరకు చెక్ పెట్టిన మాట వాస్తవం. ఇలాంటి ఘటనలు జరగడానికి అవకాశం ఉన్న రాష్ట్రాలను ముందుగానే కేంద్రం హెచ్చరించి ముందు జాగ్రత్త చర్యలను తీసుకొనే విధంగా వాటిని సంసిద్ధపరచడం ద్వారా కూడా చాలావరకు సమస్యలు సమసిపోయాయి. సంసిద్ధంగా పోలీసు వ్యవస్థలూ, ఎన్ఐఏ లాంటి విభాగాల వల్ల ఎన్నో ఘటనలు ఆదిలోనే అంతమవుతున్నాయి. అయితే ఎర్రకోట పేలుడు లాంటి ఘటన దేశంలో ఎక్కడైనా జరిగితే... దేశంలో ఆందోళనలతో పాటు, విపక్ష నేతలు, మీడియా కూడా కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వాలనూ తప్పుబట్టడానికి అప్పుడప్పుడూ ప్రయత్నం చేస్తుంటాయి. అది సరికాదని అందరూ గమనించి, ప్రభుత్వాలకు తగు సహకారం అందిస్తేనే కౌంటర్ టెర్రరిజం చర్యలు ఫలవంతమవుతాయి. ఈ ఘటన అనంతరం దేశంలో నలుమూలలా అనేక అరెస్టులు జరిగాయి. ఆయుధాలతో పాటు, పేలుడు పదార్థాలనూ వెలికితీయటం వల్ల ఎలాంటి అనర్థాలూ జరగలేదు. అందుకే దేశరక్షణకు అప్రమత్తతతో పాటు అందరి సహకారం అవసరం.

● రావులపాటి సీతారాంరావు

చైనా చెప్పే 'డిజిటల్' పాఠాలు

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ నెలకొల్పనున్న నేపథ్యంలో సహజంగానే ఈ విషయంలో చైనా అనుభవం ప్రస్తావనకు వస్తుంది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అభివృద్ధి సాధిస్తేనే అమెరికాతో పోటీలో నిలువగలనని చైనా చాలా ముందుగానే గ్రహించింది. తమ ఆర్థిక వ్యవస్థను "మధ్య–ఆదాయ ఉచ్చు" (Middle income trap) నుంచి బయటపడేసి, యావత్ ప్రపంచానికి చౌక సరుకులను ఉత్పత్తిచేసే "ప్రపంచ కర్మాగారం" అనే పేరును పోగొట్టుకుని, అత్యున్నత సాంకేతికత, మేధో సంపత్తులను సృష్టించే సంపన్న దేశం స్థాయికి చేరవలసిన అవసరాన్ని చైనా గుర్తించింది.

మిగిలిన ప్రపంచం ఇటీవల ట్రంప్ విధించిన సుంకాలతోను, అమెరికా రక్షిత ఆర్థిక విధానాలతోను మేల్కొన్నదిగానీ, చైనా అంతకంటే ముందే అప్రమత్తమయ్యింది. అప్రతిహత సాంకేతికతతో ప్రపంచ దేశాలపైన అమెరికా చెలాయిస్తున్న ఆధిపత్యం గురించి 2013లో ఎడ్వర్డ్ స్నోడెన్ వెల్లడించిన విషయాలను చైనా గుర్తించి జాగ్రత్తపడింది.

2017లో అమెరికా ఎగుమతి చట్టాల ఉల్లంఘనకు సంబంధించిన పరిష్కార ఒప్పందాన్ని పాటించడంలో ప్రముఖ చైనీస్ కంపెనీ ZTE విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా వాణిజ్యశాఖ ఈ కంపెనీపై ఆంక్షలు విధించింది. ఆ తరువాత ప్రపంచ నెట్‌వర్క్ పరికరాల తయారీదారులలో అతిపెద్దది, 5జీ సాంకేతికతలోను, సెల్‌ఫోన్ల తయారీలోను అగ్రగామిగా ఉన్న హువావేతో పాటు అనేక ఇతర చైనీస్ కంపెనీలు 'ఎంటిటీ లిస్ట్'లో ఉన్నాయని 2019మే నెలలో అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. ఈ జాబితాలో ఉన్న కంపెనీలు అమెరికాలో పనిచేసే ఏ సంస్థతోనూ వ్యాపారం చేయలేవు. దీని ప్రకారమే హువావేకు అకస్మాత్తుగా గూగుల్, క్వాల్కామ్, ఇంటెల్ వంటి అమెరికన్ కంపెనీలతో సంబంధాలు తెగిపోయాయి. హువావే సెల్‌ఫోన్లకు ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించటం కూడా వీలు కాకుండా పోయింది.

ఇదంతా జరగడానికి చాలా ముందుగానే 2015లో 'మేడ్ ఇన్ చైనా–2025 ఇనిషియేటివ్' పేరుతో చైనా కొన్ని లక్ష్యాలను ప్రకటించింది. వీటిలో ముఖ్యమైనవి– తదుపరి తరం ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) అభివృద్ధిలో సెమీ కండక్టర్ల తయారీ; 5జీ అభివృద్ధి; ఏఐలో అగ్రగాముల జాబితాలో చేరటం... మొదలైనవి. 2025 నాటికి 70శాతం స్వయం సమృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాల దిశగా ప్రయివేటు రంగాన్ని, విశ్వవిద్యాలయాలను, పరిశోధనాశాలలను సమన్వయం చేసే పక్కా ప్రణాళికను, దాని అమలు వ్యూహాన్ని చైనా రూపొందించింది. ముందుగా వందల బిలియన్ డాలర్ల విలువైన నిధులను సిద్ధం చేసింది. ఈ నిధులతో దేశీయ ప్రయివేటు కంపెనీలకు సబ్సిడీలు, ఈక్విటీ పెట్టుబడులు, తక్కువ వడ్డీ రుణాలు, పన్ను మినహాయింపులు, భూముల కేటాయింపులు జరిగేలా చూసింది. ఈ కంపెనీలు అభివృద్ధి చేసే సాంకేతికలు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండేలా చూడడానికి 'చైనా స్టాండర్డ్స్–2035' ప్రణాళికను ప్రకటించింది.

విదేశీ కంపెనీలపై ఆధారపడటానికి బదులు దేశీయ ప్రయివేటు కంపెనీలను దిగ్గజాలుగా మార్చేందుకు ప్రయత్నించటం వల్ల చైనాలో పారిశ్రామిక అనుకూల వాతావరణం ఏర్పడింది. టెలీ కమ్యూనికేషన్ పరికరాలలో హువావే, ZTE; సెమీకండక్టర్ తయారీలో SMIC, NAND; ఫ్లాష్ మెమొరీలో యాంగ్జీ మెమొరీ టెక్నాలజీస్; డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డిజిటల్ సేవలలో బైడు, అలీబాబా, టెన్సెంట్ (BAT) వంటి ప్రయివేటు రంగ కంపెనీలు తమతమ క్షేత్రాలలో ప్రపంచ స్థాయి సాంకేతికతలను సాధించటానికి ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం ఒక సురక్షిత దేశీయ మార్కెట్‌ను సృష్టించింది. ఇక్కడ ఈ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా పోటీపడటానికి ముందు తగినంతగా వృద్ధి చెందుతాయి, ఆవిష్కరణలు చేస్తాయి.

మరోవైపు తమ కంపెనీలు మేధో సంపత్తిని సముపార్జించటం పైన కూడా చైనా దృష్టిపెట్టింది. విదేశీ కంపెనీలు విస్తారమైన చైనీస్ మార్కెట్‌ను ఉపయోగించుకోవడానికి ఒక షరతుగా వారు చైనీస్ భాగస్వాములతో జాయింట్ వెంచర్‌లను ఏర్పరచుకోవాలి, మేధో సంపత్తిని బదిలీ చేయాలి. అలాగే సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్ విద్యపైన భారీగా చేస్తున్న వ్యయం వల్ల ఏటా ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్‌లను చైనా ఉత్పత్తి చేస్తున్నది. సాంకేతికతలో అభివృద్ధి చెందిన దేశాలతో అంతరాలను వేగంగా తగ్గించటానికి విభిన్న సాంకేతికలపై పట్టున్న అనేక ఐరోపా, ఇజ్రాయెలీ కంపెనీలను చైనీస్ కంపెనీలు కొనుగోలు చేశాయి. ఇలా కొనుగోలు చేసిన సాంకేతికలను, బైడు, హువావే వంటి దేశీయ కంపెనీలు అభివృద్ధి చేసిన వాణిజ్య ఏఐ, సెమీ కండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికలను చైనా తన రక్షణ పరిశ్రమలలో వినియోగిస్తుంది. పరిశోధన, నిధులు, ప్రతిభను సైనిక, పౌర రంగాలు పరస్పరం పంచుకుంటాయి. అలా రెండింటిలోనూ ఆవిష్కరణలను వేగవంతం చేస్తారు. అంతేకాకుండా చైనా నిర్మించిన బలమైన ఇంటర్నెట్ వ్యవస్థలో గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్‌లకు ప్రత్యామ్నాయంగా బైడు, విచాట్, అలీబాబా ఆవిర్భవించాయి. ఈ దేశీయ కంపెనీలు అంతర్జాతీయ కంపెనీలుగా ఎదగడానికి, స్వదేశంలో ఆధిపత్యం చెలాయించడానికి కావలసిన రక్షణలతో పాటు నిధులను అందించి ప్రభుత్వమే వాటికి మార్గాన్ని సుగమం చేసింది. అంతేగాక కోట్లాది వినియోగదారులకు సేవలందించడం ద్వారా ఇ–కామర్స్, మొబైల్ చెల్లింపులు, ఏఐ అప్లికేషన్‌లకు అసమానమైన పరీక్షా క్షేత్రాన్ని చైనా ప్రభుత్వం అందించటంతో అభివృద్ధి వేగవంతమైంది.



> డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో చైనా అమెరికాతో సమవుజ్జీగా మారటం 21వ శతాబ్దంలో కీలకమైన పరిణామం. ఇది సాంకేతికత పరంగా ప్రపంచం బహుళ ధ్రువంగా మారడాన్ని సూచిస్తుంది. అమెరికా, చైనాల మధ్య కొనసాగుతున్న ఈ డిజిటల్ పోటీ రాబోయే దశాబ్దాలలో భారత్ వంటి వర్ధమాన దేశాలకు అనుకూలంగా మారుతుంది.

వర్తమానంలో యావత్ మానవాళి జీవన విధానాన్ని విప్లవాత్మకంగా మార్చగలిగే ఏఐ పైన, క్వాంటం కంప్యూటింగ్ పైన చైనా తన దృష్టిని కేంద్రీకరించి అమెరికాతో పోటీపడుతున్నది. ఒక దేశ కృత్రిమ మేధ (ఏఐ) నాణ్యత, క్వాంటం కంప్యూటర్‌ల అభివృద్ధి నేరుగా దాని డేటా, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలతో ముడిపడి ఉంటుంది. చైనా డేటా సెంటర్ల సామర్థ్యం ప్రపంచ డేటా సెంటర్ల వృద్ధి రేటుతో పోలిస్తే అత్యంత వేగంగా పెరుగుతోంది. చైనా డేటా సెంటర్ల ప్రస్తుత సామర్థ్యం 35 గిగావాట్లు (35వేల మెగావాట్లు). చైనా డేటా సెంటర్లు కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి అధునాతన సాంకేతికతల ఏకీకరణపై దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి.

చైనాలో ప్రయివేటు, పబ్లిక్ భాగస్వామ్య వ్యవస్థ (పీపీపీ) చాలా విస్తృతమైనది. ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, అప్పుల ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా చైనా మౌలిక సదుపాయాల పెట్టుబడిలో పీపీపీలు అనుబంధ పాత్రను పోషిస్తున్నాయి. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆకర్షించడానికి చర్యలు తీసుకుంది. చైనాలో పీపీపీలు 2022కల్లా 16.5 ట్రిలియన్ ఆర్ఎమ్‌బి (దాదాపు 204 ట్రిలియన్ రూపాయలు. 1 ట్రిలియన్ అంటే 1 లక్ష కోట్లు) పెట్టుబడులతో 10వేల ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి.

చైనాలోని ప్రయివేటురంగం అంతర్జాతీయ స్థాయికి రావటానికి చైనా ప్రభుత్వ విధానాలు చాలావరకు కారణం. చైనా తన ప్రయివేటురంగ కంపెనీలను పెట్టుబడిదారీ దేశాలు కూడా ఊహించలేని స్థాయిలో ప్రోత్సహిస్తున్నది. ఉదాహరణకు 5జీ సాంకేతికతలో ప్రపంచంలో అగ్రస్థాయిలో ఉన్న హువాయే కంపెనీ అమెరికా ఆంక్షలతో కుదేలయిన స్థితిలోవుండగా, చైనా ప్రభుత్వం 75 బిలియన్ డాలర్ల (రూ. 6.5లక్షల కోట్లు) విలువైన ఆర్థిక సహాయం చేసింది. దీనిలో పన్నురాయితీలే 25 బిలియన్ డాలర్లు (రూ. 2 లక్షల 20వేల కోట్లు). ఇలా ఒక ప్రయివేటు కంపెనీని నిలబెట్టటం ఏ పెట్టుబడిదారీ దేశంలోనూ సాధ్యపడదేమో.

డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణంలో చైనా అమెరికాతో సమవుజ్జీగా మారటం 21వ శతాబ్దంలో కీలకమైన పరిణామం. ఇది సాంకేతికతలో ఏక ధ్రువంగా వున్న ప్రపంచం బహుళ ధ్రువంగా మారడాన్ని సూచిస్తుంది. దీనితో గూగుల్, అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి అమెరికా బహుళజాతి కంపెనీలకు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలోనే కాకుండా, అభివృద్ధి చెందిన వాటిలో కూడా అలీబాబా, టెన్సెంట్, హువావే క్లౌడ్ వంటి చైనా కంపెనీల నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతుంది. చైనాలో ఇక ఏ మాత్రం ప్రాసంగికత లేని పశ్చిమ దేశాల కంపెనీలు ఇప్పటికే అక్కడి నుంచి నిష్క్రమిస్తున్నాయి. ఈ పరిస్థితి భారత్, వియత్నాం, సౌదీ అరేబియా వంటి దేశాలకు లాభం చేకూరుస్తుంది. అమెరికా, చైనాల మధ్య కొనసాగుతున్న ఈ డిజిటల్ పోటీ రాబోయే దశాబ్దాలలో వర్ధమాన దేశాలకు అనుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.

■ నెల్లూరు నరసింహారావు
సీనియర్ జర్నలిస్ట్

కృత్రిమ మేధతో ముప్పు తప్పదా?

మనిషికి మనిషితో పోటీ అన్నది నిన్నటి మాట. మనిషికి కృత్రిమ మేధస్సు(ఏఐ)తోనే పోటీ అన్నది నేటి మాట. మనిషి ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న ఏఐ ఇప్పుడు మనిషి ఉనికికే సవాలు విసురుతోంది. ఒకవైపు కృత్రిమమేధతో మానవ సామర్థ్యాలు గణనీయంగా పుంజుకుంటాయనే అభిప్రాయాలు, మరోవైపు ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తంగా మనిషి మనుగడే ప్రమాదంలో పడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. 'కృత్రిమమేధ అణుబాంబు కంటే ప్రమాదకరం, ఆ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం అంటే ఇంకాస్త త్వరగా మానవాళి తన వినాశనానికి ముహూర్తం పెట్టుకోవడమే' అంటూ ప్రముఖ అంతరిక్ష పరిశోధకులు స్టీఫెన్ హాకింగ్స్ గతంలోనే హెచ్చరించారు. కృత్రిమమేధ ఇప్పటికే అనేక సమస్యలకు కారణమవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల విషయంలోనూ అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. సాంకేతిక లోపాలతోనో, ఇంకేదో కారణంతోనో సదరు వాహనాలు కలిగించే ప్రాణ, ఆస్తి నష్టాలకు బాధ్యత ఎవరు తీసుకోవాలన్న విషయంలో ఇప్పటివరకు స్పష్టత లేదు. తమ లోపాల్ని తాము తెలుసుకునే యంత్రాలు వచ్చేదాకా ఇలాంటి ప్రశ్నలకు జవాబు దొరకదంటున్నారు నిపుణులు. కృత్రిమమేధతో రూపొందించిన రోబోలతో ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం మరింతగా పెరుగుతుందని ఐరాస ఇప్పటికే హెచ్చరించింది. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వల్ల మన దేశంలో 54శాతం మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదముందని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం' నివేదిక హెచ్చరించింది. ఏఐను నియంత్రించకుంటే వచ్చే రెండేళ్లలో మానవాళి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు టెక్నాలజీ రంగ నిపుణులు. ఒక సమూహంగా మానవాళి ప్రాణాలు తీయగల సైబర్, బయోలాజికల్ ఆయుధాలను సృష్టించే సామర్థ్యం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉందంటున్నారు. కృత్రిమమేధను అంతర్జాతీయ స్థాయిలో నియంత్రించకుంటే, ఆ తరువాత మానవుడు నియంత్రించలేని అత్యంత శక్తిమంతమైన వ్యవస్థ ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఏదేమైనా భవిష్యత్తులో ఏఐ కారణంగా మానవాళికి పెను ముప్పు తప్పదన్నది నిపుణుల ఆందోళన.

– ఎస్. అబ్దుల్‌ఖాలిక్

ఆటగాళ్ళకన్నా, అంపైర్ ముఖ్యం!

బిహార్ ఎన్నికల ఫలితాలు ఎన్డీయే ఎన్నికల వ్యూహరచన సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేశాయి. నితీశ్ కుమార్ రికార్డు స్థాయిలో పదోసారి ముఖ్యమంత్రిగా నవంబరు 20న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ఎన్నికలు ఇండియా బ్లాక్/ మహాగఠ్ బంధన్ బలహీనతల్ని, తేజస్వీ యాదవ్ అత్యుత్సాహాన్నీ, రాహుల్‌గాంధీ మంద్రస్థాయి ప్రతిస్పందననీ మరోసారి చాటిచెప్పాయి. రాహుల్‌గాంధీ ఓట్ చోరీ ఉద్యమాన్ని సాగించినంత ఉధృతంగా బిహార్ ఓటర్లను ఆకట్టుకునే పని చేయలేకపోయారు.

సంఘపరివారంలో వందకు పైగా సంఘాలు ఉన్నాయి. వీహెచ్‌పీ, భజరంగ్ దళ్, అయోధ్య రామాలయ నిర్మాణ కమిటీ వంటి ధార్మిక సంఘాలే గాక పసిపిల్లల నుంచి అంధుల వరకు అనేక రకాల సంఘాలు ఇందులో ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమూహాల్లో పని చేయడానికి కూడా వేరువేరు సంఘాలు ఉన్నాయి. వీటన్నింటి రాజకీయ వేదిక బీజేపీ. ఇవన్నీ ఏకశిలా సదృశ్యంగా మనసా వాచా కర్మణా ఒకే ఆలోచనతో, ఒకే లక్ష్యంతో తమతమ రంగాల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తుంటాయి. వాటికి అవసరానికి మించిన నిధుల్ని దేశంలోని మెగా కార్పొరేట్లు సరఫరా చేస్తుంటాయి. దేశంలో అత్యంత ధనిక పార్టీ బీజేపీ అనేది అందరికీ తెలిసిన విషయం. ఆ పార్టీ నడిపే సోషల్ మీడియాలు, వారి అభిమానులైన 'అన్–సోషల్' మీడియా హౌస్‌లు సహజంగానే విపక్షాలను అప్రతిష్ఠపాలు చేయడం కోసం, బీజేపీని గెలిపించడం కోసం 24/365 రోజులు పనిచేస్తుంటాయి. ఇది సంఘపరివారం విజయ రహస్యం.

మరోవైపు, బీజేపీ ప్రత్యర్థులకు సిద్ధాంతపరంగా ఏక సమైక్యతా సూత్రం ఏమీ లేదు. వాళ్ళకు ఒక బైండింగ్ వైర్ లేదు. ఒక పదం కోసం, ఒక్కోసారి ఒక్క అక్షరం కోసం, ఒక్క సీటు కోసం ఆ పార్టీలు హోరాహోరీగా కొట్లాడుకుని వీధులకు ఎక్కుతుంటాయి. పైగా నాలుగున్నరేళ్ళు పూర్తి విశ్రాంతి తీసుకుని ఎన్నికలకు ఆరు నెలలు ముందు మాత్రమే మేలుకుంటాయి. వీటికి కూడా కొన్ని ప్రజాసంఘాలు ఉంటాయి. వాటిల్లో ఎక్కువ భాగం లెటర్ హెడ్ సంస్థలు. నేల మీద నిలబడి ప్రజల్లో పనిచేసేవి చాలా తక్కువ. బీజేపీ–ఎన్డీఏలను వ్యతిరేకించేవారు సహితం ఇండియా బ్లాక్/ మహాగఠ్ బంధన్ అంతఃకలహాలను చూసి అసహ్యించుకుంటారు.

తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీశ్ కుమార్ మీద సహజంగానే ఎంతో కొంత అసంతృప్తి ఉంటుంది. ఈసారి మహిళా ఓటర్లు గుర్రుగా ఉన్నారనే మాట బిహార్‌లో వినిపించింది. అంతే, 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద అక్టోబరు 6న ఒక్కో మహిళ అకౌంట్లో పది వేల రూపాయల చొప్పున వేసేశారు నితీశ్. ఈ పథకం కింద కోటి 40 లక్షల మంది మహిళల ఖాతాల్లోకి రూ.14వేల కోట్లు జమ చేశారని అంచనా. నిజానికి, బిహార్‌లో అక్టోబరు 6 నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇది ఒక విధంగా 'ఓటుకు నగదు' పథకం. ఎన్నికల్లో ఇలాంటి అక్రమాలను ఎన్నికల కమిషన్ అడ్డుకోవాలి. అలా జరగలేదు.

స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలను ప్రధాన ఆదర్శాలుగా ప్రకటించిన భారత రాజ్యాంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నెత్తిమీద పెట్టుకుంటారు. వీలున్నప్పుడల్లా "సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్" తమ విధానం అంటుంటారు. కానీ, వారి పార్టీ మాత్రం దేశం మొత్తం మీద ఒక్క సీటు కూడా ముస్లింలకు కేటాయించదు. ముస్లింలను అణచివేస్తున్నామనే సంకేతాలు ఇస్తే హిందూ సమాజంలోని ఛాందస సమూహం తమకు ఓటేస్తుందనేది ఆ పార్టీ ఎత్తుగడ. ఇది ఇటీవలి ఎన్నికల్లో ఆ పార్టీకి సానుకూల ఫలితాలను ఇస్తోంది.



> బిహార్‌లో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఓట్లేస్తారనే సమూహాలను జాబితానుంచి తొలగించారనీ, కూటమికి అనుకూలురైన వారిని కొత్తగా చేర్చారని ఆరోపణలున్నాయి. భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ ఈ వ్యూహాన్ని రచించి అమలు చేశారని రాహుల్‌గాంధీ గణాంకాలతో సహా చేస్తున్న 'ఓట్ చోరీ' ఆరోపణల్ని తేలిగ్గా కొట్టివేయలేం.

మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీతో అంత హోరాహోరీగా పోరాడిన ఎంఐఎం పార్టీని మీడియా 'బీజేపీ–బీ టీమ్' అనడం విచిత్రం. ఈ నింద నుంచి బయటపడడానికి ఈసారి ఎంఐఎం బిహార్‌లో మహాగఠ్ బంధన్‌లో చేరడానికి చాలా ప్రయత్నించింది. కానీ ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఐఎంను తమలో చేర్చుకోవడానికి బీజేపీ వ్యతిరేక మహాగఠ్ బంధన్ (ఇండియా బ్లాక్) భయపడింది. ఎంఐఎంతో జతకడితే సంఘపరివారం తమను మొత్తంగా 'గడ్డాలు, టోపీల కూటమి' అంటుందని దాని భయం. తమకు 6 సీట్లు ఇచ్చినా సర్దుకుంటామని ఎంఐఎం అభ్యర్థించినప్పటికీ, ఈ ప్రతిపాదనను ఆర్జేడీ తేజస్వీయాదవ్ గట్టిగా తిరస్కరించారు. ఫలితంగా ఎంఐఎం గ్రాండ్ డెమొక్రాటిక్ అలయన్స్ (జీడీఏ)ను ఏర్పాటు చేసింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇప్పుడున్న పద్ధతిలో ఎన్ని సీట్లు గెలుచుకున్నారన్నదే ప్రామాణికంగానీ, ఏ పార్టీకి ఎంతమంది ఓటర్లు మద్దతు పలికారన్నది కొలమానం కాదు. ఆర్జేడీకి కోటి 80లక్షల ఓట్లు (23శాతం) వచ్చాయి గానీ సీట్లు 25 మాత్రమే వచ్చాయి. బీజేపీకి 96లక్షల ఓట్లు, అంటే ఆర్జేడీ కన్నా రెండున్నర శాతం తక్కువ ఓట్లు వచ్చినా 91 సీట్లు వచ్చాయి. జేడీయూకు 90 లక్షల ఓట్లు వచ్చాయి (19 శాతం) 84 సీట్లు వచ్చాయి. 9 శాతం ఓట్లు పొందిన కాంగ్రెస్‌కు 5 సీట్లు వస్తే, 5 శాతం ఓట్లు మాత్రమే వచ్చిన ఎల్‌జేపీకి 20 సీట్లు దక్కాయి. ఇక్కడ ఓట్లకూ సీట్లకూ పొంతన లేదు.

ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఏవో చాలామందికి గుర్తుండవు. సీబీఐ, ఈడీ, ఐటీ, ఎన్ఐఏ, ఎన్నికల కమిషన్‌లను మాత్రమేగాక, అవసరం అయితే సుప్రీంకోర్టును సహితం బీజేపీ తన భాగస్వామ్య పక్షంగా మార్చుకోగలదు. దాని సామర్థ్యం అపారం. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) బిహార్ ఎన్నికల ఫలితాల్లో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించింది. సరిగ్గా ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తీసేసింది. మరికొన్ని లక్షల మందిని కొత్తగా చేర్చింది. బిహార్‌లో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఓట్లేస్తారనే సమూహాలను జాబితా నుంచి తొలగించారనీ, ఎన్డీఏ కూటమికి అనుకూలురైన వారిని కొత్తగా చేర్చారని ఆరోపణలున్నాయి. భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ ఈ వ్యూహాన్ని రచించి అమలు చేశారని రాహుల్‌గాంధీ గణాంకాలతో సహా చేస్తున్న 'ఓట్ చోరీ' ఆరోపణల్ని తేలిగ్గా కొట్టివేయలేం.

1980–90ల నాటి మాట. స్వదేశీ పిచ్‌ల మీద ఇండియా కన్నా పాకిస్థాన్ మెరుగైన ఫలితాలను సాధిస్తున్న కాలంలో ఒక స్పోర్ట్స్ ప్రతినిధి 'లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్‌'ను ఒక చిత్రమైన ప్రశ్న వేశాడు. ఇండియా టీమ్‌లోకి పాకిస్థాన్ టీమ్ నుంచి ఒక ప్లేయర్‌ను తీసుకోవాల్సి వస్తే తన ప్రాధాన్యం ఎవరు? అని అడిగాడు. దానికి గవాస్కర్ అంతకన్నా చిత్రమైన సమాధానం ఇచ్చాడు. "నేను ఏ పాకిస్థానీ ఆటగాడినీ ఎంచుకోను. నిజానికి, నేను భారత జట్టులోకి పాకిస్థానీ అంపైర్‌ను తీసుకుంటాను!" అన్న అర్థం వచ్చేలా సమాధానం చెప్పాడు. 'ఆటగాళ్లకన్నా అంపైర్ల తప్పుడు నిర్ణయాలవల్లే పాకిస్థాన్ గెలుస్తున్నది' అని చెప్పడం గవాస్కర్ ఉద్దేశ్యం. బిహార్ ఎన్నికల ఫలితాలను చూశాక గవాస్కర్ మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఇలాంటి ఎన్నికల ప్రధానాధికారులు ఉంటే చాలు మోదీజీ–అమిత్‌జీల జోడీ ఎన్ని విజయాలనైనా సాధించగలదు.

● డానీ
సమాజ విశ్లేషకులు



వణికించకే ఓ 'చలి'యా!

- గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- గజ గజ వణుకుతున్న పిల్లలు, వృద్ధులు
- ఉమ్మడి జిల్లాలో 11 డిగ్రీలకు పడిపోయిన వైనం
- పొగమంచుతో పాటు చలిగాలులతో ఇబ్బందులు
- ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ


హనుమకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారి చలి సాధారణం కన్నా ముందుగానే తీవ్రతను కనబరుస్తోంది. ఉదయం వేళ భారీగా పొగమంచు కురుస్తోంది. దానికితోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడిపోతున్నారు. కేవలం రాత్రివేళల్లోనే కాకుండా తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు చలితీవ్రత కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొద్ది రోజుల వరకు పగలు, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఒక్కసారిగా వాతావరణం మారింది. రాత్రి ఉష్ణోగ్రతలు 11నుంచి 13 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. సోమవారం ములుగు జిల్లాలో అతితక్కువగా 11.2 డిగ్రీలు నమోదైంది.

సింగిల్ డిజిట్‌కు దగ్గరగా..

ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ప్రకారం హనుమకొండ జిల్లాలో 11.8 డిగ్రీల సెల్సియస్, వరంగల్ జిల్లాలో 11.5 డిగ్రీలు, జనగామ జిల్లాలో 11.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలో 12.2 డిగ్రీలు, ములుగు జిల్లాలో 11.2 డిగ్రీలు, జయశంకర్ భూపాపల్లి జిల్లాలో 11.6 డిగ్రీల సెల్సియస్ నమోదు అయింది. గత మూడు నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరుగుతుండడంతో వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు చేసింది. రాగల రెండు రోజులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు (మిగతా 6వ పేజీలో)

పొగమంచులో ప్రయాణాలు వద్దు: సీపీ

వరంగల్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరిగినందున ఉదయం, రాత్రి పూట పొగమంచులో ప్రయాణాలు చేయొద్దని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. మంచు కారణంగా రోడ్డుపై వాహనదారులు, పాదాచారులు కనిపించరని, ఆ సమయాల్లో చిన్న పాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని అన్నారు. అత్యవసరం అయితే తప్ప ఆ సమయాల్లో ప్రయాణం చేయొద్దని సూచించారు. తప్పని సరి అయితే వాహన స్థితిని ముందుగానే పరిశీలించాలని, బ్రేకు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేవో చూసుకోవాలని, వేగం తగ్గించి, సెల్‌ఫోన్ మాట్లాడకుండా హెడ్‌లైట్లను ఆన్‌లో ఉంచాలని, ఫాగ్‌లైట్‌లను వాడాలని సూచించారు. ఓవర్‌టేక్ చేయడం, రోడ్లపై వాహనాలను నిలపడం చేయొద్దన్నారు.



మళ్లీ పొలిటికల్ హీట్

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం నిర్ణయంపై ఉత్కంఠ

- పార్టీ ఫిరాయింపులు, స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి
- నాలుగు వారాల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు
- స్పీకర్ నోటీసులపై వివరణ ఇవ్వని కడియం
- రాజకీయాల్లో తన ఇమేజ్‌ని కాపాడుకోవాలని తాపత్రయం
- అధిష్ఠానం ఆదేశిస్తే రాజీనామా యోచనలో శ్రీహరి..?
- ఇదే జరిగితే ఆరు నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు రాజకీయాల్లో మరో ఉత్కంఠ మొదలైంది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక అనివార్యం అనే చర్చ జరుగుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఆయన పార్టీ ఫిరాయింపుపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. దీనికి సంబంధించి ఎమ్మెల్యే కడియంకు స్పీకర్ నోటీసులు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు వివరణ ఇవ్వలేదు. రాజకీయాల్లో తన క్లీన్ ఇమేజ్‌ను కాపాడుకునేందుకు కడియం రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించటంతో అధిష్ఠానం అదే ఊపుతో ఉప ఎన్నికలకు మొగ్గు చూపుతోందని భావిస్తున్నారు.

రాజీనామా యోచనలో కడియం..?

రాజకీయాల్లో క్లీన్ ఇమేజ్ ఉన్న కడియం శ్రీహరి... తనపై వస్తున్న ఫిరాయింపుల ఆరోపణలకు చెక్ పెట్టాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రాజకీయాల్లో అవినీతి మరకలు, పైరవీల తాకిడి లేని నేతగా కడియంకు పేరుంది. మూడు దశాబ్దాలకు పైగా తనకున్న క్లీన్ ఇమేజ్‌ని కాపాడుకోవాలనే ఆలోచనలో శ్రీహరి ఉన్నారనే టాక్ వినబడుతుంది. దీంతో ఇప్పటికే ముందుచూపుతో వేల కోట్ల రూపాయలతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దేవాదుల నీటిని కూడా తన నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్లేలా ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నారు. ఈ క్రమంలోనే స్పీకర్ ఇచ్చిన నోటీసులకు కడియం సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారనే చర్చ జరుగుతోంది. సెప్టెంబరు చివరి నాటికే కడియం స్పీకర్ నోటీసులకు సమాధానం ఇస్తారనే భావించారు. అయితే స్పీకర్ నోటీసులకు సమాధానం ఇవ్వకపోవటం వెనుక రాజీనామా యోచన ఉందనే అంటున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశిస్తే రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమేనని కడియం సంకేతాలు ఇస్తున్నట్లుగా తెలిసింది. ఇంకా మూడేళ్ల పదవీకాలం ఉండటంతో పార్టీ ఫిరాయించాననే అపవాదుతో కొనసాగటం కంటే.. ఉపఎన్నిక ఎదుర్కోవటమే మేలని కడియం భావిస్తున్నారని తెలుస్తోంది. ఇదే జరిగితే స్పీకర్ నోటీసులకు (మిగతా 7వ పేజీలో)

నాలుగు వారాల గడువు

పార్టీ ఫిరాయింపుల వ్యవహారం రాజకీయాల్లో హీట్ పుట్టిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని ఆ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. పది మందిలో ఉమ్మడి జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఉన్నారు.

ఈ క్రమంలో ఫిరాయింపులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గత జూలై 31న స్పీకర్‌ను ఆదేశించింది.దీంతో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న కడియం శ్రీహరితో పాటు పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యేలను స్పీకర్ వ్యక్తిగతంగా విచారణ జరిపారు. అయితే స్టేషన్‌ఘన్‌పూర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు మాత్రం ఇప్పటి వరకు స్పీకర్ ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇవ్వలేదు. పార్టీ ఫిరాయింపులపై రోజువారీగా విచారణ జరిపి నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడుతుందా అనేది ఉత్కంఠగా మారింది.



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- ములుగులో పైలట్ ప్రాజెక్టుగా పాల పంపిణీ

ములుగు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ ప్రీ స్కూల్ చిన్నారులకు రోజూ 100మిల్లీ లీటర్ల పాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని పౌష్టికాహార లోప రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చడానికి కృషి చేస్తామని అన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ఈ నూతన కార్యక్రమాన్ని ములుగు జిల్లా నుంచి ప్రారంభించడం సంతోషకరమన్నారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి..

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ 6
- 'ప్రజావాణి'లో దరఖాస్తుల స్వీకరణ

నిలిచిన పత్తి కొనుగోళ్లు

- బోసిపోయిన ఏనుమాముల మార్కెట్‌యార్డు
- సీసీఐ తీరు సరికాదన్న కాటన్ అసోసియేషన్

వరంగల్ వ్యవసాయం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి కొనుగోళ్లు లేకపోవడంతో మార్కెట్ యార్డు బోసిపోయింది. మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లులు కూడా బంద్ చేసి నిరసన తెలిపారు. మరోపక్క తెలంగాణ కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు మార్కెట్‌కు చేరుకుని సీసీఐ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. నెల రోజులుగా మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని సీసీఐని కోరడం జరిగిందని, అదే విధంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 322 మిల్లులు, వ్యవసాయ మార్కెట్లలో ఈ రోజు నుంచి తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పత్తి కొనుగోళ్లను నిలిపివేయాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. వ్యాపారులు, మిల్లర్లు, రైతులు బంద్‌కు సహకరించడం అభినందనీయమన్నారు. సీసీఐ పత్తి కొనుగోలు చేసినప్పుడు నోటీఫై చేసిన అన్ని మిల్లులను నడపాలని మంత్రి సమక్షంలోనే కోరడం జరిగిందన్నారు. అప్పుడు సానుకూలంగా స్పందించి ఆ తరువాత కొన్ని మిల్లులకే పత్తి కొనుగోళ్లకు అనుమతులివ్వడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మరి కొన్ని మిల్లుల్లో పనిలేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వర్కర్లు వెళ్లిపోతున్నారని, మిల్లుల నడపకపోతే నష్టాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని మిల్లర్ల సమస్యలను పరిష్కరించి పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతున్నామని ఆయన తెలిపారు. మరోపక్క మార్కెట్లోని గుమస్తాలు పత్తి యార్డుకు చేరుకుని సీసీఐ పత్తి కొనుగోలు చేయకపోతే ప్రైవేటు వ్యాపారులతో పత్తి కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకోవాలని, పనులు లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.



పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో బోసిబోయిన ఏనుమాముల మార్కెట్ పత్తియార్డు

నేడు మాజీ మంత్రి హరీశ్‌రావు రాక

ఏనుమాముల మార్కెట్‌లో రైతులతో మాటామంతీ

వరంగల్ వ్యవసాయం, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ, ప్రైవేటు పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు మంగళవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌ను సందర్శించనున్నారు. ఆయనతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని, రైతుల నుంచి ఎలాంటి అంక్షలు లేకుండా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్‌తో హరీశ్‌రావు పర్యటన ఉంటుందని నాయకులు తెలిపారు.

సులభంగా.. 'యాప్'రూపంగా..

- ప్రజావాణికి ప్రత్యామ్నాయంగా 'మై జీడబ్ల్యూఎంసీ'
- సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం సులభం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి ప్రత్యామ్నాయంగా అందుబాటులోకి వచ్చిన 'మై జీడబ్ల్యూఎంసీ' యాప్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ప్రజావాణిలో కాకుండా మై జీడబ్ల్యూఎంసీ ఆప్ ద్వారా ఎక్కడి నుంచైనా చేయొచ్చని అన్నారు. గ్రేటర్ పరిధిలోని 18, 19వ డివిజన్‌లలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్టు తమకు యాప్ ద్వారా ఫిర్యాదులు అందాయని, టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రసాయిలో పర్యటించి ప్రభుత్వ భూములను గుర్తించి కంచెలు నాటాలని అన్నారు. ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. 25 సార్లు పెనాల్టీ పడిన ఇండ్లను గుర్తించి వాటిని తొలగించేందుకు ఆదేశాలు జారీ చేసి పూర్తి బకాయిలను చెల్లించే విధంగా చొరవ చూపాలని అన్నారు. నగరంలో కమ్యూనిటీ హాల్స్ నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్ర శేఖర్, ఎస్ఈ సత్యనా రాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, సీహెచ్‌వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్లు జామ్..

- 15 ఏళ్లుగా విస్తరణకు నోచుకోని కూడళ్లు 7
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కాశిబుగ్గ కూడలిలో వాహనాల రద్దీ

పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

- లేకపోతే సీసీఐ, మార్కెట్ కార్యాలయాలను ముట్టడిస్తాం 7
- రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

సంక్షోభంలో పత్తి రైతులు

- మంత్రులు కిషన్‌రెడ్డి, తుమ్మల రాజీనామా చేయాలి 7
- మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్



వేయిస్తంభాల గుడిలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేస్తున్న విద్యాశంకర మహాభారతి స్వామివారు

విశ్వమంతా శివశక్తి మయం

- పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి
- వేయిస్తంభాల గుడిలో భక్తులకు అభిభాషణ

హనుమకొండ, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): కోటి జన్మల పుణ్యఫలం ఉంటేనే శివారాధన, అభిషేకం, ఆ పరమశివుని దర్శనం సాధ్యమని జగద్గురు పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి అన్నారు. కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆయన హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాలగుడిని సోమవారం సందర్శించారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భారతి మహాస్వామి రుద్రేశ్వర స్వామివారికి స్వయంగా రుద్రపారాయణంతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేస్తూ.. తాగే నీరు, పీల్చే గాలి.. (మిగతా 6వ పేజీలో)

శ్రీశైలం, తిరుపతికి ఏసీ బస్సులు

సర్వీసులు ప్రారంభించిన ఆర్ఎం విజయభాను

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, తిరుపతి పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులు రాజధాని ఏసీ బస్సులను వినియోగించుకోవాలని వరంగల్ ఆర్ఎం విజయభాను కోరారు. హనుమకొండ బస్టాండ్‌లో సోమవారం తిరుపతి, శ్రీశైలం వెళ్తున్న ఏసీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హనుమకొండ బస్టాండ్ నుంచి ఉదయం 8.40 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు తిరుపతికి చేరుకొని తిరుపతి నుంచి తెల్లవారు జామున 3 గంటలకు బయల్దేరి హనుమకొండకు చేరుకుంటుందని తెలిపారు.

అదేవిధంగా ప్రతీ రోజు ఉదయం 9 గంటలకు హనుమకొండ నుంచి బయల్దేరి శ్రీశైలంనకు సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందని, ఈ బస్సు వయా ఉప్పల్ రింగ్‌రోడ్డు, ఎల్బీ నగర్, సాగర్ రింగ్‌రోడ్డు ద్వారా వెళ్తుందని తిరిగి ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 7.15 గంటలకు హనుమకొండ బస్టాండ్‌కు చేరుకుంటుందని తెలిపారు.



సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- కలెక్టర్ రాక కోసం అర్జీదారుల ఎదురుచూపులు
- అదనపు కలెక్టర్‌ను కలిసిన తర్వాత కూడా పడిగాపులు 6
- కలెక్టర్ రాగానే కలిసేందుకు బారులు
- సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి

వినతులను వెంటనే పరిష్కరించాలి

వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 124 వినతులు అందగా శాఖల వారీగా ఎండార్స్ చేశారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 40 వినతులు, గృహ నిర్మాణ శాఖకు 15, జీడబ్ల్యూఎంసీ 19, డీసీవో సోషల్ వెల్ఫేర్ 8, ఉపాధి శాఖ 4, డీఆర్‌డీఏ 3, డీపీవో 6, పౌరసరఫరాల శాఖ 4, వ్యవసాయశాఖ 5, విద్యాశాఖ 5, డీఎంహెచ్‌వో 4 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్‌డీవో రామిరెడ్డి, డీడబ్ల్యూవో రాజమణి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించాలి..

గంగాధరి రమ్య, దమ్మన్నపేట,వర్ధన్నపేట



మా నాన్నమ్మ గంగాధరి లక్ష్మి పేరున ఉన్న 1 ఎకరం 26 గుంటల భూమిని మా మేనత్త అయిన తాటికాయల రజిత పేరున ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్రమంగా పట్టా చేయించుకున్నారు. ఆయనకు ఇదివరకు పెళ్లి అయి పిల్లలు ఉన్నా కూడా మా మేనత్తతో సహజీవనం చేస్తున్నాడు. నా తండ్రి అయిన శ్రీనుకు ఎలాంటి సమాచారం లేకుండానే భూమిని తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అక్రమంగా పట్టా పాస్ పొందిన వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి..

బిర్రు సురేందర్, అప్పలరావుపేట, నెక్కొండ



ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా మొదటి దశ లిస్ట్‌లో నా పేరు వచ్చింది. కానీ ఇల్లు మంజూరు చేయకపోవడంతో అధికారుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాను. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన తనకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించి న్యాయం చేయాలి.

ఔషధ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

వరంగల్ మెడికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డైరెక్టర్ జనరల్, ఔషధ నియంత్రణ శాఖ ఆదేశాల మేరకు సోమవారం వరంగల్, జనగామ, భూపాలపల్లి జిల్లాల్లోని పలు రిటైల్ ఔషధ దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. జిల్లా ఔషధ నియంత్రణ అధికారి జే.కిరణ్ కుమార్, బాలకృష్ణ, పి.పావని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పలు రిటైల్ ఔషధ దుకాణాలకు తాఖీదులకు సిఫారసు చేశారు. మత్తు కలిగించే మందులు, ఆంటిబయోటిక్స్‌ను అర్హత గల వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దుకాణాల్లో పలు రికార్డులను పరిశీలించి అధిక ధరలకు మందులు విక్రయించినా, బిల్లు ఇవ్వకపోయినా చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- కలెక్టర్ రాక కోసం అర్జీదారుల ఎదురుచూపులు
- అదనపు కలెక్టర్‌ను కలిసిన తర్వాత కూడా పడిగాపులు
- కలెక్టర్ రాగానే కలిసేందుకు బారులు



బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 143 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుని, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీడీ హౌసింగ్‌కు 25ఫిర్యాదులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి 23ఫిర్యాదులు, హనుమకొండ ఆర్‌డీఓ కార్యాలయానికి 11ఫిర్యాదులు రాగా మిగతావి వివిధ సమస్యలపై వచ్చాయి. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తోపాటు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవి గణేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గౌడ సంఘం భూమిని కాపాడండి...

హసన్‌పర్తి మండలం నాగారాం గ్రామానికి చెందిన గౌడ సంఘం(75మంది సభ్యులకు చెందిన) 14ఎకరాల 17గుంటల భూమిని సభ్యులకు ఎవరికి తెలియకుండా గౌడ సంఘం అధ్యక్షులు బూర్న వెంకటేశ్వర్లు సభ్యులకు తెలియకుండా పేరు మీద సాదాబైనామా చేయించుకునటకు ప్రయత్నం చేస్తున్నాడని గౌడ సంఘం సభ్యులు సోమవారం కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం మండల అధికారుల దృష్టికి తీసుకెళితే పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మా సభ్యులందరికి చెందిన భూమిని కాపాడి మాకు న్యాయం చేయాలని వారు కోరారు.

ప్రాణభయం ఉంది..

ధర్మసాగర్ శివారు సర్వే నెంబర్ 1146/ఎలో ఉన్న మా 10గుంటల భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించాలని చూస్తున్నారని, మా భూమిని కాపాడాలని ధర్మసాగర్‌కు చెందిన పయ్యావుల మల్లయ్య కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మా భూమిలో హద్దులు, కనీలు నాటారని, ఫెన్సింగ్ చేశారని, ఇలా ఎందుకు చేస్తున్నారని ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని వారి ద్వారా ప్రాణభయం ఉందని, మాకు రక్షణ కల్పించి మా భూమిని కాపాడాలని మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజావాణి తీరుపై అసంతృప్తి..

హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంపై అర్జీదారులతో పాటు ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు జరిగే ప్రజావాణిలో చివరి గంట ముందు కలెక్టర్ వస్తున్నారని, అప్పుడప్పుడు సమీక్షలు, సందర్శనల పేరిట ప్రజావాణిని రద్దు చేయడం పరిపాటిగా మారిపోయిందని అంటున్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ స్నేహ శబరీష్ 12:30గంటలకు వచ్చారు. అప్పటికే అధికారులను కలిసిన అర్జీదారులు.. కలెక్టర్ వచ్చిన తర్వాత ఆమెను కలిసి మరొకసారి ఫిర్యాదు చేయడానికి బారులు తీరారు. అనేక సందర్భాల్లో ప్రజావాణిలో కలెక్టర్ కనిపించకపోతుండటంతో బాధితులు డీలా పడిపోతున్నారు.

ఇదిలావుండగా, ప్రజావాణిలో పాల్గొనే వివిధ శాఖల అధికారులు జవాబుదారీగా వ్యవహరించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమయంలో, సాకులు చెపుతూ ఫిర్యాదును పక్కదారిపట్టించే విధంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అర్జీదారులు గట్టిగా నిలదీస్తే.. సిబ్బందితో గెంటివేయిస్తున్నారని చెబుతున్నారు.

హాల్‌టికెట్ అడిగితే అడ్మిషన్ లేదంటున్నారు...



అనుష



మయశ్రీ

తరగతులు విని, పరీక్షలు రాసే సమయంలో అడ్మిషన్ లేదంటున్నారని పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు అనూష, మయశ్రీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాలుగున్నర నెలల క్రితం 'దోస్త్' ద్వారా కళాశాలలో ఫస్ట్ ఫేజ్‌లో సీటు రాగా జాయిన్ అయ్యామని, అప్పటి నుంచి తరగతులు వినడంతో పాటు ఇంటర్నల్ పరీక్షలకు హాజరయ్యామని తెలిపారు. ఇంటర్నల్స్ పరీక్షల సమయంలో హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో ప్రిన్సిపాల్ దృష్టికి విషయం తీసుకెళ్లగా 15రోజుల్లో వస్తుందన్నారని తెలిపారు. ఈ క్రమంలో ఫస్ట్ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజు తేదీ రాగా రూ.900 చెల్లించామని, తీరా ఇప్పుడు హాల్ టికెట్ అడిగితే మీకు కళాశాలలో అడ్మిషన్ లేదని, హాల్ టికెట్ రాదని ప్రిన్సిపాల్ అంటున్నారని విద్యార్థినిలు వాపోయారు. తమకు హాల్‌టికెట్ ఇప్పించి విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని వారు కలెక్టర్‌ను కోరారు.

ఓం నమఃశివాయ

- రుద్రుడి ఆశీస్సుల కోసం శాస్త్రోక్తంగా అగ్నిస్థాపన
- హాజరైన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మహా రుద్రయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు

పరకాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రుద్రుడి ఆశీస్సులు పొందాలని గతంలో ఎన్నడూ లేని విధంగా పరకాల పట్టణంలోని శ్రీ భవాని కుంకుమేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం శాస్త్రోక్తంగా అగ్నిస్థాపన (మహా రుద్రయాగం) నిర్వహించారు. వేద మంత్రాల నడుమ పవిత్ర అగ్ని జననం యాగశాల ప్రాంగణం వేదగోషతో మార్మోగింది. కార్తీకమాస మహా రుద్రయాగంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు ఉదయం 4 గంటలకే కుంకుమేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి యాగంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా యాగశాల ప్రవేశం, రుత్విక్‌వరణం, గోపూజ కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుపతి దేవస్థానం నుంచి విచ్చేసిన 51 మంది వేద పండితులు రుద్రనామకం, చమకాలను పఠిస్తూ మహా రుద్రహోమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. లోకకల్యాణం, ప్రజల సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ కుంకుమేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో తలపెట్టిన మహా రుద్రయాగం వేద పండితుల శాస్త్రాల మధ్య మార్మోగింది. 159 హోమ గుండాలను ఏర్పాటు చేసి 644 జంటలు హోమంలో పాల్గొనడం విశేషం. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓం నమః శివాయా అంటూ పంచాక్షరి మంత్రం భక్తుల నోట మార్మోగింది. యాగంలో పాల్గొన్న భక్తులు ప్రతికూల శక్తుల నుంచి రక్షణతోపాటు వారి కుటుంబంతో సంతోషాలతో పొందాలని విశ్వసిస్తూ శివుడి అనుగ్రహం కోసం మొక్కులు చెల్లించుకు న్నారు. వారికి ఎలాంటి ఆటంకం లేకుండా ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఇనుగాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. యాగస్థలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక ఏసీపీ చిర్ర సతీష్‌బాబు, సీఐ క్రాంతికుమార్ సమక్షంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. వీరితో పాటు 300 మంది సేవాదళ్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి యాగశాలలో సేవలందించేందుకు 300 వలంటీర్లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, మునిసిపల్, రెవెన్యూ, విద్యుత్ అధికారులు సైతం పాలు పంచుకొని సహాయ సహకారాలు అందించారు. సుమారుగా రూ.30 లక్షల వ్యయంతో నిర్వహించిన మహారుద్రయాగం పరకాలలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

సాక్షాత్తు శివుడు దిగివచ్చి భక్తులకు దర్శనమిచ్చే విధంగా హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలను పొందారు. యాగ నిర్వహణకు స్థానిక కుంకుమేశ్వర దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వ ర్‌రావు, డైరెక్టర్లు, అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణశర్మ, సంపత్ కుమార్‌శర్మ, వినయ్‌శర్మ, యాగ కమిటీ నిర్వాహకులు ఎర్రం లక్ష్మణ్, గండె రవి, తోట రవి నిర్వహణలో పాలు పంచుకున్నారు.



యాగంలో పాల్గొన్న దంపతులు

ఫిర్యాదులపై స్పందించాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- 'ప్రజావాణి'లో దరఖాస్తుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరించాలని నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె దరఖాస్తులు స్వీకరించి ఆయా విభాగాలకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై వచ్చిన ఫిర్యాదులే మళ్లీ మళ్లీ వస్తున్నాయని, ఈ విషయంలో అధికారులు చొరవ చూపాలని అన్నారు. మలేరియా విభాగం సిబ్బంది నగరంతో పాటు విలీన గ్రామాలలో దోమల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 86 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మల రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారి రమేష్, ఇంచార్జీ సీపీ రవీందర్, డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల అధికారి రామకృష్ణతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విభాగాలవారీగా అందిన ఫిర్యాదుల సంఖ్య వివరాలు ఇలా వున్నాయి..

ఇంజనీరింగ్ - 29, హెల్త్, శానిటేషన్ - 12, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 06, టౌన్‌ప్లానింగ్ - 33, మంచి నీటి సరాఫరా - 06

ప్రజల ఫిర్యాదులు

వరంగల్ శంభునిపేటలో చాలా కాలంగా వీధిలైట్లు వెలగడం లేదని, దీంతో కాలనీ అంధకారంగా మారిపోయిందని స్వప్న అనే మహిళ స్థానిక ప్రజలతో వచ్చి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చాలా సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. వరంగల్ 29వ డివిజన్ పాపయ్యపేట ఐపీసీ చర్చి సమీపంలోని శ్మశానవాటిక ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని, వెంటనే పిచ్చి మొక్కలను తొలగించి ఆ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు సింగారంపు బాబురావు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

హనుమకొండ 56వ డివిజన్ భీమారం బ్యాంక్ కాలనీ స్ట్రీట్ నెంబర్ -02లో 20 శాతం కంట్రిబూషన్‌తో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానిక ప్రజలు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల వర్షం కురిసిన సమయంలో ఇండ్లలోకి వర్షం నీరు రావడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు వెల్లడించారు.

హనుమకొండ 50వ డివిజన్ న్యూ బృందావన్ కాలనీలో చాలా కాలంగా కుక్కల బెడద అధికాంగా ఉందని, వాటి వల్ల స్కూల్‌కు వెళ్లే చిన్న పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఈ విషయం గతంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వెంటనే సమస్యకు పరిష్కార మార్గం చూపాలని ప్రజలు కోరారు.

వణికించకే ఓ'చలి'యా!

(5వ పేజీ తరువాయి)

తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. రానున్న రెండు మూడు రోజులు పరిస్థితులు ఇలాగే ఉండవచ్చునని తెలిపింది.

అల్లాడుతున్న ప్రజలు

చలి తీవ్రత దాదాపుగా సింగిల్ డిజిట్‌కు దగ్గరగా చేరడంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు చలికి సతమతమవుతున్నారు. చలికి గజగజ వణికిపోతున్నారు. చలికి భయపడి ఉదయం 9 గంటల వరకు ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావడం లేదు. సాయంత్రం 5 గంటలకే చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో వివిధ పనులపై బయటకు వెళ్లినవారు సాయంత్రం 7 గంటల లోపే ఇళ్లకు తిరిగుముఖం పడుతున్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు చలి నుంచి జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. చలిని తట్టుకునేందుకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఏసీలు, ఫ్యాన్ల వాడకం తగ్గటంతో విద్యుత్ వినియోగం క్షీణించింది. చలి తీవ్రత అంతకంతకు పెరుగుతుండడంతో నగరంలో ఉన్ని దుస్తుల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి.

ములుగు జిల్లాలో గజగజ

ములుగు (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతున్నాయి. ఉదయం ఇళ్ల లోంచి బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. సాయంత్రం 5 దాటిందంటే ప్రజలెవరూ రోడ్లపై కనిపించడంలేదు. తాడ్వాయి మండలంలో కనిష్టం 11.2 డిగ్రీలు, గరిష్టం 28.7 డిగ్రీలు, గోవిందరావు మండలంలో కనిష్టం 11.5 డిగ్రీలు, గరిష్టం 29.0 డిగ్రీలు నమోదయ్యాయి. కన్నాయిగూడెం మండలంలో కనిష్టం 12.2 డిగ్రీలు, గరిష్టం 29.8 డిగ్రీలు, వాజేడు మండలంలో కనిష్టం 12.2 డిగ్రీలు, గరిష్టం 29.9 డిగ్రీలు నమోదయ్యాయి. గత వారం కంటే ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. ము లుగు జిల్లా అటవీ ప్రాంతం కావడంతో ఉదయం 8 గంటలైనప్పటికీ దట్టమైన పొగమంచు కురుస్తోంది.

విశ్వమంతా శివశక్తి మయం

(5వ పేజీ తరువాయి)

అన్నీ రుద్రస్వరూపాలేనని తెలిపారు. శివ అనే రెండక్షరాలు అన్ని భయాలను తొలగిస్తుందని, అందు వల్ల ప్రతీ ఒక్కరు నిరంతరం శివనామస్మరణ చేయాలని ఉద్బోధించారు. మహాదేవుడు భక్తసులభుడనీ, ఏ రీతిన ఆరాధించినా కరుణించి కోరిన వరాలు కురిపిస్తాడని భారతి మహాస్వామి అభిభాషించారు. శివుడి ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదనే నానుడి ఉందని, అంటే సృష్టి సర్వస్వాన్ని శివుడే శాసిస్తున్నాడని అర్థమన్నారు. అంతకుముందు రుద్రేశ్వరస్వామివారికి మూలమంత్ర యుక్తంగా అంగన్యాస, కరన్యాస పాశుప ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. 300 మంది భక్తులు రుద్ర అధ్యయనంతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. రుద్రునికి 51 కిలోల పెరగన్నంతో మహాన్నపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారి వెంట వచ్చిన శృంగేరి పీఠం ఆస్థాన ప్రచారకులు మరమాముల వెంకట రమణ శర్మ, మణిదీప శర్మ, శ్రీచరణ్ శర్మ, సంస్కృత పండితులు హైగ్రీవ శర్మ, వేదపండితులు గంగు మణికంఠ శర్మ, సందీప్ శర్మ, ఆలయ సిబ్బంది మదుకర్, రజిత, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని రుద్రుడికి రుద్రాభిషేకం, ఆలయ ప్రాంగణంలో రుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల కల్యాణోత్సవం మహావైభవంగా నిర్వహించనున్నట్టు ప్రధాన అర్చకుడు ఉపేంద్ర శర్మ తెలిపారు. కార్తీక సమారాధాన (వనభోజనాలు) కూడా జరుగుతాయని చెప్పారు.

వెలుగులోకి వస్తున్న ఎస్సై లీలలు

ఠాణాను సందర్శించిన పోలీస్ అధికారులు ● సెలవులో వెళ్లిన ఎస్సై | ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ పరిధిలోని ఆ ఎస్సై అక్రమాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 'ఆ ఎస్సై రూటే సపరేటు' అనే శీర్షికతో ఎస్సై అక్రమాలపై ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ క్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంబంధిత పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఎస్సై తీరుపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. అయితే తన అక్రమాలు వెలుగులోకి వస్తుండటం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్తుండటంతో సదరు ఎస్సై సెలవులో వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన అనంతరం ఎస్సై తీరుపై పలువురు బాధితులు తమకు జరిగిన అన్యాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఓ సివిల్ తగాదాలో ఎస్సై ఆదేశాలతో వ్యవసాయ భూమిలో ఉన్న కాలువను నిబంధనలకు విరుద్ధంగా చదును చేసినట్లు జేసీబీ డ్రైవర్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ కావడం కలకలం రేపుతోంది. కాగా సోమవారం కమిషనరేట్ కార్యాలయం నుంచి ఓ ప్రత్యేక విభాగం ఏసీపీ, సిఐ స్టేషన్‌ను సందర్శించి ఆరోపణల ఆధారంగా వివరాలను సేకరించినట్లుగా తెలుస్తోంది.

మరికొన్ని ఆరోపణలు...

- స్టేషన్ పరిధిలోని ఓ వ్యాపారస్తుడు... తన కుటుంబంలో చోటు చేసుకున్న గొడవల కారణంగా ఆత్మహత్య చేసుకోగా, సహజ మరణంగా కేసు నమోదు చేసేందుకు ఎస్సై రూ. 2 లక్షల ముడుపులు తీసుకున్నట్టు ఆరోపణలు వున్నాయి.
- స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో పంటలు ముంపునకు గురికాకుండా వ్యవసాయ భూమిలో 40 ఏళ్లుగా ఓ కట్ట ఉంది. అయితే మరో వ్యక్తి స్వప్రయోజనం కోసం ముడుపులు తీసుకొని ఎస్సై ఆ కట్టను చెరిపివేయించినట్లు ఆరోపణలున్నాయి.
- మండల పరిధిలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటుండగా, రిటైర్డు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరు ఆ భూమిని ప్రభుత్వం తనకే కేటాయించందని భౌతికంగా దాడులు చేసి కత్తులతో భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బాధితులతో పాటు వామపక్షాలు ఎస్సైకి ఫిర్యాదు చేశాయి. కానీ ఎలాంటి కేసు నమోదు చేయకుండా ఎస్సై సదరు వ్యక్తికి వత్తాసు పలికినట్టు ఆరోపణలున్నాయి.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చిన సంజయ్
- గ్రామంలో తిరగలేక మనోవేదన



సంజయ్ (ఫైల్)

తరిగొప్పుల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్ సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, బంధువుల కథనం ప్రకారం. నర్సాపూర్‌కు చెందిన పల్లె సంజయ్ గౌడ్(19) చిన్నతనంలోనే తండ్రి చనిపోగా, ఇటీవల 4నెలల క్రితం అనారోగ్యంలో తల్లి మహాలక్ష్మి మృతిచెందింది. జీవనోపాధి కోసం సంజయ్ గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. తరిగొప్పుల మండలానికి చెందిన ఓ బాలికతో సంజయ్ అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంజయ్‌పై పోక్సో కేసు నమోదై 29రోజులు జైలుకు వెళ్లాడు. 20 రోజుల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. జైలు నుంచి వచ్చినప్పటి నుంచి గ్రామంలో తలెత్తుకుని తిరగలేక పోతుండడంతో తీవ్ర మనస్తాపం గుర్తై, ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

జంక్షన్లు జామ్..

» 15 ఏళ్లుగా విస్తరణకు నోచుకోని కూడళ్లు
» ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
» రోడ్డు పైనే వాహనాల పార్కింగ్
» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కాశిబుగ్గ కూడలిలో వాహనాల రద్దీ

వరంగల్ సిటీ, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో.. వరంగల్‌లో ముఖ్యమైన జంక్షన్లు 15 ఏళ్లుగా విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2010 లోనే వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్ల నుంచి నర్సంపేట వెళ్లే రోడ్డును విస్తరించేందుకు మార్కింగ్ పెట్టినా ఇప్పటి వరకు విస్తరించలేదు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మార్కింగ్ చేసిన ఇళ్ల యజమానులు పెద్ద ఎత్తున పైరవీలు చేయడంతో అధికారులు మార్కింగ్ చేసిన వరకు కూల్చివేసేందుకు జంకుతున్నారు. దీంతో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ఆ జంక్షన్లు మరింత ఇరుకుగా మారాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క మున్సిపల్, కుడా అధికారులకు హనుమకొండ మీద ఉన్న శ్రద్ధ వరంగల్ తూర్పు మీద ఉండదని, అభివృద్ధి విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. ఇప్పటికైనా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మేయర్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ దృష్టి సారించి జంక్షన్లను విస్తరించి, అభివృద్ధి చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు, నగర ప్రజలు కోరుతున్నారు.

ఇరుకుగా ఉన్న జంక్షన్లు

2010 సంవత్సరంలోనే కాశిబుగ్గ, పోచమ్మమైదాన్ జంక్షన్లను విస్తరించేందుకు మార్కింగ్ చేశారు. అలాగే నర్సంపేట రోడ్డును విస్తరించేందుకు మార్కింగ్ చేయడంతో విస్తరణలో ఇళ్లను కోల్పోయే ఇంటి యజమానులు వెంటనే ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుని జంక్షన్లను విస్తరించకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా జంక్షన్లను విస్తరించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాశిబుగ్గ జంక్షన్‌లో ఒక పది టైర్ల లారీ తిరిగే అవకాశం లేకుండా ఇరుకుగా మారిపోయింది. కాశిబుగ్గ జంక్షన్ నుంచి మార్కెట్‌కు వెళ్లే వైపు విస్తరణ చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి దేశాయిపేటకు వెళ్లే వైపు ఉన్న ఇళ్లను తొలగించి విస్తరించాల్సిన అవసరముందని ప్రయాణికులు కోరుతున్నారు. వెంకట్రామ జంక్షన్ నుంచి నర్సంపేట రోడ్డులో రాంకీ ఎంక్లేవ్ వరకు విస్తరించకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి.

రోడ్ల పైనే వాహనాల పార్కింగ్

కాశిబుగ్గ, పోచమ్మమైదాన్ జంక్షన్లు ఇరుకుగా మారి ప్రయాణికులు ఇబ్బందుల కు గురవుతుంటే.. దుకాణాల ముందు రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు మరింత కుచించుకుపోయి ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ, ఫొటోలు తీయడంలో ఉన్న శ్రద్ధ దుకాణాల ముందు నడిరోడ్డుపై పెట్టిన వాహనాల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బార్లు, వైన్ షా పులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ముందు రోడ్లపైనే వాహనాలను పా ర్కింగ్ చేసి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. వారి నుంచి మామూళ్లు ఉంటాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జంక్షన్లను విస్తరించాలి
- జి.యాదగిరి, కాశిబుగ్గ



జంక్షన్లను విస్తరించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం జంక్షన్లలో బాగా రద్దీగా ఉంటోంది. దీనికి తోడు రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి జంక్షన్లను విస్తరించాలి.


పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మూలలు విస్తరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రోడ్లను విస్తరించాలి
జె.శ్రవణ్, గాంధీనగర్



వెంకట్రామ జంక్షన్ సమీపంలో రోడ్డు ఇరుకుగా మారి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో చాలా మంది మృత్యువాత పడ్డారు. 30 ఫీట్లు ఉండాల్సిన రోడ్డు 10 ఫీట్లు ఉండడంతో పాటు పక్కనే మురుగు కాల్వ ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపట్టాలి.

మేడారంలో పూజిత వృక్షాలు

మొక్కలు నాటే ప్రాంతాల గుర్తింపునకు ప్రణాళికలు

తాడ్వాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కుల దైవాలైన సమ్మక్క సారలమ్మలకు పూజారులు నిర్వహించే పూజలు గొట్టు గోత్రాలకు వారి సంప్రదాయాలకు సంబంధించిన 10 రకాల జాతుల వృక్షాలను మేడారం పరిసరాల్లో నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మేడారం వనదేవతలను దర్శించుకోడానికి వచ్చే భక్తులు అడవి ప్రాంతాలు వసతి గృహాలు, విడిది స్థలాల్లో వనదేవతలను ప్రకృతి దేవతలుగా భావించి కనిపించిన చెట్లకు పూజలు చేస్తుంటారు. కాగా జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా భక్తులకు అందుబాటులో ఈ వృక్షాలు ఉండేలా ఈ 10 రకాల జాతుల మొక్కలను నాటి విరివిగా పెంచాలనే ఉద్దేశంతో అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులను ఈ 10 రకాల మొక్కలను సేకరించాలని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా వేల సంఖ్యలో వందల రకాల ఔషధ మొక్కలను మేడారం పరిసరాలు, రోడ్ల వెంబడి, అతిథి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జంపన్నవాగు పరిసరాల్లో పెంచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. 2026 జనవరి 28 నుంచి 31వరకు జరగబోయే సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు సుమారు 3 కోట్ల మందికి పైగా భక్తులు తరలి వస్తారని అధికారుల అంచనా వేస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

చెట్ల వివరాలు..

3వ గట్టు సారలమ్మ దేవత వంశానికి చెందిన గోత్ర వృక్షం ఇప్ప చెట్టు, పూజిత వృక్షం కస్సు చెట్టు.
4వ గట్టు పగిడిద్దరాజు, గోవిందరాజు దేవతల వంశానికి చెందిన గోత్ర వృక్షం మద్ది చెట్టు. పూజిత వృక్షం బూరుగ చెట్టు.
5వ గట్టు సమ్మక్క దేవత వంశానికి చెందిన గోత్ర వృక్షం వెదురు చెట్టు. పూజిత చెట్టు మారేడు చెట్టు.
6వ గట్టు వారికి చెందిన గోత్ర వృక్షం బండారి చెట్టు, పూజిత వృక్షం వేప చెట్టు.
8వ గట్టు పూజారలు సిద్ధబోయిన వంశానికి చెందిన గోత్ర వృక్షం నెమలి నార చెట్టు. పూజిత వృక్షం మర్రి చెట్టు.

చిట్యాలలో యువతి అదృశ్యం

పెద్దవంగర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చిట్యాల గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల గ్రామానికి చెందిన పాక యాకయ్య-యాకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారి రెండవ కుమార్తె పాక స్వాతి(20) ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. మూడు సంవత్సరాలుగా ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం అదే గ్రామానికి చెందిన కొంతం శ్యామల, స్వాతి షాపింగ్ కోసం తొర్రూరు వెళ్లారు. కాగా, తిరిగి ఇద్దరు ఇంటికి వస్తున్న క్రమంలో స్వాతి పని ఉందని అక్కడే ఉండిపోయింది. సాయంత్రానికి ఇంటికి రాలేదు. సమీప బంధువుల, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. స్వాతి తండ్రి పాక యాకయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. స్వాతి ఇంటి నుంచి వెళ్లినప్పుడు వైట్ కలర్ లెగ్గిన్స్, చున్నీ, బ్లూ వైట్ కలర్ టాప్ ధరించి ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమచారం అందించాలని ఎస్సై తెలిపారు.


పాక స్వాతి (ఫైల్)

రోడ్డు విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం

ఇబ్బందులు పడుతున్న జనం


మేడారంలో వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ముధూళి

తాడ్వాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో దుమ్ము లేస్తుందని నీళ్లు చల్లించాలని అధికారులను స్థానికులు, భక్తులు కోరుతున్నారు. మహా జాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో పనులు ఊపందుకొని జోరుగా జరుగుతున్నాయి. అయితే మట్టి, ఇసుక తరలించే వాహనాలు, భక్తుల వాహనాలతో దుమ్ము అధికంగా లేస్తుందని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు టిప్పర్ల వెనుక వెళ్లలేక పోతున్నామని ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని అంటున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇండ్లలో దుమ్ము వస్తుందని స్థానికులు తెలుపుతున్నారు. మేడారంలో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనుల్లో ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా అన్నం తినలేని పరిస్థితి మేడారంలో నెలకొందని ఇంటి బయట ఉతికి ఆరేసుకున్న బట్టలు సైతం దుమ్ముగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై నీళ్లు చల్లించి దుమ్ము లేవకుండా అధికారులు చర్య లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మేడారం గ్రామ పరిసరాల్లో వాహనాలు తిరగకుండా అడ్డు పడతామని హెచ్చరిస్తున్నారు.

రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి

డోర్నకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి బిహార్‌కు చెందిన బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం డోర్నకల్-పాపటపల్లి రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. డోర్నకల్ ఆర్‌పీఎఫ్ ఎస్సై నాగరాజు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పఠాన్ అమీర్‌ఖాన్‌లు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రం గయాకు చెందిన సుబోద్‌కుమార్ (17) మరో ఇద్దరు బిహార్ వాసులతో కలిసి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలుకు వెళ్తున్నారు. రైలు డోర్నకల్ - పాపటపల్లి స్టేషన్ల మధ్యకు చేరుకునే సమయంలో సుబోద్‌కుమార్ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఇది గమనించిన స్నేహితులు చైన్ లాగి రైలును నిలుపుదల చేసి స్నేహితుడు జారి పడిన ప్రదేశానికి వెళ్లారు. అప్పటికే సుబోద్‌కుమార్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేయడంతో డోర్నకల్ ఆర్పీఎఫ్ ఎస్సై నాగరాజు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పఠాన్ అమీర్‌ఖాన్, కానిస్టేబుల్ రవిలు ఘటనా స్థలం వద్దకు చేరుకుని శవ పంచనామా నిర్వహించి అన్నం ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

మళ్లీ పొలిటికల్ హీట్

(5వ పేజీ తరువాయి)

సమాధానం ఇవ్వకుండానే సుప్రీంకోర్టు గడువులోగా రాజీనామా చేస్తారనే టాక్ వినబడుతోంది. అయితే స్పీకర్ నిర్ణయాన్ని బట్టి కడియం కూడా తన రాజకీయ నిర్ణయాన్ని తీసుకోవచ్చుననే టాక్ కూడా ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించటంతో కాంగ్రెస్ అధిష్టానం కూడా ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లతో రాజీనామా చేయించే అవకాశం ఉందని అంటున్నారు.

కుమార్తె కోసం కారు దిగి..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో బీఆర్ఎస్ కేవలం స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లోనే విజయం సాధించింది. ఆ తర్వాత 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్యతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన కుమార్తె కావ్యను వరంగల్ ఎంపీ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో దించేందుకు కడియం తొలుత ప్రయత్నాలు చేశారు. మార్చి 14వ తేదీన నాటకీయ పరిణామాల మధ్య బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కావ్య పేరును గులాబీ అధిష్టానం ప్రకటించింది. అయితే అనుహ్యంగా కడియం పార్టీలో తమకు సహకరించటం లేదని, లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ కావటం హేయనీయమని పేర్కొంటూ తన కుమార్తెతో కలిసి మార్చి 28న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో కావ్యను వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి గెలిపించుకుని, తన వారసురాలిని రాజకీయ అరంగేట్రం చేయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కడియం శ్రీహరి టార్గెట్‌గా ఆయన పార్టీ ఫిరాయింపుపై బీఆర్‌ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించిన క్రమంలో కడియం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- హాస్పిటల్ ఎదుట బంధువుల ఆందోళన
- డబ్బులు కట్టలేదని వైద్యం నిరాకరించినట్లు ఆరోపణ

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మహిళ మృతిచెందింది. అయితే తాము డబ్బులు కట్టలేదని యాజమాన్యం వైద్యం నిరాకరించి నిండి ప్రాణాన్ని బలి తీసుకున్నారని మృతురాలి బంధువులు ఆరోపించారు. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గార్లపల్లి గ్రామానికి చెందిన గబ్బెట కల్పన (45) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో హనుమకొండ బాలసముద్రంలోని ఆస్పత్రిలో చేరింది. వైద్యం కోసం కుటుంబసభ్యులు రూ.40 వేల వరకు చెల్లించారు. కాని చికిత్సకు రూ.2 లక్షలు కావాలని వైద్యులు చెప్పడంతో ఇప్పటికిప్పుడు అంత డబ్బు లేదని, భూమి అమ్మి ఒక రోజులో చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆస్పత్రి యాజమాన్యం ఆమె వెంటిలేటర్ తొలగించి చికిత్స నిలిపివేయడంతో పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం మృతి చెందింది. ఈ ఘటనతో ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. రెండు గంటలకు పైగా బైఠాయించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌వో అప్పయ్య, సుబేదారి సీఐ రంజిత్‌కుమార్ ఆస్పత్రికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బంధువులకు నచ్చజెప్పి పంపించారు. కల్పనకు భర్త వెంకన్న, కూతురు, కొడుకు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్

గిర్మాజిపేట(వరంగల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నష్టదాయకంగా ఉన్న నిబంధనలు, విధానాలు వెంటనే ఉపసంహరించుకుని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి క్రయావిక్రయాలు పునఃప్రారంభించకపోతే సీసీఐ, ఏనుమాముల మార్కెట్ కార్యాలయాలను రైతులతో దిగ్బంధిస్తామని అఖిల భారత రైతు సమాఖ్య హెచ్చరించింది. సోమవారం వరంగల్ నగరంలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమాఖ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడారు.

పత్తి క్రయ విక్రయాలను సీసీఐ, వ్యాపారులు నిలిపివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా పత్తి దిగుబడి ఎకరాకు 5 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చిందని అన్నారు. రైతులు పత్తిని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకువస్తే సీసీఐ నిబంధనల కారణంగా కనీసమద్దతు ధర అమలు కాకపోవడంతో దళారులు తక్కువ ధరతో దోచుకుంటున్నారని ఆరోపించారు. పత్తిని కనీస మద్దతు ధరతో కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రైతులకు నష్టదాయకమైన పలు నిబంధనలను అమలుచేస్తూ క్రయవిక్రయాలను నిలిపివేసిందని ఆరోపించారు. రైతులకు ఇబ్బందికరంగా ఉన్న నిబంధనలను సీసీఐ తక్షణమే ఉపసంహరించుకుని పత్తి క్రయవిక్రయాలు చేపట్టాలని, అలాగే వ్యాపారులు సైతం క్రయవిక్రయాల బంద్‌ను మానుకోవాలని కోరారు. లేకుంటే రైతులతో సీసీఐ, మార్కెట్ కార్యాలయాల ముట్టడి తప్పదని రమేష్ హెచ్చరించారు.ఈ నెల 19న ఇందిరా పార్కు వద్ద జరిగే రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నాకు జిల్లా నుంచి ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి హంసారెడ్డి, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు నర్ర ప్రతాప్, మంద రవి, ఎం.సాగర్, ఎం.రామస్వామి, ఎ.నరసయ్య, నగేష్, ఓదెలు, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.రమేష్

కూరగాయల సాగు.. లాభాలు బాగు

» రైతులకు రాయితీలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
» సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

ఖానాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అందుకోసం రైతులను ప్రోత్సహించేందుకు రాయితీలను అందిస్తున్నది. ఇందులో ప్రధానంగా కూరగాయల నారు, శాశ్వత పందిళ్లు, మల్చింగ్, ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రం, ట్రెల్లిసింగ్‌కు(ఊతం) పలు రాయితీ ఇస్తుంది. వరంగల్ జిల్లావ్యాప్తంగా 2,515 ఎకరాల్లో 3,501 మంది రైతులు మాత్రమే కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు.

శాశ్వత పందిళ్లు

బీర, కాకర వంటి తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది.

ఒక యూనిట్‌కు రాయితీ రూ.50,000 వేలు (విస్తీర్ణం అర ఎకరం) ఐదు యూనిట్ల వరకు రైతుకు అవకాశం ఉంటుంది.


రైతు సాగు చేస్తున్న బీరకాయ తోట

ఈ కూరగాయలకు రాయితీ

టమాట, వంగ, పచ్చి మిరప, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల నారుపై ప్రభుత్వం రైతులకు 100 శాతం రాయితీ ఇస్తుంది. కావాల్సిన నారు కోసం రైతులు సిద్దిపేట జిల్లాలోని ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సంప్రదిస్తే ఉచితంగా పెంచి ఇస్తారు. అందుకు రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో 30 రోజుల ముందు ఉద్యానవన శాఖాధికారిని కలవాలి.

మల్చింగ్‌తో ఉపయోగాలు

కూరగాయల సాగులో కలుపు సమస్యను అధిగమించడానికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడానికి మల్చింగ్ ఉపయోగపడుతుంది. ఎకరానికి రూ.8వేల వరకు రాయితీ ఉంటుంది. ఒక రైతు 5 ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు.

అంటు మొక్కలకు రాయితీ..

భూమి ద్వారా సంక్రమించే వివిధ తెగుళ్లు, చౌడు నేలలను తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే అంటు మొక్కల (వంగ)కు ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల వరకు రాయితీ ఇస్తుంది. పరిమితి 1 ఎకరం మాత్రమే.

ట్రెల్లిసింగ్ (ఊతం)

ట్రెల్లిసింగ్ విధానంలో టమాట ఇతర కూరగాయల పంటలు సాగు చేయడానికి ఎకరానికి రూ.10వేల రాయితీ సదుపాయం కల్పించబడింది. రాయితీ 1 ఎకరానికి మాత్రమే పరిమితం. దీంతో పాటు బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం, తుంపర్ల సేద్యానికి 75 శాతం రాయితీ ఉంది. వరంగల్ జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారులు కోరుతున్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి
తరుణ్, ఖానాపురం మండల ఉద్యానవన శాఖాధికారి



రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపాలి. ఇక్కడి రైతులు ఉద్యానవన పంటలను చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఎక్కువగా వరి, పత్తి పంటపైనే ప్రధానంగా దృష్టి సారించారు. కూరగాయల సాగు చేస్తే ఉద్యానవన శాఖ నుంచి ఎక్కువ మొత్తంలో రాయితీలు వస్తున్నాయి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని లాభాలు పొందాలి.

సంక్షోభంలో పత్తి రైతులు

- కిషన్‌రెడ్డి, తుమ్మల రాజీనామా చేయాలి
- మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్


మీడియాతో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్దిష్టమైన విధానం లేక పత్తి రైతులు సంక్షోభంలో కూరుకున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు పంటలను అమ్ముకునే పరిస్థితి లేదని విమర్శించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. పత్తి క్వింటాకు రూ.8100 మద్దతు ధర కల్పించాలని, మార్కెట్‌లో రూ.6వేల నుంచి రూ.7వేల ధర పలకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అప్పుల బాధతో ఇప్పటికే సుమారు 500మంది పత్తి రైతులు ఆత్మహత్యచేసుకున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తమ మంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శిస్తారని వినయ్‌భాస్కర్ తెలిపారు. రైతులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఇక్కడి నుంచే ప్రత్యేక ప్రణాళికతో పోరాటాలకు సిద్ధమవుతారన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రైతు సమస్యలను గాలికివదిలేసి రాజకీయాలు చేస్తున్న మంత్రులను నిలదీయాలని రైతులను కోరారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. వడ్లకు బోనస్ వెంటనే ప్రకటించాలన్నారు. ఆసియాలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌కు పత్తి తీసుకురావద్దని అధికారులు ఆదేశాలిచ్చారంటే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు.పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు నయీమొద్దీన్, రమేష్, మహేందర్, వినీల్‌రావు, రవీందర్‌రావు పాల్గొన్నారు.

నాలా ఆక్రమణల కూల్చివేతపై స్టే

రాంగనర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్‌లోని రాంనగర్ టవర్స్ నాలాను ఆక్రమించుకుని నిర్మించారనే కారణంగా మున్సిపాలిటీ అధికారులు కూల్చివేత కోసం మార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఇటీవల ట్రైసిటీ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాంనగర్ టవర్స్‌ను సందర్శించి అపార్ట్‌మెంట్ వాసులకు ధైర్యం చెప్పడంతోపాటు కూల్చివేతను విరమించుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే విధించినట్లు అపార్ట్‌మెంట్ వాసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రైసిటీ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెంటాల కేశవరెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం నిర్మించిన అపార్ట్‌మెంట్ సరిగా సర్వే చేయకుండా కూల్చివేయాలని ప్రయత్నించడం సరైంది కాదని అన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

మడికొండ చెరువుకు మరమ్మతు చేపట్టాలి

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ముదిరాజ్‌ల వినతి

మడికొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మడికొండ పెద్ద చెరువుకు మరమ్మతు చేపట్టాలని కోరుతూ స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజును సోమవారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడికొండ పెద్ద చెరువుకట్ట చాలా చోట్ల బీటలు వారి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందన్నారు. చెరువు కట్టకు మరమ్మతు చేపట్టినట్లయితే పెద్దప్రమాదం జరిగి వందల మంది రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. వెంటనే చెరువుకట్టకు మరమ్మత్తులు, పునర్‌నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దువ్వ నవీన్, దువ్వ కొమురయ్య, దువ్వ చిన్నకుమార్, దువ్వ విజయ్, నర్ర దుర్గయ్య, నర్ర కొమురయ్య, కుక్కల దేవరాజ్, కుక్కల శ్రీకాంత్, నర్ర నరేష్, సమ్మయ్య, రవి, సదానందం, మాస్టర్ కుమార్, కుక్కల శ్రీను, యాదగిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఏఐ సాంకేతికతతో శానిటేషన్ నియంత్రణ

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఆధారంగా శానిటేషన్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రంలో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ఏఐ ద్వారా స్వచ్ఛ ఆటోలకు రూట్ ఆర్గనైజేషన్ చేశామని, ఈ సాంకేతికత ఆధారంగా నగరంలోని 2.50 లక్షల ఇండ్ల నుంచి పక్కాగా చెత్తను సేకరించడం జరుగుతుందని అన్నారు. ఆటోలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇక్కడ నమోదై ఉంటుందన్నారు. డంపింగ్ యార్డ్‌లో ఉన్న వేయింగ్ మిషన్ పనులు కూడా ఇక్కడి నుంచి ఆపరేట్ చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఆస్తి, నల్లా పన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర, ఎంహెచ్‌వో రాజేశ్, ఐసీసీసీ ఇన్‌చార్జి తేజస్వితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిరోజూ చెత్తను ప్లాంట్‌కు చేర్చాలి

ప్రతిరోజూ వంద టన్నుల తడిపొడి చెత్త సేకరణే లక్ష్యంగా శానిటేషన్ సిబ్బంది పని చేయాలని, తడి పొడి చెత్తను సకాలంలో ప్లాంట్‌కు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం బాలసముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న వర్మి కంపోస్ట్ యూనిట్‌తో పాటు బయో కంపోస్ట్ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శానిటేషన్ విభాగంలో సుస్థిర మార్పులు తెచ్చేందుకు నగరంలో ఐదు బయో కంపోస్ట్ యూనిట్లును ప్రారంభిస్తామన్నారు. భీమారం వాటర్ ట్యాంక్, నయీంనగర్ పాత మార్కెట్, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్, కీర్తినగర్ ఓపెన్ ప్లేస్, పోతననగర్ లాండ్రోమార్ట్ పక్కన బయోకంపోస్ట్ యూనిట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఆస్కి వారి సహాయంతో ప్రతీ స్వచ్ఛ ఆటోకు ఒక కార్మికుడిని నియమించామని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. రాంపూర్ డంపింగ్ యార్డ్‌కు జీరో వేస్టేజ్ వెళ్లడం లక్ష్యంగా ఈ ప్రక్రియ ప్రారంభించామన్నారు. ప్లాస్టిక్ రహిత నగరంగా వరంగల్‌ను తీర్చి దిద్దడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఈఈ మహేందర్, ఏఈ సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీల్, వాప్ ప్రతినిధి పవన్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, చిత్రంలో కమిషనర్

మెప్మా సిబ్బంది క్రమశిక్షణతో పని చేయాలి

మెప్మా విభాగం సిబ్బంది, అధికారులు క్రమశిక్షణతో పని చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మెప్మా అధికారులతో మాట్లాడారు. ఆర్‌పీలు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పని చేయాలని, ప్రతీ సభ్యురాలికి మెప్మా ద్వారా అందే పథకాలను వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, మెప్మా అధికారులు రమేష్, శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగట్టు దేవస్థానం భూమిని కాపాడాలి



కేయూ ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి-భీమారం ఉమ్మడి గ్రామాలకు చెందిన ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం భూమిని కొంత మంది కబ్జాదారులు కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆ భూమిని కాపాడాలని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం కేయూసీ పోలీసు స్టేషన్‌లో ఎస్సైని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ మహిమాన్వితుడైన ఎర్రగట్టు వేంకటేశ్వస్వామికి దాతలు విరాళంగా ఇచ్చిన భూములపై కొంత మంది కుట్రదారులు కన్నేసి విరాళంగా ఇచ్చిన భూమి కాగితాలను మాయం చేసి ఇప్పుడు ఆ భూములను దక్కించుకునేందుకు కొత్తదారులు వెతుకుతున్నారని ఆయన ఆరోపించారు. శ్రీ ఎర్రగట్టు దేవస్థానానికి దాతలు స్వయంగా రాసి ఇచ్చిన దస్తావేజు కాగితాల మాయంపై సమగ్ర విచారణ జరిపి దేవస్థానం భూములను కబ్జా చేస్తున్న వారి పై చట్టపరమైన కేసులు నమోదు చేసి చర్య తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎస్సైని కలిసిన వారిలో దేవస్థానం చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, దేవస్థానం డైరెక్టర్ కనపర్తి రాజు, మాజీ చైర్మన్ జన్ను రవీందర్, మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోడెల మురళి, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు తాళ్ల మధు తదిత రులున్నారు.

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా



హనుమకొండలో ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ పెన్షనర్లకు మినిమం పెన్షన్ నెలకు రూ. వెయ్యి మాత్రమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి తూపురాణి సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల కన్వీనర్ ఉప్పు సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన పెన్షన్ విద్రోహదినం ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్‌స్కిల్డ్ లేబర్ రోజుకు రూ. వెయ్యి సంపాదిస్తుంటే 35 ఏళ్ల సేవ చేసిన స్కిల్డ్ లేబర్‌కు రిటైర్ అయిన తర్వాత రూ. వెయ్యి పెన్షన్ చెల్లించడం సరికాదన్నారు. ఉప్పు సమ్మయ్య మాట్లాడుతూ.. ఈపీఎఫ్ పెన్షనర్ల ఆదాయం ఏడాదికి రూ. 12 వేలు మాత్రమే ఉన్నప్పటికీ తెల్ల రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, ఆరోగ్యశ్రీ వైద్య సౌకర్యం ప్రభుత్వం వర్తింప చేయడం లేదన్నారు. అనంతరం ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో పెన్షనర్ల రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, సిరంగి నారాయణ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్మీ అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ స్నేహ శబరీష్‌ను సోమవారం చెన్నైకి చెందిన ఆర్మీ రిక్రూటింగ్ డీడీజీ, బ్రిగేడియర్ ఆర్‌కె అవస్తి, సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ డైరెక్టర్ కల్నల్ సునీల్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు.



కలెక్టర్‌తో ఆర్మీ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న రూప్ సింగ్

'తెలంగాణ జాగృతిని బలోపేతం చేయాలి

తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్

వరంగల్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి ముఖ్య నాయకులంతా ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పని చేయాలని, జాగృతిని ఇంటింటికీ పరిచయం చేసి బలోపేతం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్ అన్నారు. సోమవారం జాగృతి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నూకల రాణి అధ్యక్షతన కాశిబుగ్గ జాగృతి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రూప్‌సింగ్ మాట్లాడుతూ.. సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా త్వరలోనే అనుబంధ కమిటీల వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నలమాన శ్రీకాంత్ గౌడ్, యూత్ రాష్ట్ర కార్యదర్శి తడిగొప్పుల మల్లేశ్, సత్యనారాయణ గౌడ్, కుసుమ రాజు, తాండ్ర భాస్కర్, కిషోర్, సుశీల్, రాజు, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి జైలు వార్డెన్ దుర్మరణం

ఓదెల మండల కేంద్రంలో ఘటన

ఓదెల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తారకరామ కాలనీ వద్ద ఉన్న 32వ రైల్వే గేటు సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద సోమవారం పరకాల సబ్ జైల్ వార్డెన్ నాగపూరి రాకేష్ రైలు నుంచి పడి మృతి చెందాడు. వరంగల్ చింతల పల్లిలో నివాసముంటున్న రాకేష్ పెద్దపల్లిలో జరిగిన మిత్రుడి వివాహా నికి హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం కాజీపేటకు వెళ్లేందుకు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రాకేష్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

'క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజం'

హసన్‌పర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని తెలంగాణ అథ్లెటిక్ సంఘం చైర్మన్ వరదరాజేశ్వర్‌రావు అన్నారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం జిల్లా స్థాయి అస్మిత అథ్లెటిక్స్ లీగ్ అండర్-14, అండర్-16 బాలికలకు 11 అంశాలలో పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాలు, సూచనల ప్రకారం వివిధ అంశాల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లతో పాటు పాల్గొన్న వారందరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అథ్లెటిక్ సంఘం చైర్మన్ వరదరాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతీ క్రీడాకారుడు గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగినప్పుడే జీవితంలో రాణించగలరన్నారు. కార్యక్రమంలో కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి, తెలంగాణ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ కె.అశ్విని, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, వైస్ ప్రెసిడెంట్ పింగిళి రమేష్‌రెడ్డి, టీఏఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు సాంబమూర్తి, వాసు దేవ రావు, రజనీకాంత్, మహేందర్, కిట్స్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, తిరుపతి, రంజిత్‌తో పాటు వివిధ పాఠశాలలకు చెందిన 20 మంది పీఈటీలు, పీఈటీలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనం

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయి. నాలుగో రోజు చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, ప్రపంచ శాంతి బిరుదు అవార్డు గ్రహీత ఎండి సిరాజొద్దీన్ హాజరయ్యారు. వారి సమక్షంలో 25 మంది కవులు, కవయిత్రులు వారి కవితలను వినిపించారు. అనంతరం పాఠకులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించి కేయూ ప్రొఫెసర్ వంశీకృష్ణ పుస్తక పఠనం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రంథ పాఠకులుగా జి. కరుణాకర్‌ను, జి. కావ్యశ్రీని ఎంపిక చేశారు. వీరిని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శశిజాదేవి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు గ్రేడ్ -2, లైబ్రేరియన్, సీహెచ్. మల్సూర్, ఎం.పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, రికార్డు అసిస్టెంట్ మమత, ఇంటర్నెట్ నిర్వాహకుడు జి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'పాపన్న ఆశయాలు సాధించాలి'

న్యూశాయంపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్కులో ఆదివారం రాత్రి వరకు సాగిన గోపా కార్తీకమాస వనభోజనాలు కార్యక్రమానికి శ్రీనివాస్‌గౌడ్, జనగామ ఆర్డీవో జీ.వీ శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గోపా హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజు గౌడ్, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తాళ్లపెల్లి రవిగౌడ్, కార్పొరేటర్ పద్మ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మెట్టు రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మడికొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై గల మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో స్వామి వారికి ఈవోలు ఆర్. సునీత, ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్య నారా యణశర్మ ప్రాతఃకాల రుద్రాభిషేకం, మహాహారతి చేశారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం లో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకాలు జరిపారు. అనంతరం మహా అన్నపూజ నిర్వహించారు. ఆలయ పూజారి జాగర్లపూడి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనలో సీఎం వైఖరి తెలపాలి

- బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి తనవైఖరేంటో స్పష్టం చేయాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో రిజర్వేషన్లకు సంబంధించి ముఖ్యమంత్రికి రాసిన లేఖను విడుదల చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లు , సవరణ బిల్లు, జీవో లాంటి అన్ని ప్రయత్నాలు విఫలమైనందున రిజర్వేషన్ల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రత్యామ్నాయ మార్గాలను బలహీన వర్గాలకు తెలియజేయాలని ఆయన డిమాండ్‌చేశారు. రిజర్వేషన్ల సాధనకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను కేంద్ర ప్రభుత్వం సహకారం తీసుకోవడానికి సంబంధించిన అన్ని అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నా రు. సమావేశంలో బీసీ ఐక్యసంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదునూరి రాజమౌళి మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే రిజర్వేషన్లను సాధించగలుగుతామని రిజర్వేషన్ల సాధనకు కేంద్రంతో సంప్రదిం పులు ప్రారంభించాలని అభిప్రాయ పడ్డారు. సమావేశంలో బీసీ నాయకులు సోమిడి అంజన్‌రావు, దారబోయిన సతీష్, నూతనకంటి ఆనందం, బుట్టి శ్యాంయాదవ్, కేడల ప్రసాద్, డాక్టర్ పాలడుగుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తిరునహరి శేషు

'పుల్లారెడ్డి ఆశయాలను కొనసాగించాలి'

వడ్డెపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత విప్లవోద్యమ నిర్మాత, ప్రతిఘటన పోరాట రూపశిల్పి దివంగత చంద్ర పుల్లారెడ్డి ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ మాట్లాడారు. చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా ఆయన రచనలకు సంబంధించిన పుస్తకా విష్కరణన సభ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో న్యూడెమోక్రసీ నేతలు బండి కోటేశ్వర్‌రావు, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, శనిగరపు చరణ్, కరుణాకర్, అనిల్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరువరంగం ప్రభాకర్

'పెన్షనర్ల ప్రయోజనాలను చెల్లించాలి'

వడ్డెపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల ప్రయోజనాలను ఏకమొత్తంలో చెల్లించాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్‌జీఆర్‌ఈఏ)రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రామ్‌నగర్‌లోని టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు నగదు రహిత వైద్యసేవలను వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం టీఎస్‌జీఆర్‌ఈఏ హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుం దూరు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.కుమారస్వామి, కోశాధికారిగా పి.విద్యాసాగర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండీ.ఖాజానయీముద్దీన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నారాయణరావు, నర్సింహ రామయ్య, పి. సరళ, సెక్రటరీలుగా బుగులారెడ్డి, నర్సింహారెడ్డిలను ఎన్నుకున్నారు. మాదిరెడ్డి మల్లారెడ్డి, కందుల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో పుష్పగిరి పీఠాధిపతి

వరంగల్ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని చారిత్రక భద్రకాళి అమ్మవారిని జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి మదభి నవోదండ విద్యాశంకర భారతి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి చేరుకున్న స్వామిజీకి ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకబృందం స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్తీక మాసం చివరి రోజు కావడంతో ఆలయాన్ని సందర్శించిన స్వామిజీ వల్లభ గణపతి స్వామిని దర్శించుకొని భద్రకాళి అమ్మవారికి, భద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యాభవన్ హైస్కూల్ విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హడుప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీల్లో భారతీ విద్యా భవన్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకోవడం ఆనందంగా ఉందని స్కూల్ కరస్పాండెంట్ తక్కళ్లపెల్లి బుచ్చిబాబు అన్నారు. సోమవారం పాఠశాలలో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. 8వ తరగతికి చెందిన ఎస్. శ్రేష్ఠ చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి సాధించగా, ఎం. కీర్తిక వక్తృత్వంలో ద్వితీయ బహుమతిని సాధించగా, 9వ తరగతికి చెందిన బి.ధ్రువ వ్యాసరచన పోటీల్లో తృతీయ బహుమతి సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ తక్కళ్లపెల్లి శ్రీదేవి, డ్రాయింగ్ టీచర్ వేణుమాధవ్, ఎస్. కృష్ణారావు, భార్గవ్ రెడ్డి, అవతార్ సింగ్, వినీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులు

జూబ్లీహిల్స్ ఓటమికి మాది సమష్టి బాధ్యత: బూర

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ ఓటమికి ఏ ఒక్కరిదో బాధ్యత కాదని, అది సమష్టి బాధ్యత అని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో అనుకున్న స్థాయిలో ఓట్లు సాధించలేకపోయామని వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బూర నర్సయ్యగౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ రూ.200 కోట్లు ఖర్చు చేసిందని, బీజేపీ వద్ద అంత డబ్బులేదని అన్నారు. బీఆర్ఎస్ వద్ద టన్నుల కొద్దీ నోట్ల కట్టలున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తమకు బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో రాహుల్ విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

కృత్రిమ మేధ కన్నా పెద్ద సంక్షోభం వస్తోంది

- నిపుణులైన కార్మికులేరీ?
- ఆనంద్ మహీంద్ర వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 17: కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాలు పోతాయని ఆందోళన వ్యక్తమవుతున్న సమయంలో అంతకన్నా పెద్ద సంక్షోభమే రానుందని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర అభిప్రాయపడ్డారు. నిపుణులైన కార్మికులు లేకపోవడమే పెద్ద సమస్య కానుందని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "కృత్రిమ మేధ కారణంగా వైట్ కాలర్ ఉద్యోగాలు పోతాయని భయపడి అందరూ బిజీగా ఉన్నారు. కానీ అంతకన్నా చాలా పెద్ద సంక్షోభాన్ని మరిచిపోతున్నారు. అదే నైపుణ్యంగల కార్మికులు లేకపోవడం... ఫోర్డ్ కంపెనీ సీఈఓ ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించారు. ఫోర్డ్ కంపెనీలో 5,000 మెకానిక్ ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. ఏడాదికి 1,20,000 డాలర్లు (సుమారు కోటి రూపాయలు) ఇస్తామన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. అమెరికాలో దాదాపు పది లక్షల అత్యవసర సేవలైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, ఫ్యాక్టరీ కార్మికుల వంటి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దశాబ్దాలుగా డిగ్రీలు, డెస్కు ఉద్యోగాలను పైస్థాయిలో ఉంచి, నైపుణ్యంగల కార్మికులను కింది స్థాయిలో పెట్టాం. ఈ ఉద్యోగాలకు కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదు. వీటికి నేర్పు, శిక్షణ, నైపుణ్యం అవసరం ఉంటుంది. అందువల్ల కలల కెరీర్‌గా సమాజం భావించే ఉద్యోగాల్లో మార్పులు చూస్తామా? కృత్రిమ మేధ యుగంలో ప్రపంచం నడిచేందుకు అవసరమైన ఉద్యోగాలు చేసేవారే నిజమైన విజేతలుగా ఉంటారా? పోరాటాల ద్వారా కార్మికులు ఎదుగుతారని మార్క్స్ అంచనా వేశారు. అయితే నైపుణ్యం కలిగి ఉండడం, నైపుణ్యం కలవారికి కొరత ఉండడం, ప్రత్యామ్నాయంలేని పరిస్థితుల వల్ల కూడా వారు ఎదుగుతారని ఆయన ఊహించలేకపోయారు. విప్లవం హింస ద్వారా రాదు.. విలువను కనుగొనడం ద్వారా వస్తుంది" అని అభిప్రాయపడ్డారు.

భూములకు బదులు బ్యాంకు డిపాజిట్లను గ్యారెంటీగా తీసుకోండి

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి సీబీఐ కోర్టులో డిపాజిట్ చేసిన ఆస్తి పత్రాలను విడుదల చేసి వాటి స్థానంలో బ్యాంకు గ్యారెంటీలను, బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెట్టేందుకు హైకోర్టు ఆమోదం తెలిపింది. ఈ మేరకు జగన్‌కు చెందిన కంపెనీలు జగతి పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రా, ఇందిరా టెలివిజన్ దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్‌లను అనుమతిస్తూ జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. అక్రమాస్తుల కేసుల్లో భాగంగా జగన్ కంపెనీలకు చెందిన బ్యాంకు ఖాతాలను 2012లో ఈడీ స్తంభింపజేసింది. ఆ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు, రోజువారీ వ్యయాల నిర్వహణకు బ్యాంకు ఖాతాలు అవసరం కాబట్టి వాటి బదులుగా రేవన్ ఇన్‌ఫ్రా పేరుపై బెంగుళూరు సమీపంలో ఉన్న 9 ఎకరాల్లోని మూడు ఆస్తులకు సంబంధించిన హక్కు పత్రాలను సీబీఐ కోర్టులో డిపాజిట్ చేశారు. తాజాగా ఈ పత్రాలను విడుదల చేయాలని కోరుతూ జగన్‌కు చెందిన కంపెనీలు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేశాయి.

ముస్లింలీగ్ మావోవాదీ కాంగ్రెస్: మోదీ

కాంగ్రెస్ పార్టీ అర్బన్ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తూ ముస్లింలీగ్ మావోవాదీ కాంగ్రెస్ (ఎంఎంసీ)గా మారిందని ప్రధానమంత్రి మోదీ విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లోనూ అర్బన్ నక్సల్స్‌ను చొప్పించిన ఆ పార్టీ.. ఇప్పుడు ముక్కలయ్యే స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. ప్రధాని, బీజేపీ నిత్యం ఎన్నికల మోడ్‌లోనే ఉంటాయన్న ప్రతిపక్షాల విమర్శలను మోదీ తిప్పికొట్టారు. తాము నిత్యం ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తున్నందునే అన్ని ఎన్నికల్లో గెలుస్తున్నామని తెలిపారు.

ఐబొమ్మ ద్వారా

బెట్టింగ్ యాప్‌ల ప్రచారం

ఉచిత సినిమా ఎరతో 50లక్షల మంది డేటా తస్కరణ

- వాటిని సైబర్ నేరగాళ్లు వాడుకొనే ప్రమాదముంది
- రవి వందల కోట్లు క్రిప్టో కరెన్సీగా తరలించాడు
- మేమే పట్టుకున్నాం... ఎవరూ సహకరించలేదు: సజ్జనార్
- విలేకరుల సమావేశంలో పైరసీ వివరాల వెల్లడి
- లక్షల మంది కష్టం దోచుకున్నారు: చిరంజీవి
- ఉచితం వెనుక ప్రాణాంతక ముప్పు: రాజమౌళి
- ఐబొమ్మ, బప్పంటీవీ వెబ్‌సైట్ల మూసివేత
- సజ్జనార్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు



వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ కమిషనర్ సజ్జనార్, చిత్రంలో రాజమౌళి, చిరంజీవి, దిల్‌రాజు, నాగార్జున, సురేశ్‌బాబు

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి వల్ల సినిమా రంగానికే కాకుండా సమాజానికి కూడా బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ రూపంలో తీరని నష్టం జరిగిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా రవిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సినీ హీరోలు చిరంజీవి, నాగార్జునలతో పాటు దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు దిల్‌రాజు, సురేష్ బాబులతో కలిసి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, ఇమ్మడి రవిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్, బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. రవి కొత్త సినిమాల పైరసీ ద్వారా సినీ పరిశ్రమకు నష్టం చేశారని చెప్పారు. వెబ్‌సైట్లో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ చేస్తున్నాడని, ఆ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకొని అప్పుల పాలై చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించారు. ఐ బొమ్మ మాస్టర్ మైండ్ రవి వద్ద 1972 నాటి గాడ్‌ఫాదర్ సినిమా మొదలు ఇటీవల వచ్చిన ఓజీ సినిమా వరకు హాలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, ఇతర భాషల సినిమాల పైరేటెడ్ కాపీలు 21వేల వరకు ఉన్నాయని తెలిపారు. పైరసీతో రూ.20 కోట్లు సంపాదించిందించాడని, అందులో రూ.3 కోట్లు సీజ్ చేశామని వెల్లడించారు. ఐబొమ్మ వెబ్‌సైట్ల ద్వారా లక్షల మంది ప్రేక్షకులను 1విన్, 1ఎక్స్ బెట్ వంటి అక్రమ బెట్టింగ్ వేదికల వైపు మళ్లించాడని చెప్పారు. రవి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల సమాచారం ఉందని, దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డేటాను ఎవరెవరికి అందించారనే విషయమై లోతైన విచారణ చేపడుతామని చెప్పారు. రవి లేటెస్ట్ టెక్నాలజీ వినియోగించి ఉదయం థియేటర్‌లో రిలీజైన సినిమాను సాయంత్రానికే ఐబొమ్మలో పెట్టేవాడన్నారు. ఈ కేసులో దుద్దెల శివాజీ, సురస్ల ప్రశాంత్‌లను కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఐబొమ్మ, బప్పం టీవీ కొన్నేళ్లుగా సినిమాలను పైరసీ చేస్తున్నాయని, కొన్ని సినిమాలను థియేటర్లలో విడుదల కాగానే కొన్ని సినిమాలను ఓటీటీలో విడుదల కాగానే గంటల వ్యవధిలోనే రెండు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. థియేటర్లలో కెమెరాలు పెట్టి, ఓటీటీ ప్లాట్ ఫామ్‌లో స్క్రీన్ రికార్డ్ చేస్తూ ఆ వీడియోలను వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశారని తెలిపారు. రెండు వెబ్‌సైట్లనూ నిలిపివేశామని తెలిపారు. పైరసీ చేయడంలో ఎలాంటి తప్పు లేదంటూ కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, ఇలా చేయడం చట్టప్రకారం శిక్షార్హమని చెప్పారు. ఈ వెబ్‌సైట్ల అక్రమ బెట్టింగ్, గేమింగ్ సైట్లకు యూజర్లను బలవంతంగా మళ్లిస్తున్నారని, వ్యక్తిగత డేటా కూడా దొంగతనానికి గురవుతోందని తెలిపారు. క్షుణ్ణంగా దర్యాప్తు చేసేందుకు వారం రోజుల కస్టడీ కోరుతున్నామని చెప్పారు.

దమ్ముంటే పట్టుకోండని సవాల్

వెబ్‌సైట్ బ్లాక్ చేస్తే 5 కోట్ల మందికి పైగా యూజర్ల సమాచారం తమ దగ్గర ఉందని రవి బెదిరింపులకు దిగిన విషయాన్ని సజ్జనార్ ప్రస్తావించారు. "వేరే దేశంలో ఉండి దమ్ముంటే పట్టుకొండి అని సవాల్ విసిరాడు. ఇప్పుడు ఎక్కడున్నారో చూడండి. తప్పు చేసిన వాళ్లు, చేస్తున్న వాళ్లు చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు" అన్నారు. రవి బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్లు ఫ్రీజ్ చేశామని, మూడు మొబైల్ ఫోన్లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఆరు సీపీయూలు, 10 బ్యాంకు పాస్‌బుక్‌లు, 35 వివిధ బ్యాంకులకు చెందిన చెక్‌బుక్‌లతో పాటు 34 బ్యాంకుల డెబిట్/క్రెడిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అదనపు పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు, డీసీపీ దారా కవిత నేతృత్వంలో సైబర్ క్రైం యూనిట్ ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు.

ఇతర దేశాల్లో పౌరసత్వం

"ఇమ్మడి రవి స్వస్థలం విశాఖ. బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. ప్రహ్లాద్ వెల్లాల పేరుతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులు తీసుకున్నాడు. ఏపీలో కూడా డ్రైవింగ్ లైసెన్స్ ఉంది. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారు. భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఫ్రాన్స్‌లో ఉంటూ థాయ్‌లాండ్, దుబాయ్ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐ బొమ్మ ప్రారంభించాడు. 21 వేల సినిమాలను అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్ సర్వర్లలో పెట్టాడు. 110 డొమైన్లను కొనుగోలు చేశాడు. వందల కోట్ల నగదు క్రిప్టో కరెన్సీ రూపంలో బదిలీ అయింది. రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం" అని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇతడిపై లోతైన దర్యాప్తు కోరుతూ సీబీఐ, ఈడీలకు లేఖలు రాస్తామన్నారు. ఐబొమ్మ నిర్వాకుల అరెస్ట్ తర్వాత కొంతమంది పోలీసులను కించపరుస్తూ సోషల్ మీడియాలో మీమ్స్ చేస్తున్నారని, వారిపై కూడా దృష్టి పెడతామని హెచ్చరించారు. పోలీస్ నెట్‌వర్క్ ద్వారా నిందితులను పట్టుకున్నామని, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు తమకు ఎవరూ సహకరించలేదని చెప్పారు. సైబర్ క్రైం అధికారులను సీపీ సత్కరించి, రివార్డులు అందించారు.

కష్టాన్ని దోచుకుంటే బాధగా ఉంటుంది: చిరు

సినీ పరిశ్రమ మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఆధారపడి బతుకుతున్నారని, వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉంటుందని చిరంజీవి అన్నారు. ప్రజలు కూడా సినిమా తమదిగా భావించి, పైరసీకి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రాజమౌళి తీయబోయే సినిమాతో మన ఖ్యాతి ఖండాంతరాలకు విస్తరిస్తుందని చెప్పారు. అలాంటి సమయంలోనూ పైరసీ ముప్పు ఉండటం ఆందోళనకరమని అన్నారు.

ఉచితం వెనుక పెద్ద ప్రమాదం: రాజమౌళి

పోలీసులకు ఛాలెంజ్ విసిరిన నిందితుడు రెండు నెలల్లో అరెస్ట్ కావడం సినిమాలో సూపర్ హిట్ సన్నివేశంలా ఉందని దర్శకుడు రాజమౌళి అన్నారు. ఏదీ ఉచితంగా రాదని, ఒకవేళ అలా వస్తే దాని వెనుక పెద్ద ప్రమాదం పొంచి ఉంటుందని, అది చావు వరకూ తీసుకెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. పైరసీ సినిమాలను అడ్డం పెట్టుకుని ప్రజల వ్యక్తిగత సమాచారం విక్రయించి సంపాదిస్తున్నారని తెలిపారు. మీ పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఈ మెయిల్ ఐడీ ఉంటే చాలు సైబర్ నేరగాళ్లు మీ ఖాతా ఖాళీ చేయడం, బెదిరింపులకు పాల్పడటం ఇలా ఏదైనా చేయొచ్చని చెప్పారు. మన సమాచారం క్రిమినల్స్ చేతిలో పడటం వల్ల డబ్బులు పోవడమే కాదు ప్రాణాలు పోయే వరకూ వెళ్తోందన్నారు. పైరసీ వల్ల సినిమా వాళ్ల కన్నా చూసేవాళ్లే ఎక్కువ నష్టపోతున్నారని చెప్పారు. పైరసీని అడ్డుకునేందుకు త్వరలో సినీ పరిశ్రమ లేటెస్ట్ టెక్నాలజీని అందిపుచ్చుకోబోతోందని సురేశ్‌బాబు తెలిపారు. సజ్జనార్‌ను ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. "సినిమాలు విడుదలైన రోజునే ఇంటర్నెట్‌లో పోస్ట్ చేస్తున్న ముఠాల వల్ల పరిశ్రమ తీవ్రంగా నష్టపోతోంది. పైరసీముఠాలను కట్టడి చేయడం స్వాగతించదగ్గ పరిణామం" అన్నారు. బెట్టింగ్ యాప్స్‌ను నియంత్రించేందుకు సజ్జనార్ చేపట్టిన కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లో కదలిక తెచ్చిందని ప్రశంసించారు.

మీ దేశంలో సేవలు నిలిపివేస్తున్నాం

రవి వద్ద ఉన్న పాస్‌వర్డ్‌ల సాయంతో ఐ బొమ్మ, బప్పం టీవీతో పాటు దానికి అనుబంధంగా ఉన్న 65 వెబ్‌సైట్లను పోలీసులు బ్లాక్ చేయించారు. వెబ్‌సైట్‌లో మీ దేశంలో మా సేవలు శాశ్వతంగా నిలిపి వేశామంటూ ప్రస్తుతం అందులో ప్రకటన కనిపిస్తోంది. "ఇటీవల మా గురించి మీకు తెలిసి ఉండవచ్చు లేదా మొదటి నుంచి మీరు మమ్మల్ని అభిమానిస్తూ ఉండవచ్చు, ఏది ఏమైనా మాసేవలు మీ దేశంలో శాశ్వతంగా నిలిపివేస్తున్నాం. మిమ్మల్ని నిరాశపరిచినందుకు క్షమాపణలు కోరుతున్నాం' అన్న సందేశం కనిపించింది.

మా కుటుంబంలోనూ ఒకరు డిజిటల్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

నేరగాళ్లు సుమారు రెండు రోజుల పాటు ఎటూ కదలకుండా ఇంట్లోనే ఉండేటట్లు నిర్బంధించారని చెప్పారు. సినిమా పైరసీ ముఠా అరెస్టు నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌తో పాటు మీడియాలో మాట్లాడిన నాగార్జున తన కుటుంబంపై జరిగిన సైబర్ నేరాన్ని వెల్లడించారు. ఐబొమ్మ రవి బృందం రూ.20 కోట్ల కోసం సినిమాల పైరసీ చేయడం లేదని, దీని వెనుక అంతర్జాతీయ ముఠా ఉందని చెప్పారు. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా వారికి చేరిందని, ఇందులో సైబర్ నేరాల ద్వారా వేల కోట్లు దోచేసే పెద్ద ప్లాన్ ఉంటుందని చెప్పారు. పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని నాగార్జున అన్నారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ వార్త తెలిసి చెన్నై నుంచి ఒక మిత్రుడు ఫోన్ చేసి హైదరాబాద్ పోలీసులు మాటల మనుషులు కాదని, చేతల్లో చూపించారని ప్రశంసించాడని చెప్పారు.

పంజా విసురుతున్న చలిపులి

- పలు ప్రాంతాల్లో 10 డిగ్రీలకంటే దిగువకు ఉష్ణోగ్రతలు
- ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7 డిగ్రీలు
- గ్రేటర్ పరిధిలోని శేరిలింగంపల్లిలో 8.8 డిగ్రీలు నమోదు
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి: వాతావరణ కేంద్రం

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ/ ఆసిఫాబాద్/ కోహీర్/ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలిపులి పంజా విసురుతోంది. రాజధాని హైదరాబాద్ నగరం సహా అనేక ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీ సెల్సియస్ కంటే దిగువకు పడిపోవటంతో ప్రజలు చలికి వణుకుతున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో చలి తీవ్రత మరీ అధికంగా ఉంది. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో ఆదివారం రాత్రి అత్యల్పంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.1 డిగ్రీలు రికార్డయ్యింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. రంగారెడ్డి, వికారాబాద్, సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల, మెదక్, నిర్మల్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఆదివారం రాత్రి 8-10 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.1 డిగ్రీలుగా నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై చలి తీవ్రత ప్రభావం అధికంగా ఉంది. మరో మూడు రోజులపాటు అన్ని జిల్లాల్లో సగటున 8.6 నుంచి 13.5 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రమంతటికి యెల్లో అలర్ట్ జారీ చేసింది.

శేరిలింగంపల్లిలో 8.8 డిగ్రీలు..!

హైదరాబాద్‌లో చలి తీవ్రత వేగంగా పెరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ శివారుప్రాంతాల్లో చలి మరీ అధికంగా ఉంది. ఆదివారం రాత్రి శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు గ్రేటర్ పరిధిలో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రత అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాబోయే రెండు రోజులు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదవుతాయని అధికారులు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయాయి.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
సిర్పూర్ (యూ)	7
కోహీర్	7.1
సదాశివపేట	7.9
తిర్యాణి	8.1
శేరిలింగంపల్లి	8.8
రుద్రంగి	8.4
రాజేంద్రనగర్	10.0

మృతుల కుటుంబాలకు 5లక్షలు

- పరిహారం ఇవ్వాలని క్యాబినెట్ భేటీలో నిర్ణయం
- మంత్రి అజారుద్దీన్ ఆధ్వర్యంలో సౌదీకి ప్రతినిధులు..
- మత సంప్రదాయం ప్రకారం అక్కడే అంత్యక్రియలు
- ఒక్కో కుటుంబం నుంచీ ఇద్దరిని పంపేలా ఏర్పాట్లు..
- సీఎం, డిప్యూటీ సీఎం, రాష్ట్ర, కేంద్ర మంత్రుల దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: కిషన్‌రెడ్డి, సంజయ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సౌదీ బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మంత్రి అజారుద్దీన్, మజ్లిస్ ఎమ్మెల్యేతో పాటు మైనారిటీ విభాగానికి చెందిన ఓ అధికారితో కూడిన బృందాన్ని సౌదీకి పంపింది. మృతుల అంత్యక్రియలను మత సంప్రదాయం ప్రకారం మక్కాలోనే నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరు చొప్పున మృతుల బంధువులను మక్కా తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఘటనపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన యాత్రికులు ప్రాణాలు కోల్పోవడం దుఃఖాన్ని కలిగించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహకారం అందించాలని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవలని ప్రభుత్వానికి సూచించారు. సౌదీ ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. సీఎం సూచన మేరకు తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రమాదంలో హైదరాబాద్ వాసులు మృతి చెందడం బాధాకరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సౌదీలోని ఎన్నారై కాంగ్రెస్ నేతలతో మాట్లాడిన ఆయన.. సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్డాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్ సూరితో మంత్రి అజారుద్దీన్ మాట్లాడి.. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన యాత్రికులకు వైద్య సాయం అందించాలని, సహాయక చర్యలను సమన్వయం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని హజ్ హౌస్‌లో సీనియర్ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. సౌదీ బస్సు ప్రమాదంలో హైదరాబాద్ వాసులు మృతి చెందడం బాధాకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను అన్ని విధాలా ఆదుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ ఘటనపై హోంమంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు సౌదీలోని భారత అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బస్సు ప్రమాదంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన తీవ్రంగా కలిచివేసిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు పేర్కొన్నారు. అలాగే, ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, ఎన్ఎండీ ఫరూక్ విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు మనోధైర్యాన్ని కలిగించాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, రాజమౌళి, దిల్ రాజు, సురేష్‌బాబు, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తదితరులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.



4 వేల అప్పు తీర్చమన్నందుకు కొట్టి చంపారు

- సమీప బంధువుల ఘాతుకం.. ములుగు జిల్లాలో ఘటన



సమ్మయ్య (ఫైల్)



సంఘటన స్థలంలో స్తంభానికి కట్టేసి ఉన్న సమ్మయ్య మృతదేహం

ములుగు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన రూ.4 వేలను తిరిగి ఇవ్వమని అడగడానికి వెళ్లిన ఓ వ్యక్తిని అతడి సమీప బంధువులు కొట్టి చంపారు. ఈ ఘటన ములుగు జిల్లాలోని లాలాయిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రీషియన్ జాడి సమ్మయ్య (38) ములుగు మండలంలోని లాలాయిగూడెం గ్రామానికి చెందిన దూరపు బంధువు సల్లూరి పవిత్రకు రూ.4 వేలు అప్పుగా ఇచ్చాడు. తిరిగి ఇవ్వమని పలుమార్లు ఫోన్ చేసి అడిగినా ఇవ్వకపోవడంతో ఆదివారం ఆమె ఇంటికి వెళ్లాడు. అక్కడ సమ్మయ్యకు, పవిత్రకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో పవిత్ర, ఆమె తాత సాంబయ్య, నానమ్మ అనసూర్యతో కలిసి సమ్మయ్యను ఇంటి ఎదురుగా ఉన్న సిమెంటు స్తంభానికి కట్టి తీవ్రంగా కొట్టారు. దీంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. రాత్రైనా సమ్మయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి తమ్ముడు నాగరాజు లాలాయిగూడెంలోని మరో బంధువుకు ఫోన్ చేసి చెప్పాడు. అతడు పవిత్ర ఇంటికి వెళ్లి చూడగా కరెంటు స్తంభానికి వేలాడుతున్న సమ్మయ్య మృతదేహాన్ని చూసి నిర్ఘాంతపోయాడు. నాగరాజు ఫిర్యాదుతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

మెట్రో రైలు విస్తరణకు సహకరించండి

- కేంద్ర మంత్రిని కోరిన రాంచందర్ రావు

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎంఎల్.ఖట్టర్‌ను కోరారు. సోమవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రిని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, పార్టీ నేతలతో కలిసి రాంచందర్ రావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్‌తో రేవంత్‌కు అనైతిక బంధం: క్రిశాంక్

తీవ్ర ఆరోపణలు, ఎన్నో కేసులున్న కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ సంస్థకు సీఎం రేవంత్‌రెడ్డికి అనైతిక బంధం కొనసాగుతోందని, అందుకే ఆ సంస్థకు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఒకవైపు ఇన్సాల్వెన్సీ కేసు, మరోవైపు సస్పెండెడ్ డైరెక్టర్‌గా ఉన్న వ్యక్తికి సంబంధించిన సంస్థకు భారీ మొత్తంలో ప్రభుత్వ కాంట్రాక్టులు కట్టబెట్టడం చట్టపరంగా తగదన్నారు. ఆ సంస్థకు వివిధ పనులకు సంబంధించి రూ.1,000 కోట్లకు పైగా సర్కారు కాంట్రాక్టులిచ్చారని.. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల భవనాల నిర్మాణ కాంట్రాక్టును కూడా అదే సంస్థకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఈ సంస్థ రేవంత్‌కు ల్యాండ్‌క్రూజర్ వాహనం బహుమతిగా ఇచ్చిందన్నారు. కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్‌కు ప్రభుత్వం వరుసగా కాంట్రాక్టులు ఇవ్వడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో ప్రజలకు తెలియాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు.

చిన్నారులపై పెరుగుతున్న అఘాయిత్యాలు!

- సగటున రోజుకు ఐదుగురు బాలలపై దారుణాలు
- పాల్పడుతున్న వారిలో 99 శాతం తెలిసినవారే
- పోక్సో, కిడ్నాప్ కేసుల్లో 84 శాతం పెరుగుదల
- ఎన్‌సీఆర్‌బీ నివేదిక ఆధారంగా సీఆర్‌వై విశ్లేషణ

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తెలిసినవారు.. ఏదో ఒక రకంగా పరిచయం ఉన్నవారే బాలలపై దారుణాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున ఐదుగురు చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే చిన్నారులపై లైంగిక వేధింపులు పెరిగినట్లు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదికలో వెల్లడించింది. 2023లో దేశవ్యాప్తంగా నేరాలకు సంబంధించి విడుదల చేసిన ఈ నివేదికలో.. తెలంగాణలో చిన్నారులపై నేరాల గణాంకాలను చైల్డ్ రైట్స్ అండ్ యూ (సీఆర్‌వై) విశ్లేషించింది. 2023లో రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారులపై నేరాలు 6,113 నమోదైనట్లు, 2022తో పోలిస్తే ఇవి 8.1 శాతం పెరిగినట్లు సీఆర్‌వై సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నేరాల్లో 80 శాతానికి పైగా (4,900) లైంగిక వేధింపులకు సంబంధించినవే ఉన్నాయి. పోక్సో, కిడ్నాప్ కేసులు కలిపి 84 శాతం ఉన్నాయి. పైగా, పోక్సో బాధితుల్లో 99.9 శాతం మంది బాలికలే ఉన్నారు. అది కూడా 12-18 ఏళ్ల మధ్య వయస్సు వారే బాధితుల్లో 92 శాతం ఉన్నారు. వీరిలోనూ 16-18 ఏళ్ల బాలికల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. పోక్సో కేసుల్లో 99.8% మంది నిందితులు బాధితులకు తెలిసినవారే ఉండటం గమనార్హం. కాగా, తెలంగాణకు సంబంధించి ఎన్‌సీఆర్‌బీ-2023 వెల్లడించిన నివేదిక ఆందోళన కలిగిస్తోందని సీఆర్‌వై సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్ అన్నారు.

కాంగో గనిలో వంతెన కూలి 32 మంది మృతి

బుకావు, నవంబరు 17: కాంగోలోని ఓ రాగి- కొబాల్ట్ గనిలో వంతెన కూలిపోవడంతో కనీసం 32 మంది మృతి చెందారు. భారీ వర్షాలతో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున గనిలోకి ప్రవేశం నిషేధించినప్పటికీ కొందరు అక్రమంగా మైనింగ్ జరపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ల్యూలాబా ప్రావిన్స్ మంత్రి మయోండే తెలిపారు. గని కార్మికుల సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. గనిలోకి ప్రవేశించిన వారిని హెచ్చరిస్తూ అక్కడున్న కొందరు సైనికులు కాల్పులు జరపడంతో వారు భయాందోళనకు గురై ఒక్కసారిగా వంతెన పైకి పరుగులు తీశారు. వంతెనపై ఒత్తిడి పెరిగి కూలిపోయింది. వాళ్లంతా ఒకరిపై ఒకరు పడిపోవడంతో భారీ ప్రాణనష్టం సంభవించింది. గనిలో సైనికుల మోహరింపు చట్టబద్ధ నిర్వాహకులకు, అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్న వారి మధ్య వివాదానికి కేంద్ర బిందువుగా మారినట్లు ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచంలో అత్యధిక కొబాల్ట్ ఉత్పత్తి చేసే దేశం కాంగో. ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర ఉత్పత్తుల్లో ఉపయోగించే లిథియమ్- అయాన్ బ్యాటరీల తయారీలో ఈ లోహం కీలకం. అయితే ఇక్కడ ఉత్పత్తి అయ్యే 80 శాతానికి పైగా కొబాల్ట్‌ను చైనా కంపెనీలు నియంత్రిస్తున్నాయి. బాలకార్మిక వ్యవస్థ, ప్రమాదకర పరిస్థితులు, అవినీతి ఆరోపణలు కాంగో కొబాల్ట్ గనుల రంగాన్ని ఎన్నోఏళ్లుగా వెంటాడుతున్నాయి. ఖనిజ సంపదతో నిండిన కాంగోలో సైన్యానికి, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న ఘర్షణలతో దశాబ్దాలుగా అశాంతి నెలకొంది. ఇటీవలి కాలంలో ఈ ఘర్షణలు మరింత పెరిగి ఇప్పటికే తీవ్రంగా ఉన్న మానవతా సంక్షోభాన్ని మరింత దుర్భరంగా మార్చాయి.

మెక్సికోలో జన్-జడ్ ఆందోళన

- అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం

మెక్సికో సిటీ, నవంబరు 11: మెక్సికో దేశంలో అవినీతికి వ్యతిరేకంగా యువతరం ఉద్యమించింది. శనివారం మెక్సికోసిటీలో భారీ ప్రదర్శన జరిపింది. జనరేషన్ జడ్ (జన్ జడ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు ప్రతిపక్షాలు, ఇతర వర్గాలు మద్దతు తెలిపాయి. ఆందోళన చాలా వరకు శాంతియుతంగా జరిగినప్పటికీ కొందరు యువకులు పోలీసులపై దాడి చేయడంతో హింసాత్మకంగా ముగిసింది. 100 మంది పోలీసులు సహా 120 మంది గాయపడ్డారు. దాంతో 20 మందిని అరెస్టు చేశారు. 1990-2010 మధ్య జన్మించిన వారినే 'జన్ జడ్'గా వ్యవహరిస్తున్నారు. అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, అసమానతలకు వ్యతిరేకంగా వారు ఉద్యమిస్తున్నారు. అవినీతి, హింసాత్మక సంఘటనలు పెరిగిపోతున్నా బాధ్యులకు శిక్షలు పడకపోవడాన్ని విమర్శిస్తున్నారు. దేశంలో అభద్రత పెరిగిందని, హత్య చేసినా అడిగేవారు లేరని ఉద్యమానికి మద్దతు ఇచ్చిన ఓ మహిళా డాక్టర్ వాపోయారు. మిచోవాకాన్ రాష్ట్రంలో మేయర్ హత్యకు గురికావడం, దుండగుల కాల్పుల్లో పలువురు ప్రముఖులు మరణించడాన్ని ఉద్యమకారులు ప్రస్తావించారు. అవినీతి, శాంతిభద్రతల లేమి ప్రధాన సమస్యలుగా మారాయని చెప్పారు.



ఆయుర్వేదం

చలిలో చక్కని ఆరోగ్యం

చలికాలంలోని చల్లని వాతావరణం జీర్ణశక్తిని బలపరిచినా, వాత పిత్త, దోషాల మధ్య సంతులనానికి సవాలు విసురుతుంది. ఫలితంగా తలెత్తే ఆరోగ్య సమస్యల మీద ఓ కన్నేసి ఉంచి, వాటిని సకాలంలో పరిష్కరించుకుంటూ ఉండాలి.

చలికాలం వాతాన్ని (పొడి, చలి), కఫాన్నీ (భారం, కఫం) పెంచుతుంది. జీర్ణాగ్ని అయిన అగ్ని పోషణకూ, పునరుజ్జీవానికీ చలికాలమే అనువైన సమయం. అయితే పెరిగిన జీర్ణాగ్ని, శక్తిని సక్రమంగా సంతులనం చెందనప్పుడు, కీళ్ల నొప్పులు, సైనస్ సమస్యలు, నిస్సత్తువ రూపాల్లో సంతులనం తలెత్తుతుంది. కాబట్టి మన శరీరం, మనసు సంతులనంగా ఉండడం కోసం ఏడు సూత్రాలను పాటించాలి. అవేంటంటే...

- **ఆహారం:** వేడిగా ఉండే పోషకాహారం తీసుకోవాలి. నెయ్యి జోడించి తినొచ్చు. చిరుధాన్యాలు, సూప్స్, కూరగాయలు తినాలి. చల్లని, చద్ది పదార్థాలకు దూరంగా ఉండాలి. వీటితో వాత, కఫాలు దెబ్బతింటాయి
- **నీళ్లు:** రోజంతా గోరువెచ్చని నీళ్లు తాగుతూ ఉండాలి. వేడి నీళ్లతో జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరం నుంచి విషాలు బయటకు వెళ్లిపోతాయి. చల్లని నీళ్లు అగ్నిని బలహీనపరుస్తాయి కాబట్టి చల్ల నీళ్లకు దూరంగా ఉండాలి
- **శ్వాస:** అనులోమ విలోమ శ్వాస ప్రక్రియలు సాధన చేయాలి. భ్రమరి ప్రాణాయామంతో ఊపిరితిత్తులు బలపడి, నాడీ వ్యవస్థ నెమ్మదిస్తుంది
- **శరీర శోధన:** నూనెతో మర్దన చేసుకునే అభ్యంగ, మూలికలను స్క్రబ్‌గా వాడుకునే ఉద్వర్తనం, ఆవిరి చికిత్స అయిన స్వేదనలతో రక్తప్రసరణ మెరుగ్గా ఉండి శరీరం నుంచి విషాలు బయటకు వెళ్లిపోతాయి
- **మనస్సుద్ధి:** ప్రతి రోజూ ధ్యానం చేయాలి. ప్రశాంతమైన మనసుతో వ్యాధినిరోధకశక్తిని పెరుగుతుంది
- **ఆత్మ పోషణం:** ప్రకృతితో అనుసంధానం కావాలి. ఎండలో గడపడం, ఆధ్యాత్మిక సాధనలు అంతర్గత ప్రశాంతతను, సంతృప్తినీ పెంచుతాయి
- **అభ్యాస:** క్రమశిక్షణతో మెలగాలి. సమయానికి భోజనం, నిద్ర తప్పనిసరి. నిబద్ధతగా నడుచుకోవాలి.

వ్యాధుల బెడద

ఈ కాలంలో వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మరీ ముఖ్యంగా పిల్లలు, పెద్దలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, ఊపిరితిత్తుల సమస్యలున్నవాళ్లు ఈ కాలంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి

- **పెద్దలు:** రక్తప్రసరణ బలహీనంగా ఉండడం వల్ల వీరిలో కీళ్లు బిగుసుకుపోతాయి
- **పిల్లలు:** వ్యాధినిరోధకశక్తి పెరుగుతున్న దశలో ఉండే పిల్లలు సులభంగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు
- **రోగులు:** మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వ్యక్తులు సులభంగా చలి ప్రభావానికి లోనవుతారు
- **ఆస్తమా, సైనస్, ఆర్థ్రయిటిస్:** ఈ కాలంలో ఈ కోవకు చెందినవాళ్ల కఫ, వాత దోషాలు పెరుగుతాయి.

కాబట్టి ఈ కోవలకు చెందిన వాళ్లు గోరువెచ్చని నూనెతో మర్దన చేసుకుంటూ, సమతులాహారం తీసుకుంటూ, సరిపడా విశ్రాంతిలో గడుపుతూ ఉండాలి.

ఈ ఔషధాలు అందుబాటులో...

- **చ్యవనప్రాశం:** వ్యాధినిరోధకశక్తి, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది
- **దశమూలారిష్ట:** దగ్గు, జలుబు, నిస్సత్తువలు తగ్గుతాయి
- **త్రిఫల చూర్ణం:** జీర్ణశక్తి పెరుగుతుంది, విషాలు విరుగుడవుతాయి
- **రస్నాది చూర్ణం:** సైనస్, తలనొప్పులు అదుపులోకొస్తాయి
- **అమృతారిష్టం:** జ్వర నివారిణి
- **అను తైలం** (ముక్కులో వేసుకునే చుక్కల మందు): చల్లగాలితో సోకే ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ దక్కుతుంది

శీతాకాల కషాయాలు

శీతాకాలంలో చోటుచేసుకునే కఫ, వాత దోషాలను హరించే కషాయాలు ఇవే!

- **దశమూల కషాయం:** కీళ్ల నొప్పులు, శ్వాసకోశ సమస్యలు అదుపులోకొస్తాయి
- **త్రికటు కషాయం:** జీర్ణశక్తి, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతాయి
- **కాంతాకారి కషాయం:** ఉబ్బసం, దగ్గు తగ్గుతాయి

మధుమేహం, అధిక రక్తపోటు ఉంటే?

ఈ కాలంలో మధుమేహాలు, అధిక రక్తపోటు కలిగినవారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.



మధుమేహులు ఇలా...

- తీపి పదార్థాలు, నూనెలో వేయించిన పదార్థాలు మానేయాలి
- మెంతులు, ఉసిరి, పసుపు, గుర్మర్ తీసుకోవాలి
- ఎండలో నడవాలి, సరిపడా గోరువెచ్చని నీళ్లు తాగుతూ ఉండాలి

అధిక రక్తపోటు ఉంటే...

- తీవ్రమైన చలికీ, మానసిక ఒత్తిడికీ దూరంగా ఉండాలి
- ప్రాణాయామం సాధన చేయాలి. ప్రత్యేకించి అనులోమ, విలోమ, భ్రమరి సాధన చేయాలి
- అర్జున, అశ్వగంధ, సర్పగంధ, బ్రహ్మి మొదలైన మూలికలు సంతులనాన్ని పెంచుతాయి

ఉబ్బసం, ఊపిరితిత్తుల సమస్యలుంటే?

ఆయుర్వేదం ఈ సమస్యలను.. చల్లదనంతో పెరిగే కఫ, వాత సమస్యలుగా పరిగణిస్తుంది. వీటిని అధిగమించడం కోసం....

- తులసి, వాస లేదా యూకలిప్టస్ ఆకులు వేసి మరిగించి, ఆవిరి పట్టాలి
- అగస్త్య రసయానం, వాసవలేహ, కాంతకారి కషాయాలు ఊపిరితిత్తులను బలపరుస్తాయి
- చల్లదనం, పాల ఉత్పత్తులు, ఫ్రిజ్ ఉత్పత్తులకు దూరంగా ఉండాలి
- ఉదయం నీరెండలో ప్రాణాయామం చేయగలిగితే, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది
- ప్రతి రోజూ ధన్వంతరం తైలంతో అభ్యంగనం చేస్తే, రక్తప్రసరణ, రోగనిరోధకశక్తి పెరుగుతాయి.



డాక్టర్ శ్రీవర్మ
శ్రీవర్మ ఆయుర్వేద, చెన్నై.

మీకు తెలుసా?

లిప్‌స్టిక్‌లో విషాలు



కొన్ని ప్రముఖ లిప్‌స్టిక్స్, లిప్‌గ్లాస్‌ల్లో ఆరోగ్యాన్ని దెబ్బతీసే మోతాదుల్లో విషపూరిత లోహాలు ఉంటున్నట్టు యుసి బెర్క్లీ అధ్యయనంలో వెల్లడైంది.

లిప్‌స్టిక్స్, లిప్‌గ్లాస్‌ల్లో సీసం, క్యాడ్మియం, క్రోమియం, అల్యూమినియం ఇతరత్రా లోహాల అవశేషాలు ఎక్కువ మోతాదుల్లో ఉంటున్నట్టు శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఎంతో అరుదుగా ఈ సౌందర్య సాధనాలను వాడేవారితో పోలిస్తే, తరచూ వీటి మీద ఆధారపడేవారిలో క్యాన్సర్ కారకమైన క్రోమియం, నాడీ వ్యవస్థను దెబ్బతీసే మాంగనీసు ముప్పు ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. వీటికి పదే పదే బహిర్గతమవడం మూలంగా నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు. 24 ప్రముఖ లిప్‌స్టిక్స్‌లో సీసం, నిర్దేశిత మోతాదులకు మించి ఎంతో ఎక్కువగా ఉంటుందనీ, ఈ లిప్‌స్టిక్స్‌ను మరీ ముఖ్యంగా పిల్లలు ఉపయోగించడం వల్ల వారికి ముప్పు కూడా అంతే ఎక్కువగా ఉంటుందనీ శాస్త్రవేత్తలు అంటున్నారు. యూరోపియన్ యూనియన్, ఇలాంటి లిప్‌స్టిక్స్ మీద నిషేధం విధించింది. ఇదే తరహా ప్రమాణాలను ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి తీసుకురావడం మంచిదనీ, లిప్‌స్టిక్ లాంటి సౌందర్య సాధనాలను క్రమబద్ధీకరించవలసిన అవసరం ఉందనీ యుసి బెర్క్లీ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పురోగతి

జీన్ థెరపీతో బరువు తగ్గొచ్చు



శరీరం స్వయంగా జీఎల్‌పి-1 హార్మోన్‌ను ఉత్పత్తి చేసుకునేలా శరీరాన్ని రీప్రోగ్రామ్ చేయగలిగే మార్గాన్ని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ఫ్రాక్టైల్ హెల్త్, రెన్‌బయో అనే రెండు బయెటెక్ స్టార్టప్స్ కణాలను జీఎల్‌పి-1 కర్మాగారాలుగా మార్చే జీన్ థెరపీ విధానాలను పరీక్షిస్తున్నాయి. ఎలుకల్లో ఈ చికిత్స సత్ఫలితాలను అందించి, బరువు తగ్గిస్తోంది. అవి మూడు వారాల వ్యవధిలో శరీరంలో 20% బరువును కోల్పోవడాన్ని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అదే సమయంలో అధిక కొవ్వు ఆహారాన్ని తిన్నప్పటికీ ఆ ఎలుకల్లో రక్తంలో చక్కెర మోతాదులు అదుపులోకొచ్చి, బరువు అదుపులో ఉంటున్నట్టు కూడా శాస్త్రవేత్తలు కనిపెట్టడం జరిగింది. జీఎల్‌పి-1 మందుల ప్రభావాలను, ప్రయోజనాలను కనిపెట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రయోగాల ద్వారా బరువు తగ్గడంతో పాటు, రక్తంలో చక్కెర మోతాదు నియంత్రణ, గుండెకు రక్షణ దక్కడం అనే అంశాల మీద శాస్త్రవేత్తలు దృష్టి పెడుతున్నారు. అయితే జన్యు చికిత్సతో కొన్ని ముప్పులు పొంచి ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వారానికోసారి తీసుకునే ఇంజెక్షన్లతో పోలిస్తే, ఈ చికిత్సలు తిరిగి సరిదిద్దే వీలు కల్పించవనీ, పాంక్రియాస్‌కు దీర్ఘకాలిక ముప్పులు తెచ్చిపెడతాయనీ హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఈ ప్రయోగాలు విజయవంతమైతే, మధుమేహం, ఊబకాయాలకు అందించే చికిత్సల్లో సమూల మార్పులొస్తాయి. ఈ రుగ్మతలకు దీర్ఘకాలిక మందులతో అందించే చికిత్సలకు బదులుగా అంతర్గత హార్మోన్ పునరుత్పత్తి చికిత్సలు అందుబాటులోకొస్తాయి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


తెలుగులోకి రవీనా టాండన్ కుమార్తె



బాలీవుడ్ నటి రవీనా టాండన్ కొన్ని తెలుగు చిత్రాల్లో నటించిన సంగతి విదితమే. ఆమె కుమార్తె రషా ఇప్పుడు హీరోయిన్‌గా తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. 'ఆజాద్' హిందీ చిత్రంతో పరిచయమై 'ఊయి అమ్మా' పాటతో సోషల్ మీడియాను షేక్ చేసిన రషా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. హీరో కృష్ణ మనవడు, దివంగత రమేశ్‌బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా నటిస్తున్న సినిమాలో రషా హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నిర్మాత అశ్వనీదత్ సమర్పణలో పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకుడు. అద్భుతమైన కొండల మధ్య సాగుతూ మనసుకు హత్తుకొనే విధంగా రూపుదిద్దుకొనే ప్రేమకథ ఇది. భావోద్వేగాలు, నిజాయతీ, రియలిజం కలసిన కొత్త తరహా ప్రేమకథ ఇదని అజయ్ భూపతి చెప్పారు. రషా కోసం ఓ అద్భుతమైన పాత్రను ఆయన సృష్టించారు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ మొదలవుతుంది.

ఇఫీలో రజనీకాంత్.. బాలకృష్ణకు సన్మానం





కథానాయకులు రజనీకాంత్, నందమూరి బాలకృష్ణ అరుదైన గౌరవం సాధించారు. 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో వీరికి ఘనంగా సన్మానం జరగనుంది. వారిద్దరూ తమ నట ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఈ ఏడాదితో 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఇఫీ నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ వెల్లడించారు. 'ఈ ఇద్దరు లెజెండ్స్ తమ సినీ ప్రయాణంలో 50 వసంతాలను పూర్తి చేసుకోవడం భారతీయ సినీ చరిత్రలోనే ఓ మైలురాయి లాంటిది. అద్భుతమైన నటనతో, విశేష ప్రజాదరణతో వీరు ప్రేక్షకులకు ఎన్నో మంచి సినిమాలు అందించారు' అని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 28 వరకూ గోవాలో ఈ చిత్రోత్సవం జరగనుంది.

కేఎస్ గోపాలి ఇక లేరు



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్, చిరంజీవి, రాధారవి, నాజర్ సహా అనేక మందికి నటనలో శిక్షణ ఇచ్చిన చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ మాజీ డైరెక్టర్ కేఎస్ నారాయణస్వామి(92) సోమవారం ఉదయం కన్ను మూశారు. ఆయన మద్రాస్ దూరదర్శన్‌లోనూ డైరెక్టర్‌గా పనిచేశారు. నారాయణస్వామి అందరికీ 'కేఎస్ గోపాలి'గానే సుపరిచితులు. రజనీకాంత్‌ను తమిళ దర్శక దిగ్గజం కె.బాలచందర్‌కు పరిచయం చేయడం వల్లే ఆయన 'అపూర్వ రాగంగళ్' సినిమా ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు. చెన్నై (ఆంధ్రజ్యోతి)



భయపెట్టే కథ

ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలసి నిర్మించే సరికొత్త హారర్ చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో సూర్యరాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రధారులు. ఓ గ్రామంలోని మెడికల్ కాలేజీ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందనీ, ఇప్పటివరకూ చూడని ఓ సరికొత్త కథతో చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. త్వరలో షూటింగ్ ప్రారంభించుకునే ఈ చిత్రానికి మాటలు: మోహన్ బి.ఎస్, ఫొటోగ్రఫీ: దినేశ్ దివాకరన్, సంగీతం: వెంకీ జీజీ. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యర్నేని.

మంచి అనుభూతి పొందుతారు



అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి సోమవారం పాత్రికేయులతో మాట్లాడారు. మొదట వేణు మాట్లాడుతూ 'ఖమ్మం, వరంగల్ జిల్లాల మధ్య జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా దర్శకుడు సాయిలు కథ తయారు చేసుకు వచ్చి నాకు వినిపించాడు. ఎన్నో పరువు హత్యల గురించి విన్నాం. కానీ ఇలాంటి దుర్మార్గం ఏ ప్రేమకథ లోనూ లేదు. వాస్తవ సంఘటన నేపథ్యంగా సాగే సినిమా అయినా మెయిన్ స్ట్రీమ్ అప్పీల్ ఉండేలా దర్శకుడు స్క్రిప్ట్ తయారు చేశాడు. సినిమాలో విషాదకరమైన ముగింపు ఉండదు. ఓ మంచి ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వస్తారు' అని చెప్పారు. మరో నిర్మాత రాహుల్ మాట్లాడుతూ 'ఘటన జరిగిన ప్రాంతంలోనే షూటింగ్ చేశాం. హీరోగా నటించిన అఖిల్ వరంగల్ అబ్బాయి. తనకు తెలంగాణ యాస ప్రాబ్లమ్ కాదు. కానీ తేజస్వినీ ఆంధ్రా అమ్మాయి. కానీ తెలంగాణ యాసలో పర్ఫెక్ట్‌గా డైలాగులు చెప్పింది' అన్నారు.



'అఖండ 2: తాండవం' నుంచి నేడు పాట విడుదలవుతున్న సందర్భంగా హీరో బాలకృష్ణ, హీరోయిన్ సంయుక్త స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు.

అనయ అదరగొట్టింది..

- ప్రపంచ రికార్డుతో స్వర్ణం
- ప్రాంజలికి రజతం

బధిర ఒలింపిక్స్ షూటింగ్



న్యూఢిల్లీ: యువ షూటర్ అనయ ప్రసాద్ అదరగొట్టింది. పుట్టిన రోజును మరపురానిదిగా చేసుకుంది. టోక్యోలో జరుగుతున్న బధిర ఒలింపిక్స్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో అనయ ప్రసాద్ ప్రపంచ రికార్డు స్కోరు (241.1 పాయింట్లు)తో పసిడి పతకం కొల్లగొట్టగా, భారత్‌కే చెందిన మరో షూటర్ ప్రాంజలి ప్రశాంత్ ధూమల్ రజతం (236.8 పాయింట్లు)తో మెరిసింది. ప్రాంజలి 572 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పింది. ఇక పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో 18 ఏళ్ల అభినవ్ దేశ్వాల్ 235.2 పాయింట్ల స్కోరుతో రజతం అందుకున్నాడు. అంతకు ముందు అభినవ్ 576 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో ప్రపంచ రికార్డును తన పేరిట నమోదు చేశాడు. కాగా..కొరియా, క్రొయేషియా షూటర్లు స్వర్ణ, కాంస్య పతకాలు గెలుపొందారు.

అర్జున్ తొలి గేమ్ డ్రా

చెస్ వరల్డ్ కప్

పనజీ: ఫిడే చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి క్వార్టర్ ఫైనల్స్ తొలి గేమ్‌ను డ్రాగా ముగించాడు. సోమవారం జరిగిన రౌండ్-8లో చైనా జీఎం వీ యితో మొదటి క్లాసిక్ గేమ్‌లో అర్జున్ పాయింట్ పంచుకున్నాడు. నల్లపావులతో ఆడిన అర్జున్ 31 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించాడు. జవోకిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో జోస్ మార్టినెజ్ (మెక్సికో), సామ్ షెంక్లాండ్ (అమెరికా)తో ఆండ్రీ ఎసిపెంకో కూడా పాయింట్ పంచుకున్నారు. అయితే, అలెగ్జాండర్ డోన్‌చెంకో (జర్మనీ)పై నోదిర్‌బెక్ యకుబోయెవ్ (ఉజ్బెకిస్థాన్) గెలిచి 1-0 ఆధిక్యంలో నిలిచాడు.

గుర్‌ప్రీత్‌కు రజతం

షూటింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్



కైరో: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ గుర్‌ప్రీత్ సింగ్ త్రుటిలో స్వర్ణం చేజార్చుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల 25మీ. సెంటర్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో తను ప్రిసిషన్, ర్యాపిడ్ దశలో మొత్తంగా 584 పాయింట్లు సాధించాడు. అయితే ప్రత్యర్థి పావ్లో కొరోస్ట్‌లో (ఉక్రెయిన్) సైతం అన్నే పాయింట్లు సాధించినప్పటికీ.. ర్యాపిడ్ రౌండ్‌లో 29 సార్లు ఇన్నర్ టెన్‌తో పాటు ఫైనల్ రౌండ్‌లో పర్‌ఫెక్ట్ 100 స్కోరు సాధించాడు. దీంతో గుర్‌ప్రీత్ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఓవరాల్‌గా భారత్ మూడు స్వర్ణాలు, ఆరు రజతాలు, నాలుగు కాంస్యాలతో 13 పతకాలు సాధించి పట్టికలో మూడో స్థానంతో టోర్నీని ముగించింది. చైనా (21), కొరియా (14) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

కమిన్స్‌కే సన్‌రైజర్స్ పగ్గాలు

హైదరాబాద్: ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా పేసర్ ప్యాట్ కమిన్స్ కొనసాగనున్నాడు. వరుసగా మూడో సీజన్‌కు కూడా అతడికే సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్టు సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ నెట్‌లో పోస్టు చేసింది. 2024 వేలంలో కమిన్స్‌ను రూ. 20.50 కోట్లకు కొనుగోలు చేసిన హైదరాబాద్ అతడికే నాయకత్వ బాధ్యతలు అప్పగించింది.

ఒత్తిడికి చిత్తవుతున్నాడా?

వర్క్‌లోడ్‌తో గిల్‌కు ఇబ్బందులు
ఊపందుకొన్న కెప్టెన్సీ విభజన అంశం



ఆ భారాన్ని మోయలేకపోతున్నాడా?

న్యూఢిల్లీ: సీనియర్ ఆటగాళ్లు వీడ్కోలు పలికిన సంధి దశలో.. భారత నవయువ సారథిగా 'ఇన్-ఫామ్' శుభ్‌మన్ గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్‌లో మూడు ఫార్మాట్లలోనూ అతడిని టీమిండియా కెప్టెన్‌గా నియమించాలనేది బీసీసీఐ, టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహం. అయితే, సొంతగడ్డపై తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమితో భారత జట్టుకు దిమ్మతిరిగింది. దీంతోపాటు తొలి ఇన్నింగ్స్‌లో స్పిన్ స్వీప్ ఆడే క్రమంలో గిల్ (4) మెడ పట్టేయడంతో మళ్లీ బరిలోకి దిగలేక పోయాడు. రెగ్యులర్ కెప్టెన్ లేకపోవడంతో మ్యాచ్ ఏ దిశగా సాగుతుందో కూడా అర్థం కాలేదు. అంతిమంగా గెలవాల్సిన టెస్టులో టీమిండియా చతికిలబడడం సగటు అభిమానికి మింగుడు పడడం లేదు. ఈ క్రమంలో 26 ఏళ్ల గిల్‌పై వర్క్‌లోడ్ ఎక్కువైపోయిందన్న చర్చసాగుతోంది. ఆయా ఫార్మాట్లకు తగ్గట్టుగా సారథ్యాన్ని విభజించాలన్న డిమాండ్ ఊపందుకొంది.

యువకుడే కావచ్చు.. కానీ మితిమీరిన పనిభారం శుభ్‌మన్ గిల్ కెరీర్‌ను దెబ్బతీస్తోందని మాజీలు విమర్శిస్తున్నారు. శుభ్‌మన్ సారథ్యంలో హోరాహోరీగా సాగిన ఇంగ్లండ్ టూర్‌లో ఐదు టెస్టుల సిరీస్‌ను భారత 2-2తో సమం చేసింది. నాయకుడిగా గిల్ టెస్టు గేట్ జట్టును ముందుండి నడిపించాడు. ఒకరకంగా విషమ పరీక్ష పాసయ్యాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకొన్నారు. ఆ తర్వాత వెస్టిండీస్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్‌ను 2-0తో గెల్చుకొన్నాడు. పరిమిత ఓవర్ల సిరీస్ కోసం ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లింది. వన్డే సారథిగా శుభ్‌మన్‌కు బాధ్యతలు అందించిన బీసీసీఐ.. టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా నియమించింది. త్వరలో పొట్టి ఫార్మాట్ పగ్గాలు కూడా అతడి చేతిలోకే పెట్టాలనుకుంది. కోచ్ గంభీర్ కూడా గట్టిగా మద్దతు పలుకున్నాడు. అయితే, కీలక టెస్టు సిరీస్‌లో అతడు గాయపడడంతో బీసీసీఐ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో జట్టు భవిష్యత్ కోసం వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు కెప్టెన్లను నియమించడం సరైనదని అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టెస్టుల్లో జట్టును నడిపిస్తుండడంకొన్ని శుభ్‌మన్.. ఒత్తిడికి చిత్తవుతున్నాడని భారత మాజీ ఆటగాడు అభినవ్ ముకుంద్ అన్నాడు. అంతేకాకుండా బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారాల్సిన గిల్ భవిష్యత్‌ను కూడా దృష్టిలో ఉంచుకొని కెప్టెన్సీని విభజించడం ఎంతో తెలివైన పని అని సలహా ఇచ్చాడు.

టర్నింగ్ వికెట్ కావాలా?

రెండో టెస్టు పిచ్‌పై సర్వత్రా ఆసక్తి



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

అనుకున్నదొక్కటి..అయినది ఒక్కటి..అన్నట్టుగా మారింది ఈడెన్ గార్డెన్స్‌లో టీమిండియా పరిస్థితి. తొలి టెస్టు కోసం కోరి మరీ తయారు చేయించుకున్న స్పిన్ పిచ్‌పై ఆడలేక భారత బ్యాటర్లు ప్రత్యర్థి స్పిన్నర్లకు దాసోహమయ్యారు. చేధనలో జట్టు కనీసం వంద పరుగులైనా చేయలేకపోవడం తీవ్రంగా నిరుత్సాహపరిచింది. అసలు టాస్‌కు ముందు ఈ పిచ్ ఎటువైపు టర్న్ అవుతుందో అర్థం కాక టపటపా వికెట్లు సమర్పించుకున్నారు. వాస్తవానికి 124 పరుగుల లక్ష్యం అసాధ్యమేమీ కాదు. గతంలో స్పిన్నర్లపై ఆధిపత్యం చూపడంలో భారత బ్యాటర్ల తర్వాతే ఎవరైనా అనే పేరుండేది. కానీ ప్రస్తుత ఆటగాళ్ల మాత్రం టర్నింగ్ వికెట్‌పై నాణ్యమైన స్పిన్నర్లను ఎదుర్కొనేక బెజారెత్తుతున్నారు. పుజార, రహానె, విరాట్ ఇలాంటి పిచ్‌లపై సుదీర్ఘ సమయం క్రీజులో నిలిచేవారు. నేటితరం బ్యాటర్లు టీ20 మోజులో పడి టెస్టు ఫార్మాట్‌లో ఓపిక, టెక్నిక్‌ను ప్రదర్శించడంలో విఫలమవుతున్నారు. ఈ బలహీనతతోనే గతేడాది న్యూజిలాండ్‌పై భారత జట్టు 0-3తో వైట్‌వాష్ అయింది.

ఏం అడుగుతారో..?

సిరీస్‌లో కీలకంగా మారిన రెండో టెస్టును గువాహటిలోని బర్సపారా స్టేడియంలో ఆడనున్నారు. భారత కెప్టెన్, కోచ్ ఇక్కడ తమకు ఎలాంటి పిచ్ కావాలని కోరుకుంటున్నారో తెలియాల్సివుంది. ఏకోరికి తయారుచేయించుకున్న ఈడెన్ పిచ్‌పై బోల్తాపడిన నేపథ్యంలో గువాహటి పిచ్‌పై ఆసక్తి నెలకొంది. స్వదేశంలో భారత్ నిలకడగా విజయాలు సాధించాలంటే బ్యాటర్లు చెలరేగి 300-400 పరుగులైనా స్కోరుబోర్డుపై ఉంచాలి. కానీ ప్రస్తుత జట్టుకు ఇది అసాధ్యంగా మారుతోంది. నిజానికి బుమ్రా, సిరాజ్ రూపంలో టీమిండియాకు అత్యుత్తమ పేసర్లున్నారు. ప్రత్యర్థిని తక్కువ స్కోరుకు పరిమితం చేయగల సత్తా వీరికుంది. నాలుగో ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్లు తమ తడాఖా చూపగలిగితే పోటీ సమతూకంగా ఉంటుంది. ఈ రీతిన ముందుకెళితే భారత్ స్వదేశంలో సిరీస్ విజయాలు దక్కించుకుంటుంది. ఆసీస్, ఇంగ్లండ్ ఎక్కువగా బ్యాటింగ్ పిచ్‌ల వైపే మొగ్గు చూపుతున్న విషయం గుర్తుంచుకోవాలి. విండీస్‌తో సిరీస్ సందర్భంగా తమ జట్టు టర్నింగ్ వికెట్లపై బాగా కసరత్తు చేసిందని కెప్టెన్ గిల్ చెప్పాడు. కానీ ఈడెన్‌లో మాత్రం కెప్టెన్ మాటలకు వ్యతిరేకంగా జరగడం గమనార్హం.

అతడి స్థానంలో ఎవరు?

మెడ నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ గిల్ ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఆదివారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అతను కోల్‌కతాలోని జట్టు హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడి విషయంలో రిస్క్ తీసుకోవద్దనే ఆలోచనలో బీసీసీఐ ఉంది. దీంతో రెండో టెస్టులో ఆడేది సందేహంగా మారడంతో ఈ స్థానంలో సాయి సుదర్శన్‌లేక దేవ్‌దత్ పడిక్కల్‌లో ఒకరు బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే మాత్రం సాయి సుదర్శన్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ఒకవేళ దేవ్‌దత్‌ను తీసుకుంటే టాప్-5లో రాహుల్ మినహా అంతా లెఫ్ట్ హ్యాండర్లే అవుతారని, అప్పుడు రోజంతా సైమన్ హార్మర్ బౌలింగ్‌కు దిగుతాడేమో అని కామెంట్ చేశాడు. మరోవైపు బుమ్రా, సిరాజ్, షమీలాంటి బౌలర్లను నమ్ముకోవాలని కోచ్ గంభీర్‌కు మాజీ కెప్టెన్ గంగూలీ సూచించాడు.



సాయి సుదర్శన్

కష్టాల్లో హైదరాబాద్

తొలి ఇన్నింగ్స్‌లో 121 ఆలౌట్
జమ్మూ రెండో ఇన్నింగ్స్ 275/4

జమ్మూ: బ్యాటర్లు అదరగొట్టడంతో.. గ్రూప్-డిలో హైదరాబాద్ రంజీ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ పట్టుబిగించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 88/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 121 పరుగులకే కుప్పకూలి ఆలౌటైంది. సునీల్ కుమార్ 5 వికెట్లు పడగొట్టాడు. జమ్మూ తొలి ఇన్నింగ్స్ స్కోరు 170కు హైదరాబాద్ 49 పరుగులు వెనుకబడింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన జమ్మూ 275/4 స్కోరు చేసింది. సోమవారం ఆట ముగిసే సరికి కన్హయ్య వాధ్వాన్ (82), అబ్దుల్ సమద్ (77) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ కమ్రాన్ (50), విర్రాంత్ (45) రాణించారు. రక్షణ్ రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి జమ్మూ 324 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతోంది. కాగా, గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీలో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 224/2 స్కోరు చేసింది.

రాజస్థాన్ రాయల్స్ కోచ్‌గా సంగక్కర



జైపూర్: ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్‌గా మరోసారి కుమార సంగక్కర నియమితుడయ్యాడు. ఈ ఏడాదే రాహుల్ ద్రవిడ్ అతడి స్థానంలో వచ్చినా.. జట్టు వదిలే ఆ పదవి నుంచి వైదొలిగాడు. దీంతో ఆర్ఆర్ తిరిగి సంగక్కర వైపే మొగ్గు చూపింది. తన శిక్షణలో జట్టు 2022లో ఫైనల్‌కు చేరగా, 2024లో ప్లేఆఫ్స్‌లో ఆడింది.

ఒంటరితనం భరించలేకున్నా..

- చనిపోవాలనిపిస్తోంది!
- యువీ తండ్రి యోగ్‌రాజ్ నిర్వేదం



న్యూఢిల్లీ: కుటుంబ సభ్యులెవరూ తోడులేని జీవితాన్ని భరించలేకపోతున్నానని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ వాపోయాడు. ఒంటరి జీవితాన్ని తట్టుకోలేకపోతున్నాని, చనిపోవాలనిపిస్తోందని 62 ఏళ్ల యోగ్‌రాజ్ ఓ ఇంటర్వ్యూలో నిర్వేదం వ్యక్తంజేశాడు. 'సాయంత్రంలో ఒక్కడినే ఉంటున్నా. ఎవరో ఒకరు వచ్చి అన్నం పెట్టి వెళ్తున్నారు. ఆహారం కోసం నే నెవర్నీ ఇబ్బంది పెట్టడంలేదు. నా తల్లిని, పిల్లలను, మనవళ్లను ఎంతో ప్రేమిస్తా. కానీ వారిని ఏదీ అడగను. నా జీవితం పూర్తయ్యింది. చావుకి సిద్ధంగా ఉన్నా. భగవంతుడు అనుకున్నప్పుడు నన్ను తీసుకుపోవచ్చు' అని యోగ్‌రాజ్ అన్నాడు. యోగ్‌రాజ్ తొలుత షబ్నమ్ కౌర్‌ను వివాహమాడాడు. వారికి యువరాజ్, జోరావర్ పుట్టారు. షబ్నమ్‌తో విడాకుల అనంతరం నీనా బుందేల్‌ను పెళ్లి చేసుకున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె జన్మించారు. తానెంతగానో ప్రేమించేవ్యక్తులు తననొంటరి వీడలో అర్థం కావడంలేదని వాపోయాడు.

తెలుగు రాష్ట్రాల్లో ఎలక్ట్రిక్ కార్లకు భలే డిమాండ్

మెర్సిడెస్ ఈవీ విక్రయాల్లో ఏపీ, తెలంగాణ టాప్

- మొత్తం విక్రయాల్లో 10% వాటా
- త్వరలో విశాఖలో కొత్త షోరూమ్
- వచ్చే ఏడాది సీఎల్ఏ ఈవీ కారు విడుదల
- మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ)కు రోజురోజుకు డిమాండ్ పెరిగిపోతోందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా వెల్లడించింది. మెర్సిడెస్ కార్ల విక్రయాల్లో ఈ రెండు రాష్ట్రాలు చాలా కీలకంగా ఉన్నాయని సంస్థ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. టాప్ ఎండ్ లగ్జరీ కార్లు, బీఈవీ విభాగంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మెర్సిడెస్ బెంజ్ అగ్రగామిగా ఉందని ఆయన చెప్పారు. దేశంలో ఏటా 50,000 పైగా లగ్జరీ కార్ల విక్రయాలు నమోదవుతున్నాయని, ఇందులో మెర్సిడెస్ బెంజ్ వాటా 45 శాతంగా ఉందన్నారు. కాగా కంపెనీ లగ్జరీ కార్ల విక్రయాల్లో తెలుగు రాష్ట్రాల వాటా 15 శాతంగా ఉండగా బీఈవీ అమ్మకాల్లో 10 శాతంగా ఉందని ఆయన చెప్పారు. భారత్‌లో మొత్తం ఈవీ విక్రయాల్లో కంపెనీ వాటా నెమ్మదిగా 8 శాతం ఉండగా తెలుగు రాష్ట్రాల్లో అంతకు మించి ఉండటం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ కార్లకు సంబంధించి సానుకూల పన్ను విధానాలు, చార్జింగ్ మౌలిక సదుపాయాలతో పాటు అధికాదాయ వర్గాల (హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్- హెచ్ఎన్ఐ) వారు ఎక్కువగా ఉండటంతో అమ్మకాలు భారీగా ఉంటున్నాయని అయ్యర్ వెల్లడించారు.

హైదరాబాద్‌లో తొలి మేబాక్ లాంజ్: మెర్సిడెస్ బెంజ్ టాప్ ఎండ్ లగ్జరీ కార్లకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ప్రత్యేకంగా మేబాక్ లాంజ్‌ను ఏర్పాటు చేసినట్లు సంతోష్ అయ్యర్ తెలిపారు. ప్రస్తుతం మెర్సిడెస్ బెంజ్‌కు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం కీలక మార్కెట్లుగా ఉన్నాయని, ఇక్కడ మొత్తం 10 సేల్స్, సర్వీస్ పాయింట్లను నిర్వహిస్తున్నట్లు అయ్యర్ తెలిపారు. విస్తరణలో భాగంగా త్వరలోనే విశాఖపట్నంలో

జనవరి త్రైమాసికంలో సీఎల్ఏ ఈవీ

మెర్సిడెస్ బెంజ్ భారత పోర్ట్‌ఫోలియోలో మొత్తం 25 కార్లు ఉండగా అందులో 11 కార్లను స్థానికంగా పుణెలో ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు అయ్యర్ వివరించారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ కార్లను ఇక్కడే తయారు చేస్తున్నట్లు చెప్పారు. కాగా వచ్చే రెండేళ్లలో మెర్సిడెస్ ప్రపంచవ్యాప్తంగా 40 కొత్త మోడళ్లను విడుదల చేయనుండగా అందులో 11 మోడళ్లను భారత్‌లోనే తయారు చేసే ఆవకాశం ఉందన్నారు. మరోవైపు వచ్చే జనవరి త్రైమాసికంలో ఎంట్రీ లెవల్ కారు సీఎల్ఏ విభాగంలో ఎలక్ట్రిక్ కారును భారత మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు. సుమారు రూ.50 నుంచి 60 లక్షల దర ఉండే ఈ కారు ఒకసారి చార్జింగ్‌తో 800 కిలోమీటర్లు దూరం ప్రయాణించనుందన్నారు.

మూడో ఫ్రాంచైజీ భాగస్వామిని నియమించుకుంటున్నట్టు ఆయన చెప్పారు.

ఏటా 20,000 కార్ల తయారీ: మహారాష్ట్ర, పుణె సమీపంలోని చకన్‌లో రూ.3,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన మెర్సిడెస్ ప్లాంట్‌లో ఏటా 20,000 కార్లను ఉత్పత్తి చేస్తున్నట్టు అయ్యర్ తెలిపారు. గత ఏడాది కంపెనీ విక్రయాలు 19,500 యూనిట్ల వరకు ఉన్నాయని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఉంటాయని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. జీఎస్‌టీ 2.0తో అమ్మకాలు ఆశించిన స్థాయిలో పెరగలేదని తెలిపారు. అయితే యూరో మారకంలో రూపాయి బలహీనపడటంతో వచ్చే ఏడాది జనవరి నుంచి ధరలు పెంచాలని నిర్ణయించినట్లు అయ్యర్ వెల్లడించారు.

మురుగప్పా గ్రూప్ మాజీ చైర్మన్ అరుణాచలం కన్నుమూత

న్యూఢిల్లీ: మురుగప్పా గ్రూప్ మాజీ చైర్మన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గౌరవ చైర్మన్ అరుణాచలం వెల్లయన్ (72) మరణించారు. దీర్ఘకాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన సోమవారం ఉదయం కన్నుమూసినట్టు మురుగప్పా గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ భారతదేశంలో ఉన్న అతిపెద్ద వ్యాపార సమూహాల్లో ఒకటైన మురుగప్పా గ్రూప్ ప్రముఖ పారిశ్రామిక సంస్థగా తీర్చిదిద్దడంలో అరుణాచలం కీలక పాత్ర పోషించారు. వివిధ వ్యాపార రంగాల్లో విస్తరించిన మురుగప్పా గ్రూప్‌నకు వ్యూహాత్మక మార్గదర్శనం చేయడంలోనూ ఆయనది కీలక పాత్ర. ఆయన నేతృత్వంలో మురుగప్పా దేశంలోని అత్యంత విశ్వసనీయ పారిశ్రామిక గ్రూపుల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుంది. మురుగప్పా గ్రూప్ కంపెనీలతో పాటు కోరమాండల్ కెమికల్స్, ఎగ్జిమ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ బోర్డుల్లోనూ ఆయన డైరెక్టర్‌గా వ్యవహరించారు.

యాదగిరిగుట్ట వద్ద స్టోన్‌క్రాఫ్ట్ టౌన్‌షిప్

రూ.300 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే రియల్టీ సంస్థ స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ భారీ ప్రాజెక్టు చేపడుతోంది. యాదగిరిగుట్ట వద్ద 110 ఎకరాల్లో రూ.300 కోట్ల పెట్టుబడితో సమగ్ర టెంపుల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేయనున్నట్లు స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ ఎండీ శ్రీ చిలుకూరి చెప్పారు. ఈ టౌన్‌షిప్‌లో 90 ఎకరాల్లో రెసిడెన్షియల్ ప్లాట్లు, మిగతా 20 ఎకరాల్లో సీనియర్ సిటిజన్ల కోసం 333 ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ రెండు వెంచర్ల ద్వారా రూ.1,100 కోట్ల ఆదాయం లభిస్తుందని కంపెనీ ఆశిస్తోంది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,970	1,14,550	1,73,000
విజయవాడ	1,27,000	1,20,000	1,59,000
విశాఖపట్నం	1,26,860	1,14,650	1,73,000
రాజమండ్రి	1,25,400	1,14,950	1,58,000
ప్రొద్దుటూరు	1,24,000	1,14,080	1,59,000
ముంబై	1,22,924	1,12,598	1,54,933

పసిడి దిగుమతులు మూడింతలు



40 % స్విట్జర్లాండ్ నుంచే

- అక్టోబరులో రికార్డు స్థాయికి.. రూ.1.30 లక్షల కోట్లకు చేరిక
- పండగలు, పెళ్లిళ్ల సీజన్ గిరాకీయే ప్రధాన కారణం

న్యూఢిల్లీ: అక్టోబరు నెలలో భారత పసిడి దిగుమతుల విలువ మూడింతలు పెరిగి సరికొత్త రికార్డు స్థాయి 1,472 కోట్ల డాలర్లకు (రూ.1,30,404 కోట్లు) చేరుకున్నాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో బంగారం గిరాకీ భారీగా పుంజుకోవడం ఇందుకు కారణమని గత నెల విదేశీ వాణిజ్య గణాంకాల విడుదల అనంతరం కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అన్నారు. 2024 అక్టోబరులో బంగారం దిగుమతులు 492 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. దేశ మొత్తం దిగుమతుల్లో పసిడి వాటా 5 శాతానికి మించిపోయింది. ప్రపంచంలో చైనా తర్వాత భారత్ రెండో అతిపెద్ద పసిడి వినియోగదారు.

ఏడు నెలల్లో రూ.3.65 లక్షల కోట్ల దిగుమతులు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26).. గడిచిన 7 నెలల్లో (ఏప్రిల్-అక్టోబరు) మొత్తం పసిడి దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 21.44 శాతం పెరుగుదలతో 4,123 కోట్ల డాలర్ల (రూ.3,65,256 కోట్లు)కు చేరాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి దిగుమతులు 3,395 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ధరలు ఆకాశమే హద్దుగా ఎగబాకుతున్న తరుణంలో బంగారం దిగుమతులు ఈ స్థాయిలో పెరగడం విశేషం. ప్రస్తుతం దేశీయంగా తులం బంగారం రూ.1.30 లక్షల చేరువలో ఉంది.

వెండి దిగుమతుల్లో 529 శాతం పెరుగుదల: గత నెలలో వెండి దిగుమతులు ఏకంగా 528.71 శాతం పెరిగి 271 కోట్ల డాలర్ల (రూ.24,007 కోట్లు)గా నమోదయ్యాయి. వెండిని ఆభరణాలు, వంట, పూజ సామగ్రి తయారీతో పాటు ఎలక్ట్రానిక్స్, ఆటో, ఫార్మా వంటి పరిశ్రమల్లోనూ వినియోగిస్తారు.

గతనెల పసిడి దిగుమతుల్లో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే సరఫరా జరిగింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వాటా 16 శాతంగా, దక్షిణాఫ్రికా వాటా 10 శాతంగా ఉంది. గత నెల స్విట్జర్లాండ్ నుంచి దిగుమతులు 403.67 శాతం పెరిగి 508 కోట్ల డాలర్లకు చేరాయి. గడిచిన ఏడు నెల్లలో దీని దిగుమతులు 10 శాతానికి పైగా పెరిగి 1,540 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

అమెరికాకు తగ్గిన భారత ఎగుమతులు

భారత విదేశీ వాణిజ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల గణనీయ ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు మన వస్తు ఎగుమతులు వరుసగా రెండో నెలా తగ్గాయి. గతనెలలో 8.58 శాతం క్షీణించి 630 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.55,811 కోట్లు) పడిపోయాయి. అమెరికా నుంచి దిగుమతులు మాత్రం వార్షిక ప్రాతిపదికన 13.89 శాతం పెరిగి 446 కోట్ల డాలర్లకు (రూ.39,511 కోట్లు) చేరాయి.

డిసెంబరు కల్లా రిఫండ్స్ పూర్తి

సీబీడీటీ చైర్మన్ రవి అగర్వాల్

న్యూఢిల్లీ: సక్రమంగా ఉన్న ఐటీ రిటర్న్‌లపై రిఫండ్స్ చెల్లింపులు ఈ నెలాఖరు లేదా వచ్చే నెలాఖరు కల్లా పూర్తవుతాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ రవి అగర్వాల్ ప్రకటించారు. కొంతమంది రిఫండ్స్ కోసం తప్పుడు డిడక్షన్స్ క్లెయిమ్ చేయడంతో వాటన్నిటిని పరిశీలించి క్లియర్ చేయాల్సి రావడంతోనే ప్రస్తుతం రిఫండ్స్ ఆలస్యమవుతోందన్నారు. ఇప్పటికే ఫైల్ చేసిన రిటర్న్‌ల్లో ఏవైనా విషయాలు మర్చిపోతే సవరించిన రిటర్న్ ఫైల్ చేయాలని కూడా పన్ను చెల్లింపుదారులకు లేఖలు రాసినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి త్వరగా రిఫండ్స్‌లోనూ ప్రతికూల వృద్ధి కనిపిస్తోందని అగర్వాల్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన రూ.25.20 లక్షల కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో 'లోరియల్' జీసీసీ!

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయబోతోంది. ప్రముఖ అంతర్జాతీయ సౌందర్య పోషక ఉత్పత్తుల సంస్థ 'లోరియల్' ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. అయితే కంపెనీ ఈ వార్తను ఇంకా అధికారికంగా ఇంకా ఏదో మెదపడం లేదు. లోరియల్ కంపెనీకి ఇప్పటికే మన దేశంలోని ముంబై, బెంగళూరు నగరాల్లో పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే జీసీసీ ద్వారా భారత్‌ను తన టెక్నాలజీ, నిర్వహణ కార్యకలాపాలకు కేంద్రంగా వాడుకోవాలని ఈ ఫ్రెంచ్ దిగ్గజం భావిస్తోంది.

అజిముత్ ఏఐ-సైయెంట్ నుంచి 'అర్కా-జీకేటీ-1' చిప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫస్ట్ జెనరేషన్ ఇంటెలిజెంట్ పవర్ ప్లాట్‌ఫామ్-ఆన్-ఎ-చిప్‌ను దేశీయంగా అభివృద్ధి చేసినట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సైయెంట్ సెమీకండక్టర్స్, అజిముత్ ఏఐ కంపెనీలు ప్రకటించాయి. 'అర్కా జీకేటీ-1' పేరుతో అభివృద్ధి చేసిన ఈ చిప్ కృత్రిమ మేధ (ఏఐ), స్మార్ట్ ఎనర్జీ అప్లికేషన్స్‌లో బాగా ఉపయోగపడుతుందని తెలిపాయి. దేశంలో ఇలాంటి చిప్‌ను అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారని తెలిపాయి. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ చిప్‌ను ఆవిష్కరించారు.

మళ్లీ 26,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ 388 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభపడ్డాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 425.31 పాయింట్లు ఎగబాకి 84,988.09 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 388.17 పాయింట్ల లాభంతో 84,950.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.40 పాయింట్ల వృద్ధితో 26,013.45 వద్ద ముగిసింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు, కార్పొరేట్ కంపెనీల ఆశాజనక త్రైమాసిక ఫలితాలు ఇందుకు దోహదపడ్డాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కావచ్చన్న అంచనాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలపరిచాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.2 లక్షల కోట్లు పెరిగి రూ.477.14 లక్షల కోట్లకు చేరుకుంది.

రికార్డు గరిష్ఠానికి వాణిజ్య లోటు

ట్రంప్ సుంకాల దెబ్బకు భారత మొత్తం వస్తు ఎగుమతులు కూడా అక్టోబరు నెలలో 11.8 శాతం తగ్గి 3,438 కోట్ల డాలర్లకు (రూ.3,04,572 కోట్లు) తగ్గాయి. పసిడి, వెండితో పాటు పత్తి, ఎరువులు, సల్ఫర్ దిగుమతులు అనూహ్యంగా పెరగడంతో మొత్తం దిగుమతులు కూడా 16.63 శాతం ఎగబాకి 7,606 కోట్ల డాలర్ల (రూ.6,73,815 కోట్లు) చేరాయి. దీంతో గత నెల వాణిజ్య లోటు (ఎగుమతి ఆదాయం, దిగుమతి వ్యయానికి మధ్య వ్యత్యాసం) రికార్డు గరిష్ఠ స్థాయి 4,168 కోట్ల డాలర్ల (రూ.3,69,243 కోట్లు)కు పెరిగింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరుతో ముగిసిన 7 నెలల్లో భారత ఎగుమతులు కేవలం 0.63 శాతం వృద్ధితో 25,425 కోట్ల డాలర్లు, దిగుమతులు 6.37 శాతం పెరుగుదలతో 45,108 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. దాంతో వాణిజ్య లోటు 19,682 కోట్ల డాలర్లకు పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (100 గుడ్లు)

18వ తేదీ



హైదరాబాద్	620	విజయవాడ	640
వరంగల్	622	గోదావరి	625
చిత్తూరు	663	విశాఖపట్నం	610
		దజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెంకాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	120
కర్నూలు	117	నెల్లూరు	125
విశాఖపట్నం	110	అనంతపురం	125
గోదావరి	111		

ప్రీ-స్కూల్ పిల్లలకు పాల పంపిణీ

» ములుగులో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన మంత్రి సీతక్క

హైదరాబాద్/ ములుగు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పౌష్టికాహార లోపం నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్ల మధ్య వయస్సు గల చిన్నారులకు ఏడాదిలో 200 రోజుల పాటు రోజూ 100 మి.లీ 'విజయా డెయిరీ' పాలు పంపిణీ చేయడానికి స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు లీటర్ 'విజయా డెయిరీ డబుల్ టోన్డ్ యూహెచ్‌టీ టెట్రా' ప్యాకెట్లను పంపిణీ చేస్తారు. ఆ పాలను వేడి చేసి పంచదార/బెల్లం కలిపి గోరు వెచ్చగా పిల్లలకు అందించాల్సి ఉంటుంది. ములుగు జిల్లా కేంద్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న ఈ పథకంపై క్షేత్రస్థాయి ఉద్యోగులు, పిల్లల తల్లి దండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించాలని శ్రుతి ఓఝా ఆదేశించారు. కాగా, అంగన్ వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని మంత్రి సీతక్క చెప్పారు. ములుగులోని కృష్ణ కాలనీ ప్రీ-స్కూల్ పిల్లలకు పాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభిస్తూ..అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి పలు నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకొచ్చే చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకోవాలని టీచర్లకు హితవు చెప్పారు.

డిసెంబరు 14న కొమురవెల్లి మల్లన్న కల్యాణం

» జనవరి 18 నుంచి మార్చి 16 వరకు జాతర

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న కల్యాణం డిసెంబరు 14న నిర్వహించనున్నారు. అలాగే, మల్లన్న జాతర 2026 జనవరి 18 నుంచి పది వారాల పాటు అంటే మార్చి 16 వరకు ప్రతి ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా కల్యాణం, జాతరలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా అధికారులతో సోమవారం ఆన్‌లైన్‌లో సమీక్ష నిర్వహించిన మంత్రి సురేఖ... జాతరకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డిజిటల్ విశ్వవిద్యాలయంగా అంబేడ్కర్ వర్సిటీ!

» నేడు సీఎం సమక్షంలో సీవోఎల్‌తో వర్సిటీ ఒప్పందం

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ (ఐడీఈఏ) ఏర్పాటుకు కెనడా కేంద్రంగా ఉన్న కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సీవోఎల్)తో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈమేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సీవోఎల్ అధ్యక్షుడు, సీఈవో ప్రొఫెసర్ పీటర్ స్కాట్‌లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం ఒప్పందంపై సంతకాలు చేయనున్నారు. సీవోఎల్ మద్దతులో భారతదేశ డిజిటల్ విద్యా ఉద్యమానికి నాయకత్వం వహించడానికి అంబేడ్కర్ వర్సిటీ సిద్ధమవుతోందని ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా సాంకేతికత ఆధారిత విద్యను అభివృద్ధి చేయడంలో దశాబ్దాల అనుభవం ఉన్న ప్రొఫెసర్ స్కాట్.. అంబేడ్కర్ వర్సిటీలో జరిగే సమావేశంలో కీలకోపన్యాసం చేయనున్నారు.

బీవోవో విధానంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ

» మహేశ్వరం, చౌటుప్పల్‌లో రెండు ప్లాంట్ల నిర్మాణం

» రాష్ట్ర ప్రభుత్వం అనుమతి.. త్వరలో గ్లోబల్ టెండర్లు

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1500 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తును అందించే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్(బీఈఎస్ఎస్) ప్రాజెక్టును బిల్ట్(నిర్మించి)..ఓన్(సొంతంగా)..ఆపరేట్(నిర్వహించుకునే) విధానంలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ సోమవారం జీవో జారీ చేశారు. ఇందులో భాగంగా మహేశ్వరం, చౌటుప్పల్‌లోని 440/220 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద ఒక్కోటి 750 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యం కలిగిన బీఈఎస్ఎస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్తుకు డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో తక్కువ ధరకు కరెంటును కొనుగోలు చేసి, విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో సరఫరా చేయడం కోసం వీటిని నిర్మించనున్నారు. మరోవైపు, హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో ట్రాన్స్‌కోకు 440/220 కేవీ సామర్థ్యం కలిగిన సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌కు వద్ద ట్రాన్స్‌కోకు వందలాది ఎకరాల భూములున్నాయి. ఈ భూముల్లో 250 మెగావాట్ల బీఎస్ఎస్ ప్లాంట్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. డిమాండ్ లేని సమయంలో ఓపెన్ యాక్సెస్ నుంచి కరెంట్ కొని, డిమాండ్ ఉన్న సమయంలో కరెంట్‌ను విక్రయించేలా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి 700 ఎకరాల భూమి అవసరమని అంచనా. ఈ ప్లాంట్ నుంచి రూ.2.90లకే యూనిట్ కరెంట్ లభిస్తుందని అధికారులు చెప్తున్నారు.

మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

» ఉప ఎన్నికతో ఓ పార్టీ నాలుగు ముక్కలైంది: కోమటిరెడ్డి

» కార్యకర్తల కృషితోనే ప్రజాప్రభుత్వం ఏర్పాటు: ఉత్తమ్

మిర్యాలగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో పదిహేనేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతు తమకే ఉందని.. జూబ్లీహిల్స్‌లో ఘన విజయం సాధించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఉపఎన్నికతో ఓ పార్టీ నాలుగు ముక్కలైందన్నారు. తండ్రి, కుమార్తె, కుమారుడు, అల్లుడు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు. మరో పార్టీ డిపాజిట్ కోల్పోయి జనంలో కనపడకుండా పోయిందన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్‌లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ (ఎండీఆర్)ప్లాన్ కింద రూ.74 కోట్లతో నిర్మించ తలపెట్టిన నాలుగు లైన్ల అవంతిపురం-శెట్టిపాలెం రోడ్డుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం సభలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. చరిత్రలో ఎప్పుడూ లేనంతగా రాష్ట్రంలో రూ.60వేల కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. రూ.10,410కోట్లతో హైదరాబాద్- విజయవాడ రహదారిని 6 లైన్ల రోడ్డుగా విస్తరించే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కృషితోనే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆరోగ్యశాఖలో కొలువుల పండగ

» ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికైన వారి జాబితా విడుదల

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్లు, వైద్య సిబ్బందితో ప్రభుత్వ ఆస్పత్రులు కళకళలాడుతున్నాయని.. రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ (గ్రేడ్-2) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆయన సోమవారం సచివాలయంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. కొలువులు పొందిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని 1,284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి గతేడాది చివరిలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయగా.. 24,045 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 23,323 మంది బోర్డు నిర్వహించిన పరీక్షకు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) హాజరయ్యారు. వీరిలో ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధం చేసింది. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 7 వేలకుపైగా కొలువుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. వైద్య సేవలు మెరుగయ్యేందుకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటున్నామని తెలిపారు.

డిస్కమ్‌లకు రూ.62.51 కోట్ల వరద సాయం

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వరదలతో దెబ్బతిన్న నెట్‌వర్క్ పునరుద్ధరణకు డిస్కమ్‌లకు సాయం కింద రూ.62.51 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో ఉత్తర డిస్కమ్(టీజీఎన్పీడీసీఎల్-వరంగల్)కు రూ.34.78 కోట్లు, దక్షిణ డిస్కమ్(టీజీఎస్పీడీసీఎల్-హైదరాబాద్)కు రూ.27.73 కోట్లను విడుదల చేస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ జీవో జారీ చేశారు. ఈ నిధులను స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్(ఎస్‌డీఆర్ఎఫ్)కింద విడుదల చేశారు.

ఎన్నికలు.. తొలుత పంచాయతీలకు

(మొదటిపేజీ తరువాయి)

సీట్లు కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. గ్రామాల్లో పాలన వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతున్న నేపథ్యంలో వీలైనంత తొందరగా పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకుందన్నారు. 15వ ఆర్థిక సంఘం కాలపరిమితి 2026 మార్చి 31తో ముగియనుందని, ఆలోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయకపోతే గ్రామాలకు రావాల్సిన నిధులు దాదాపు రూ.3 వేల కోట్లు రాకుండా పోతాయని అన్నారు. అందుకే ఈ డిసెంబరులోనే ఎన్నికలు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం అధికారులను ఆదేశించిందన్నారు. ఇప్పటికే హైకోర్టు ఇచ్చిన తీర్పు, అన్ని వర్గాల రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు సూచనల మేరకు ఎన్నికలకు వెళ్లాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చంటూ సిఫారసు చేసిందని, దాని ఆధారంగానే ఎన్నికల ప్రక్రియ కూడా మొదలైందని తెలిపారు. అయితే కోర్టు కేసులతో ఈ ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయిందన్నారు. ఇప్పుడు ఎన్నికలకు వెళ్లాలంటే 50 శాతం మించకుండా రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుందని, అందుకే మరోసారి డెడికేటెడ్ కమిషన్ నుంచి వివరాలు తెప్పించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్ల సంఖ్యపై డెడికేటెడ్ కమిషన్ నుంచి నివేదిక కోరాలని క్యాబినెట్ తీర్మానం చేసిందన్నారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి, క్యాబినెట్ ఆమోదం పొందాలని సూచించిందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు.

గిగ్ వర్కర్ల బిల్లుకు ఆమోదం..

రాష్ట్రంలోని గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్-2025 బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్రంలో దాదాపు 4 లక్షల మంది గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ బేస్డ్ వర్కర్లు ఉన్నారు. మొబిలిటీ, ఫుడ్ డెలివరీ బాయ్స్, ఈ-కామర్స్ లాజిస్టిక్స్ తదితర రంగాల్లో గిగ్ వర్కర్లు, ఇళ్లలో పనివాళ్లు కలిపి తెలంగాణలో సుమారు 4 లక్షల మంది పని చేస్తున్నారు. వీరికి ఎలాంటి సెలవులు లేకపోగా రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేయాల్సి వస్తోంది. ఈ గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం, వేతనాల చెల్లింపుల విషయంలో స్పష్టమైన విధానాలు లేవు. గిగ్ వర్కర్ల సంక్షేమం, భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని ఎన్నికల మేనిఫెస్టోలోనే కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. వారితో పలుమార్లు సంప్రదింపులు జరిపి గిగ్ వర్కర్ల సంక్షేమానికి ఈ బిల్లును తీసుకొచ్చింది. త్వరలోనే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి, చట్టం రూపంలో తెస్తామని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. కొత్త చట్టం ద్వారా గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభిస్తాయి. వీరందరి సంక్షేమానికి ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేసి హక్కులకు రక్షణ కల్పిస్తుంది. గిగ్ వర్కర్లు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. వారికి చట్టబద్ధంగా లభించాల్సిన అన్ని అంశాలకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.



క్యాబినెట్ భేటీ ఇతర నిర్ణయాలు

- ఎస్సారెస్పీ ఫేజ్-2 మెయిన్ కెనాల్‌కు మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న ఇండస్ట్రియల్ ల్యాండ్‌ను మల్టీ యూజ్ జోన్స్‌గా మార్చేందుకు రూపొందించిన 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ(హెచ్ఐఎల్‌టీపీ)'ని క్యాబినెట్ ఆమోదించింది.
- ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను నిర్వహించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను గ్లోబల్ సమ్మిట్ వేదికగా 8న ప్రజలకు వివరించే కార్యక్రమాలు ఉంటాయి. 9న 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని క్యాబినెట్ నిర్ణయించింది.

ప్రతి పాఠ్యపుస్తకంలో 'జయజయహే తెలంగాణ' గీతం

అందెశ్రీ రచించిన రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను ప్రతి పాఠ్యపుస్తకంలో మొదటి పేజీలో ప్రచురించాలని క్యాబినెట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. అందెశ్రీ ఇటీవలే కానరాని లోకాలకు వెళ్లారని, ఆ కుటుంబానికి ఈ రాష్ట్రం, ప్రభుత్వం, ప్రజలు రుణపడి ఉన్నారని చెప్పారు. అందుకే అందెశ్రీ కుమారుడు దత్తసాయికి డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా.. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాత్రను భావి తరాలకు తెలియజేసేలా రాష్ట్రంలో అందెశ్రీ స్మృతివనం ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు.

ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్నా.. పోటీ చేయొచ్చు

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగిన వారు కూడా పోటీ చేయవచ్చు. ఇందుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగిన వ్యక్తులు పంచాయతీ రాజ్ సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా పేర్కొంటూ ఉమ్మడి రాష్ట్రంలో చేసిన చట్టం 1995 మే 31 నుంచి అమల్లో ఉంది. అయితే ఈ నిబంధనను ఎత్తేయాలని అక్టోబరులో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం-2018, పురపాలక చట్టం-2019లను సవరిస్తూ ఆర్డినెన్స్ ద్వారా గవర్నర్ ఆమోదం పొందాలని ఇందులో నిర్ణయించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, నగరపాలక, పురపాలక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతిస్తూ రూపొందించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇటీవలే ఆమోదం తెలిపారు. దీని ఆధారంగా ప్రభుత్వం తాజాగా గెజిట్ విడుదల చేసింది.





పంటల కొనుగోళ్లకు కేంద్రం కొర్రీలు

» పత్తి రైతుకు భారంగా కేంద్రం రూల్స్

» 25 శాతం కొనుగోళ్లకు ఇన్ని నిబంధనలా: మంత్రి తుమ్మల

» దళారులకు అమ్ముకోవద్దు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్/ న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధరపై 25% పంట కొనుగోళ్లకు కేంద్రం నిబంధనలతో అన్నదాతలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోళ్లలో నెలకొన్న సమస్యలు, జిన్నింగ్ మిల్లుల సమ్మె నేపథ్యంలో తలెత్తిన పరిస్థితిపై కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి, రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తుమ్మల మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరపై 25% పంట కొనుగోళ్ల నిబంధనను ఎత్తివేయాలని పలుమార్లు కోరినా పత్తి కొనుగోళ్లపై కఠిన నిబంధనలను అమలు చేయడం ఆందోళనకరమన్నారు. జిల్లాల వారీగా పత్తి దిగుబడి వివరాలను పంపినా తొలుత ఎకరాకు 11 క్వింటాళ్లు.. తర్వాత 7 క్వింటాళ్లకు పరిమితి విధించడం రైతులను అయోమయానికి గురి చేసిందన్నారు. తేమ శాతం సడలించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని ఆయన చెప్పారు. కేంద్రం తెచ్చిన ఎల్-1, ఎల్-2 విభజన నిబంధనలతో ఎక్కువ జిన్నింగ్ మిల్లులు తెరవలేదన్న తుమ్మల.. ఇప్పటి వరకు కేవలం 243 మిల్లులే రైతులకు కేటాయించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే పత్తి కొనుగోళ్ల ప్రారంభించాలని జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షుడు రవీందర్ రెడ్డిని కోరినట్లు చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లపై ఆందోళన చెందొద్దని రైతులను కోరారు. మార్చి వరకూ కొనుగోళ్లు సాగుతాయని, తేమశాతం ఎక్కువగా ఉంటే ఎండబెట్టి మిల్లులకు తీసుకెళ్లాలే తప్ప.. తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవద్దన్నారు. రాష్ట్రంలో 200కి పైగా కేంద్రాల్లో పత్తి కొనుగోలు జరుగుతుందన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు జిన్నింగ్ మిల్లుల సంఘం సమ్మెను విరమించేందుకు అంగీకరించిందని తెలిపారు.



ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో ఆక్రమణల తొలగింపు

గచ్చిబౌలిలో సంధ్య కన్వెన్షన్ ఆక్రమణల తొలగింపు

హైకోర్టు ఆదేశాలతో హైడ్రా చర్యలు

గతంలోనే తొలగించినా మళ్లీ ఆక్రమణ!

కూల్చివేతలపై కోర్టు ధిక్కరణ పిటిషన్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ/గచ్చిబౌలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గచ్చిబౌలిలోని ఓ లే అవుట్‌లో రోడ్లు, ప్రజావసర స్థలాల ఆక్రమణలను హైడ్రా తొలగించింది. గచ్చిబౌలి ప్రధాన రహదారి పక్కన ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన లే అవుట్ ఉంది. అందులోని పార్కులు, రహదారులను ఆక్రమిస్తూ పక్కనున్న సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు నిర్మాణాలు చేపట్టారని లే అవుట్‌లోని ప్లాట్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. శ్రీధర్‌రావు ఆక్రమణలకు సంబంధించి గతంలోనే హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా.. పరిశీలించిన హైడ్రా అధికారులు.. లేఅవుట్ కబ్జా చేసి పలు నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించి తొలగించారని ప్లాట్ల యజమానులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన న్యాయస్థానం వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సోమవారం హైడ్రా బృందాలు రంగంలోకి దిగి లే అవుట్‌లోని ఏడుచోట్ల రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేశాయి. రోడ్ల హద్దులు నిర్ధారించి వాటిని పునరుద్ధరించారు. కాగా ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) లేఅవుట్‌లో సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుండడంపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. కూల్చివేతలు చేపట్టరాదని ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశామని.. సదరు పిటిషన్‌లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా కూల్చివేతలు చేపడుతున్నారని పేర్కొంటూ సంధ్య హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. కూల్చివేతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని.. వాటిని అడ్డుకోవాలని పేర్కొంటూ సంధ్య హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం అత్యవసరంగా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎ. సత్యశ్రీ వాదిస్తూ.. జూన్ 6న ఇదే హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా హైడ్రా కూల్చివేతలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. హైడ్రా తరఫున న్యాయవాది కౌటూరి పవన్ వాదిస్తూ.. ఈ కేసులో అదనపు అడ్వకేట్ జనరల్ హాజరవుతారని, ఒక రోజు సమయం ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

10 రోజుల్లో పంచాయతీ నోటిఫికేషన్


డిసెంబరు 15 కల్లా ఎన్నికల ప్రక్రియ పూర్తి!.. బీసీలకు పార్టీపరంగా 42% రిజర్వేషన్ ఇచ్చేద్దాం

» కనిష్ఠంగా 42.. గరిష్ఠంగా 60 % ఇద్దాం

» క్యాబినెట్ భేటీలో సీఎం ప్రతిపాదన

» అంగీకారం తెలిపిన మంత్రులు

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు సర్కారు సిద్ధమవుతోంది. పది రోజుల్లోనే నోటిఫికేషన్ రానుంది. తొలుత గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించడంతో ఆ మేరకు కసరత్తు ప్రారంభమైంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 23 శాతం బీసీ రిజర్వేషన్, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి లోపు ఉండేలా.. గ్రామాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రత్యేక కమిషన్‌ను ప్రభుత్వం కోరనుంది. ఈ కమిషన్ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి వారం రోజులు పడుతుందని అంచనా వేస్తున్నారు. రిజర్వేషన్ల జాబితా అందిన రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అంటే పది రోజుల్లో గ్రామాల్లో ఓట్ల పండగ ప్రారంభం కానుందన్నమాట. ఈ ఎన్నికలు పార్టీ రహితం అయినప్పటికీ.. పార్టీ తరఫున సర్పంచ్, వార్డు అభ్యర్థులుగా పోటీ చేసే వారిలో కనీసం 42% మంది బీసీలు ఉండాలని, గరిష్ఠంగా 60 శాతం వరకు అవకాశం ఇద్దామని సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులకు సూచించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ ఎన్నికలు నిర్వహించకుంటే ఆర్థిక సంఘం నిధులు రూ.3 వేల కోట్లు మురిగిపోనున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 15 కల్లా పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి నిధుల కోసం ఆర్థిక సంఘానికి ప్రతిపాదన పంపుదామని తెలిపారు. పరిషత్, మునిసిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం శక్తివంచన లేకుండా కృషి చేద్దామని అన్నారు. స్థానిక ఎన్నికలపై ఈ నెల 24న హైకోర్టు స్పందనను బట్టి.. వచ్చే క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. గెలుపు ప్రాతిపదికనే సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. ఈ అంశాలపై రేవంత్ మంత్రులందరి అభిప్రాయాలనూ తెలుసుకున్నారు. రూ.3 వేల కోట్ల నిధులతో ముడిపడిన అంశం కావడంతో అందరూ సీఎం ప్రతిపాదనలకు అంగీకారం తెలిపారు. దీంతో పాత రిజర్వేషన్ ప్రకారమే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. డిసెంబరు 8, 9 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించి ప్రజాభవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. అలాగే డిసెంబరు మొదటి వారంలో నిర్వహించే ప్రజాపాలనా విజయోత్సవాల నిర్వహణపైనా సమీక్ష జరిపారు. తదుపరి క్యాబినెట్ సమావేశం ఈ నెల 29న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సమగ్ర విద్యుత్తు విధానంపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు.



జూబ్లీహిల్స్ విజయం స్ఫూర్తితో ముందుకు..

మంత్రివర్గ సమావేశం అనంతరం.. అధికారులను పంపేసి మంత్రులు విడిగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంపై చర్చించారు. ఈ గెలుపుతో ప్రభుత్వ పనితీరుకు ప్రజామోదం లభించినట్లయిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో పార్టీకి, ప్రభుత్వానికి పట్టు పెరుగుతోందని.. ముస్లింలు, బీసీలు, సెటిలర్ల రూపంలో పార్టీకి బలమైన ఓటుబ్యాంకూ ఏర్పడిందని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ విజయం సాధించగలమన్న ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికలో మంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు చక్కటి పనితీరు కనబరిచారని సీఎం అభిప్రాయపడ్డారు.

విచారణ పేరుతో చితకబాదిన పోలీసులు

» యువకుడికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

» ఎస్సైపై చర్యలు తీసుకోవాలని సీఐకి కుటుంబసభ్యుల ఫిర్యాదు

పెద్దేముల్, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): హత్యకేసు విచారణ పేరుతో పోలీసులు ఓ యువకుడిని స్టేషన్‌కు పిలిపించుకుని చితకబాదారు. తీవ్ర అస్వస్థతకు గురైన యువకుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. మంబాపూర్ గ్రామానికి చెందిన ఎండీ గౌస్ రెండు నెలల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు విచారణ పేరుతో మృతుడు గౌస్ మేనల్లుడు ఫెరోజ్‌ను ఎస్సై వేణుకుమార్, పలువురు కానిస్టేబుళ్లు ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చితకబాదారు. నడవలేని స్థితిలో ఉన్న ఫెరోజ్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. గౌస్‌కు ముగ్గురు కూతుళ్లు. మేనల్లుడు ఫెరోజ్‌ను పెంచి పెద్దచేసి, తన రెండో కూతురును ఇచ్చి పెళ్లి చేశాడు. ఆమె ఒక బిడ్డకు జన్మనిచ్చి రెండో కాన్పులో కన్నుమూసింది. దీంతో మూడవ కూతురును కూడా ఫెరోజ్‌కు ఇచ్చి పెళ్లి చేశాడు. ఫెరోజ్ స్థానికంగా ఓ వెల్డింగ్‌షాప్ పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన మేనమామ తనను సొంత కొడుకులా చూసుకునేవాడని, తండ్రిలాంటి మామను ఎలా హత్యచేస్తానని అతడు బోరుమంటున్నాడు. తన మామను తనే హత్యచేసినట్లు ఒప్పుకోవాలని పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని చెప్పాడు. విషయం తెలిసి బంధువులు, స్నేహితులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన అల్లుడిని చిత్రహింసలకు గురిచేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని బాధితుడి అత్త, మృతుడి భార్య నజీమాబేగం స్వయంగా సీఐకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన భర్త చావుకు తన అల్లుడిని బాధ్యుడిని చేస్తూ పోలీసులు బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారని, అంతేకాకుండా తన అల్లుడితో తనకు అక్రమ సంబంధం అంటగడుతున్నారని తెలిపారు. తనతో కలిసి తన కూతురు, అల్లుడు తన భర్తను హత్యచేసినట్లు ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తన భర్త ఎలా చనిపోయారో తనకు చెప్పడం లేదని, రిపోర్టులు కూడా బయటపెట్టడం లేదని చెప్పారు. కేసును తప్పుదారి పట్టించి పోలీసులు హంతకులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సై వేణుకుమార్‌తో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని కోరుతూ సీఐ నగేశ్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

జిన్నింగ్ మిల్లుల బంద్

రాష్ట్రంలో నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లు

వరంగల్ వ్యవసాయం, భైంసా, జమ్మికుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదిహేనురోజులుగా రైతులు, కార్మికులు, వ్యాపారులు, సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా కళకళలాడిన జిన్నింగ్ మిల్లులు కొనుగోళ్లు లేక ఒక్కసారిగా బోసిపోయాయి. కాటన్ మిల్లులు, జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ల నిరవధిక సమ్మె ఫలితమే ఇది. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పరంగా విధించిన ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనను ఎత్తివేయాలని, కిసాన్ కపాస్ యాప్‌ను తొలగించాలని, కొనుగోళ్ల పరంగా ఎకరా పరిమితిని 7 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లకు పెంచాలంటూ జిన్నింగ్ మిల్లుల యజమానులు సోమవారం నుంచి నిరవధిక సమ్మె బాట పట్టాయి. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు మూతబడి కొనుగోళ్ల ప్రక్రియ నిలిచిపోయింది. మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలంటూ గత నెలరోజులుగా సీసీఐని కోరుతున్నామని కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్ రెడ్డి వెల్లడించారు. సమస్యను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఫలితంగా తమ సమస్యలు పరిష్కరించేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 322 మిల్లులు, వ్యవసాయ మార్కెట్లలో సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లను నిలిపివేయాలని పిలుపునిచ్చామన్నారు. సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టినప్పుడు నోటీఫై చేసిన అన్ని మిల్లులను నడపాలని మంత్రి సమక్షంలోనే కోరామని, అప్పుడు సానుకూలంగా స్పందించిన మంత్రి, ఆ తర్వాత కొన్ని మిల్లులకే పత్తి కొనుగోళ్లకు అనుమతి ఇవ్వడంతో సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. మరికొన్ని మిల్లులకు పనిలేకపోవడంతో అక్కడి నుంచి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు వెళ్లిపోతున్నారని, మిల్లుల నడపకపోతే యజమానులు నష్టాలబారిన పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

45 మంది సజీవదహనం

కేంద్రం ఆధ్వర్యంలో

ప్రత్యేక హెల్ప్‌లైన్

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌రూమ్

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీ బస్సు ప్రమాద ఘటనపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. ఇప్పటికే సౌదీ ప్రభుత్వంతో కేంద్ర హోం, విదేశాంగ శాఖ అధికారులు సంప్రదింపులు ప్రారంభించారు. బాధిత కుటుంబాలకు సమాచారం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది. సౌదీలోని భారత దౌత్య కార్యాలయం నుంచి బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేలా ఆదేశాలు జారీ చేసింది. సౌదీలోని భారత కాన్సులేట్ ఉన్నతాధికారులు సైతం అప్రమత్తమయ్యారు. జెడ్డాలో ఉన్న కాన్సులేట్ జనరల్.. రియాద్‌లోని డిప్యూటీ అంబాసిడర్‌తో మాట్లాడారు. విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పూర్తి వివరాలు అందజేయాలని ఢిల్లీలో ఉన్న రెసిడెంట్ కమిషనర్‌ను, కో ఆర్డినేషన్ సెక్రటరీని ఆదేశించారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మృతుల వివరాలను పక్కాగా సేకరించాలని రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయల్ సూచించారు. అధికారులతో అత్యవసరంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, సౌదీ అధికారులతో నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని ఆదేశించారు.

కేంద్ర హెల్ప్‌లైన్ నంబర్లు
80024 40003
012 2614093
012 6614276
0556122301

తెలంగాణ భవన్‌లోని కంట్రోల్ రూమ్ నంబర్లు
లైజన్ హెడ్ వందన
98719 99044
పౌర సమాచార అధికారి సీహెచ్ చక్రవర్తి
99583 22143
లైజన్ ఆఫీసర్ రక్షిత్ నాయక్
96437 23157

(మొదటిపేజీ తరువాయి)

ఈ నెల 9న హైదరాబాద్ నుంచి జెడ్డాకు వెళ్లింది. ఈ నెల 23 వరకు వివిధ ప్రాంతాలను సందర్శించుకునే విధంగా వారు పర్యటనను రూపొందించుకున్నారు. ఆదివారం మక్కా యాత్రను ముగించుకున్న తర్వాత 46 మంది మదీనాకు బస్సులో బయలుదేరారు. మిగతా 8 మందిలో నలుగురు మక్కాలోనే ఉండగా.. మరో నలుగురు మదీనాకు కారులో వెళ్లారు. అయితే యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సు.. మదీనాకు 25 కిలోమీటర్ల దూరంలోని ముఫ్రిహాత్ వద్ద డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి 45 మంది కాలి బూడిదైపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న అబ్దుల్ షోయబ్(25) మాత్రం గాయాలతో బయటపడ్డాడు. అతను మదీనాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ విలేకరులకు తెలిపారు. 45 మందిలో 44 మంది హైదరాబాద్ వాసులు కాగా.. ఓ వ్యక్తి హుబ్లీకి చెందిన వారని తెలంగాణ హజ్ కమిటీ తెలిపింది. మృతులు హైదరాబాద్‌లోని మల్లేపల్లి, బజార్‌ఘాట్, ఆసిఫ్‌నగర్ వాసులని పేర్కొంది. మృతుల్లో 18 మంది మహిళలు, 17 మంది పురుషులు, 10 మంది చిన్నారులు ఉన్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. విద్యానగర్‌లోని ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మరణించారు. టప్పాచబుత్రలోని ఓ కుటుంబానికి చెందిన ఆరుగురు, మొఘల్‌కానాలోని ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు, జిర్రాలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన వారిలో ఉన్నారు. మొత్తం నాలుగు ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా వెళ్లారని, ఎవరూ హజ్‌హౌస్ ద్వారా వెళ్లలేదని హజ్ కమిటీ స్పష్టం చేసింది. ఇది హజ్ యాత్రకు వెళ్లే సమయం కాదంది. ఉమ్రా యాత్రకు ఎప్పుడైనా వెళ్లవచ్చని తెలిపింది. హజ్ యాత్రకు, ఉమ్రా యాత్రకు సంబంధం ఉండదని వివరించింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తెలంగాణ సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వివరాల కోసం 79979 59754, 99129 19545 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. రోడ్డు ప్రమాద బాధితుల కోసం హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 040 27852333 లేదా ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ 87126 60381ను సంప్రదించాలని సీపీ సజ్జనార్ చెప్పారు.


మృతుడు సయ్యద్ నసీరుద్దీన్ ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మూడు ఆస్పత్రుల్లోని శవాగారాలకు..

ప్రమాదస్థలికి హుటాహుటిన చేరుకున్న సౌదీ సహాయక బృందాలు మృతదేహాలను మదీనాలోని 3 ఆస్పత్రుల్లో ఉన్న శవాగారాలకు తరలించారు. మృతుల వివరాలను తెలుసుకోవడానికి జెడ్డాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహాద్ ఖాన్ సూరి, ఇతర ఉన్నతాధికారుల బృందం మదీనా చేరుకుంది. మృతదేహాల గుర్తింపు, అంత్యక్రియలను వీలైనంత త్వరగా జరిపించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఫహాద్ ఖాన్ తెలిపారు.



మల్లేపల్లిలోని ఓ ట్రావెల్ ఏజెన్సీ వద్ద గుమిగూడిన జనం..

దుబాయ్ నుంచి వచ్చి.. కుటుంబ సభ్యులతో వెళ్లి..

ఘటనలో మృతి చెందిన ఇర్ఫాన్ అహ్మద్ (45) దుబాయ్‌లో పనిచేస్తుంటారు. ఆయన కుటుంబం హైదరాబాద్‌లోని మొఘల్‌కానా ప్రాంతంలో ఉంటుంది. తల్లి సబీబా సుల్తానా (67), భార్య హుమీరా నజీన్ (32), కుమారులు ఇజాన్ అహ్మద్ (8), హమీద్ అహ్మద్(6)ను ఉమ్రా యాత్రకు తీసుకెళ్లేందుకు ఈ నెల 7న ఇర్ఫాన్ హైదరాబాద్ వచ్చారు. 9న కుటుంబ సభ్యులను యాత్రకు తీసుకెళ్లారు. తండ్రి సలీం అహ్మద్ మాత్రం ఇంటి వద్దే ఉండిపోయారు. నాలుగు రోజుల్లో వస్తారనుకున్న కుటుంబ సభ్యులు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో సలీం గుండెలవిసేలా రోదిస్తున్నారు.

మంత్రి అజారుద్దీన్ పరామర్శ

సౌదీ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులను సోమవారం మంత్రి అజారుద్దీన్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్, నటరాజ్‌నగర్‌లోని అబ్దుల్ ఖాదర్, మహ్మద్ అలీల కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ టూ సౌదీ అరేబియా..

ఉమ్రా యాత్ర చేయడానికి రోజూ వందలాది మంది యాత్రికులు హైదరాబాద్ నుంచి సౌదీ అరేబియాకు వెళ్తుంటారు. మక్కా, మదీనాలను సందర్శించి వస్తారు. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 200 వరకు వివిధ టూర్ ఆపరేటర్లు ఉమ్రా యాత్రలను నిర్వహిస్తుంటారు. మక్కా, మదీనాల మధ్య 440 కిలోమీటర్ల హైవేపై నిరంతరం వేలాది మంది బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. అతి వేగం, నిద్రలేమి కారణాలతో అప్పుడప్పుడు ఇలాంటి ఘోర ప్రమాదాలు జరుగుతుంటాయి.

రెండు వారాలు.. అంతకంటే ఎక్కువే కావచ్చు..

సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాల నిబంధనల ప్రకారం అగ్నిప్రమాద మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేసిన తర్వాతే వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. డీఎన్ఏ పరీక్షల ఫలితాలు రావడానికి వారం, రెండు వారాలు.. అంతకంటే ఎక్కువ సమయం కూడా పట్టొచ్చు. తాజాగా హైదరాబాద్‌లో అధికారులు ప్రకటించిన విధంగా మృతుల కుటుంబాల నుంచి ఒక్కొక్కరు సౌదీ వచ్చినా.. డీఎన్ఏ ఫలితాలు వచ్చి, మృతదేహాలు అప్పగించేదాకా వారు అక్కడే ఉండాలి.


మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే

మృతుల వివరాలు

రిజ్వానా బేగం	విద్యానగర్
ఇర్ఫాన్ అహ్మద్	లంగర్‌హౌస్
పర్వీన్ బేగం	రాజేంద్రనగర్
సొహైల్ మహ్మద్	వట్టేపల్లి
షేక్ జైనుద్దీన్	నల్లకుంట
ఫర్హానా సుల్తానా	నల్లకుంట
రిదా తజీన్	నల్లకుంట
ఫర్హీన్ బేగం	ఆసిఫ్‌నగర్
తసీమా నహరీన్	నల్లకుంట
మహ్మద్ మంజూర్	ఆసిఫ్‌నగర్
మహ్మద్ సాజిన్ అహ్మద్	ముషీరాబాద్
ఇజాన్ అహ్మద్	లంగర్‌హౌస్
హమ్దాన్ అహ్మద్	లంగర్‌హౌస్
ముజైహ జాఫర్ సయీద్	నారాయణగూడ
జహీన్‌బేగం	ఆసిఫ్‌నగర్
షబానా బేగం	నారాయణగూడ
అనీస్ ఫాతిమా	మలక్‌పేట్
అమీనాబేగం	మలక్‌పేట్
సలీం ఖాన్	బహదూర్‌పుర
రహమత్‌బీ	గాంధీనగర్
మరియం ఫాతిమా	నల్లకుంట
పారాబేగం	కాలాపత్తర్
షహనాజ్ బేగం	టప్పాచబుత్ర
షౌకత్ బేగం	టప్పాచబుత్ర
మహ్మద్ మౌలానా	టప్పాచబుత్ర
సారా అల్ అమూది	ఆసిఫ్‌నగర్
షాజహాన్ బేగం	ఆసిఫ్‌నగర్
సలాఉద్దీన్ షేక్	ముషీరాబాద్
మస్తాన్ మహ్మద్	ఫలక్‌నుమా
జకియాబేగం	ఫలక్‌నుమా
మహ్మద్ అలీ	టప్పాచబుత్ర
రహీమున్నీసా	బోరబండ
గౌసియా బేగం	టప్పాచబుత్ర
అక్తర్ బేగం	విద్యానగర్
నసీరుద్దీన్ షేక్	న్యూ నల్లకుంట
అబ్దుల్ ఖదీర్ మహ్మద్	ఆసిఫ్‌నగర్
ముమేర నాజీన్	మొఘల్‌నగర్
సాబిహా సుల్తానా	మొఘల్‌నగర్
షోయబ్ ఉర్ రహమాన్	టొలిచౌకి
రయీస్ బేగం	టొలిచౌకి
ఉమైజా ఫాతిమా	నల్లకుంట
సనా సుల్తానా	నల్లకుంట
ఉజైరుద్దీన్ షేక్	నల్లకుంట
మెహ్రిష్ ఫాతిమా	నల్లకుంట
అబ్దుల్ గని అహ్మద్ సాహెబ్	హుబ్లీ

టప్పాచబుత్రకు చెందిన అబ్దుల్ షోయబ్ మహమ్మద్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు

3 తరాలు మాయం

ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి.. మృతుల్లో 8మంది పెద్దవాళ్లు.. 10 మంది పిల్లలు

- కుటుంబంలో మిగిలింది కేవలం ఇద్దరే
- ఇంటివద్దే ఉండిపోవడంతో బతికిపోయిన ఇంటిపెద్ద తల్లి
- విమాన టికెట్ దొరక్కపోవడంతో అమెరికాలోనే ఉండిపోయిన పెద్ద కొడుకు

హైదరాబాద్ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీ బస్సు ప్రమాదం మాటలకందని విషాదం!! ఉవ్వెత్తున్న వరద తాకినట్టు.. కాదు కాదు అంతకుమించి మహా సునామీ పోటెత్తి అంతా తుడిచిపెట్టేసినట్టు ఒక కుటుంబాన్ని దాదాపు కూకటివేళ్లతో పెకిలించేసిందా రాకాసి ప్రమాదం! పెద్దదైన ఆ కుటుంబంలోని నిన్నటితరం, నేటి తరం, రేపటి తరం ఇలా మూడు తరాల వారంతా మృతి చెందడం మానవతావాదుల గుండెలను పిండేస్తోంది. ఎనిమిది మంది పెద్దలు, పది మంది పిల్లలు మొత్తంగా 18మంది బస్సు ప్రమాదంలో మృతిచెందారు. రైల్వేలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఇంటిపెద్ద అయిన 70 ఏళ్ల నసీరుద్దీన్‌ది పెద్ద కుటుంబమే! విద్యానగర్‌లో ఉంటున్న ఆయనకు వయసుపైబడిన తల్లి రోషన్ బీతో పాటు భార్య అక్తర్ బేగం (65), కుమారులు సిరాజుద్దీన్, సలావుద్దీన్ (42), కూతుళ్లు అమీనా బేగం (44), రిజ్వానా బేగం (38), షబానా బేగం (40) ఉన్నారు. నసీరుద్దీన్ పిల్లలందరికీ పెళ్లిళ్లయ్యాయి. పెద్ద కుమారుడు సిరాజుద్దీన్‌కు భార్య సన, ముగ్గురు పిల్లలు మెహరీన్ ఫాతిమా, ఉమైజా ఫాతిమా, ఉజైరుద్దీన్ షేక్ ఉన్నారు. చిన్న కుమారుడు సలావుద్దీన్‌కు భార్య ఫర్హానా, ముగ్గురు పిల్లలు షేక్ జైనోద్దీన్, రిదా తాజీమ్, వసీమా ఫర్హీన్ ఉన్నారు పెద్ద కుమార్తె అమీనాకు కూతురు అనీస్ ఫాతీమా, రెండో కుమార్తె షబానాకు కుమారుడు జాఫర్ సయ్యద్, మూడో కుమార్తె రిజ్వానాకు కూతురు మరియం ఫాతిమా, కుమారుడు షాజైన్ హమద్ ఉన్నారు. పెద్ద కుమారుడు సిరాజుద్దీన్ ఆయన భార్య సన, పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. చిన్న కుమారుడు సలావుద్దీన్, కూతుళ్లు అమీనా, రిజ్వానా తమ తమ కటుంబాలతో నగరంలోనే వేర్వేరుగా ఉంటున్నారు. సలావుద్దీన్ అమెజాన్ సంస్థలో ఉన్నతోద్యోగి. తన కుటుంబసభ్యులందరినీ తోడ్కొని మక్కా యాత్ర చేసిరావాలని ఇంటిపెద్ద అయిన నసీరుద్దీన్ చిరకాల స్వప్నం! ఇందుకు ఆయన చాన్నాళ్లుగా ప్రణాళికలు వేస్తున్నారు. ఇటీవల అమెరికా నుంచి సిరాజుద్దీన్ భార్య సన, పిల్లలు మెహరీన్ ఫాతిమా, ఉమైజా ఫాతిమా, ఉజైరుద్దీన్ షేక్ హైదరాబాద్‌కొచ్చారు. సలావుద్దీన్‌కూ సెలవు దొరకడంతో మక్కా యాత్రకు మక్కా యాత్రకు ఇదే అనువైన సమయం అని నసీరుద్దీన్ అనుకున్నారు. సిరాజుద్దీన్‌కు అమెరికా నుంచి నేరుగా మక్కా రావాలని చెప్పారు. తన తల్లి రోషన్ బీని నసీర్దుదన్ తన సోదరి వద్ద వదిలిపెట్టారు. ఆ వెంటనే పిల్లలను వెంటబెట్టుకొని అంతా తన ఇంటికి రావాలని కొడుకు, కూతుళ్లకు నసీరుద్దీన్ కబురు పెట్టారు. ఈనెల 9న తాను, తన భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కోడళ్లు, ముగ్గురు కుమార్తెలు.. 10మంది మనుమలు, మనుమరాళ్లతో నసీరుద్దీన్ మక్కా బయలుదేరారు. 23న తిరిగిరావాలనుకున్నారు. అయితే వెళ్లినవారిలో ఒక్కరూ మిగలకుండా ప్రాణాలుకోల్పోయారు.


హజ్ యాత్రకు వెళ్లే ముందు పూలదండలతో మహిళలు, చిన్నారులు

ఒకే కుటుంబానికి చెంది నలుగురు

కిషన్‌నగర్‌కు చెందిన మహ్మద్ మన్సూర్ (40), తన తల్లి షౌకత్ బేగం (59), భార్య ఫర్హీన్ బేగం (38), కూతురు జహీన్ బేగం (20)తో కలిసి ఈనెల 9న మక్కా యాత్రకు బయలుదేరారు. బస్సు ప్రమాదంలో నలుగురూ మృతిచెందారు. ఆదివారం రాత్రి 12:30 గంటలకు మన్సూర్ ఫోన్ చేసి మాట్లాడారని, అంతలోనే ఘోరం జరిగిపోయిందంటూ సోదరుడు మన్సూఫ్ చెప్పారు.

టికెట్ దొరక్కపోవడమే ప్రాణం నిలిపింది

వాస్తవానికి మక్కా యాత్రకు నసీరుద్దీన్ పెద్ద కుమారుడు సిరాజుద్దీన్ కూడా వెళ్లాలి. కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు రావాలనుకున్నా ఆయనకు పరిస్థితులు అనుకూలించకపోవడంతో భార్యాపిల్లలను మాత్రం హైదరాబాద్‌కు పంపారు. తాను తర్వాత రావాలనుకున్నారు. అయితే మక్కా యాత్రకు ఆలోచన చేసిన నసీరుద్దీన్.. కుమారుడు సిరాజుద్దీన్‌ను అమెరికా నుంచి నేరుగా సౌదీకి వచ్చి.. తమతో కలవాలని చెప్పారు. అయితే అనుకున తారీఖున టికెట్ దొరక్కపోవడంతో సిరాజుద్దీన్ అమెరికాలోనే ఉండిపోయారు. ప్రస్తుతం ఇంట్లో నాన్నమ్మ (నసీరుద్దీన్ తల్లి) రోషన్ బీ, తాను మాత్రమే మిగిలారు. ప్రమాదంలో సిరాజుద్దీన్ భార్య సన, ముగ్గురు పిల్లలు మెహరీన్ ఫాతిమా, ఉమైజా పాతిమా, ఉజైరుద్దిన్ షేక్ మృతిచెందారు. సిరాజుద్దీన్ అమెరికా నుంచి సౌదీకి బయలుదేరారని.. అంత్యక్రియలను ఆయనే నిర్వహిస్తారని నగరంలోని బంధువులు వెల్లడించారు.

అందరూ ఒకేసారి ఎందుకు? అన్నా కూడా



ఇలా అవుతుందని కలలో కూడా అనుకోలేదు. ప్రమాదంలో మూడు తరాలు తుడిచిపెట్టుకుపోయాయి. మా బావ (నసీరుద్దీన్) నా మాట వినుంటే కొంతైనా బతికేవారు. యాత్రకు ముందే బావతో నేను.. అందరూ ఒకేసారి వెళ్లడం ఎందుకు? వద్దు? అని చెప్పాను. మరీ ప్రత్యేకంగా.. పిల్లలందరినీ తీసుకెళ్లవద్దనీ చెప్పాను. ఆయన నా మాట వినలేదు. మా అక్క, బావ, పిల్లలతో శుక్రవారమే మాట్లాడాను. ఎంతో ఆనందంతో అక్కడి విషయాలెన్నో పంచుకున్నారు. అంతలోనే విషాదం జరిగింది.

- అక్తర్ బేగం సోదరుడు సయ్యద్

చివరి చూపూ దక్కడం లేదు



మా ఇంట్లో 18మంది కాలి బూడిదయ్యారు. వారి చివరి చూపునకు కూడా నోచుకోలేకపోతున్నాం. ఇక మాకు దిక్కెవరు? అల్లా ఎంత పనిచేశాడు?

-నసీరుద్దీన్ తల్లి రోషన్

పిల్లలంతా మృతి

ప్రమాదంలో నసీరుద్దీన్ మనుమలు, మనుమరాళ్లలో ఒక్కరూ మిగలకుండా అందరూ ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు కుమారుల పిల్లలు, ముగ్గురు కూతుళ్ల పిల్లలు అంతా మక్కా యాత్రకు వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. తాత నసీరుద్దీన్.. మక్కా యాత్రకు వెళ్లనున్నామని చెప్పింది మొదలు ఆ చిన్నారులంతా ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ విషయాన్ని స్నేహితులతో గొప్పగా చెప్పుకొన్నారు. తిరిగివచ్చాక అక్కడి జ్ఞాపకాలను తమతో పంచుకుంటామని చెప్పిన దోస్తులు ఎన్నడూ తిరిగిరారని తెలిసి ఇరుగుపొరుగు పిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు.

భార్య, బిడ్డ మృతితో

మెహిదీపట్నంకు చెందిన షాజహాన్‌బేగం తన కూతురు సారా మహమూద్‌తో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. బస్సు ప్రమాదంలో ఇద్దరూ మృతిచెందారు. సారా మహమూద్ న్యాయవాది. ఆమె తల్లి షాజహాన్ బేగం గృహిణి. ఇద్దరూ బంధువులతో కలిసి యాత్రకు వెళ్లారు. భార్య, కుమార్తె మరణవార్త తెలిసి రోదిస్తున్న షేక్ మహబూబ్‌ను ఓదార్చడం ఎవరివల్లా కావడం లేదు.

సౌదీ ప్రమాదం.. అత్యంత దురదృష్టకరం

- ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ దిగ్భ్రాంతి
- ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉండండి
- సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సూచన



న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియాలో జరిగిన ఘోర ప్రమాదంపై ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. "మదీనా వద్ద జరిగిన ప్రమాదంలో భారత పౌరులు చనిపోవడం అత్యంత దురదృష్టకరం. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ సహాయక చర్యలు అందిస్తున్నాయి. సౌదీ ప్రభుత్వ అధికారులతో భారత ప్రతినిధులు సంప్రదింపులు జరుపుతున్నారు" అని ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. అలాగే, మదీనా సమీపంలో జరిగిన ప్రమాదంలో భారతీయులు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విచారం వ్యక్తం చేశారు. "సౌదీ ప్రమాద విషాదం నన్ను తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. హైదరాబాద్‌లోని బాధిత కుటుంబాలకు సహాయం అందించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సూచించాను" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు.

అక్కడ వాహనాల వేగం ఎక్కువ: ఎమ్మెల్యే కౌసర్

మక్కాలో బస్సులు, కార్లు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంటాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ తెలిపారు. ఉమ్రా నుంచి మదీనాకు 500 కిలోమీటర్లు దూరమని, కొంతమంది ఫ్లైట్‌లో, చాలా మంది బస్సుల్లో, ప్రైవేట్ ట్రావెల్స్ కార్లలో వెళతారని తెలిపారు. మక్కా పర్యటనలో తనకు ఎదురైన అనుభవాలను ఆయన గుర్తు చేసుకుంటూ.. వాహనాల వేగం తగ్గించమని చెప్పినా అక్కడి డ్రైవర్లకు చెప్పినా వినిపించుకోరని వాపోయారు. అక్కడ వాతావరణం వేడిగా ఉన్నందున మంటలు చాలా త్వరగా వ్యాపించి ఉంటాయని అభిప్రాయపడ్డారు.

మృతుల కుటుంబాలకు రూ.23.50లక్షల చొప్పున బీమా పరిహారం

సాధారణంగా మదీనా యాత్రకు వెళ్లే ప్రయాణికులందరూ తప్పని సరిగా ప్రయాణ బీమా తీసుకోవాల్సి ఉంటుంది. ఆ బీమా తీసుకున్న వారికే అక్కడి ప్రభుత్వం వీసా మంజూరు చేస్తుంది. ప్రయాణంలోనే ఘోర ప్రమాదం జరిగి 45 మంది మృతి చెందినందున ఒక్కొక్కరికి రూ.23.50లక్షల చొప్పున బాధిత కుటుంబాలకు పరిహారం అందే అవకాశం ఉంది.


మక్కాకు బయలుదేరుతున్న మస్తాన్, జకియా బేగం, సొహైల్

దంపతులు, కుమారుడి మృతి

బస్సు ప్రమాదంలో పాతబస్తీ వట్టేపల్లి ఫాతిమానగర్‌కు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. మహ్మద్ మస్తాన్, కాలాపత్తర్ తాడ్‌బన్‌లో మోటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు, ఈ నెల 9న మస్తాన్, ఆయన భార్య జకీయా బేగం, కుమారుడు మహమ్మద్ సోహైల్‌తో కలసి మక్కా యాత్రకు బయలుదేరారు. అక్కడ జరిగిన ప్రమాదంలో ముగ్గురూ చనిపోయారు.

ఇద్దరు తల్లీకొడుకులు..

బస్సు ప్రమాదంలో పాతబస్తీ మిస్రీగంజ్‌కు చెందిన ఇద్దరు తల్లీకొడుకులు ప్రాణాలు కోల్పోయారు. సారా బేగం (60), ఆమె కుమారుడు మహమ్మద్ సలీంఖాన్(42) ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా ఉమ్రా యాత్రకు వెళ్లారు. మహమ్మద్ సలీంఖాన్ ఫంక్షన్లలో డెకరేషన్ పనులు చేస్తుంటాడు. తల్లి సారాబేగం గృహిణి, సలీంఖాన్‌కు భార్య అంజుమ్‌ఖాన్, ఇద్దరు కుమారులు రెహాన్‌ఖాన్, ఫైజాన్‌ఖాన్ ఉన్నారు. తల్లీకొడుకుల మరణవార్త తెలుసుకున్న స్థానికులు బాధితుల ఇంటికి వచ్చి ఓదార్చారు.

ఒకే ఒక్కడు బయటపడ్డాడు



కుటుంబసభ్యుల్లో ముగ్గురు మంటల్లో కాలిపోతే.. ఆయనొక్కరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆయన భార్య గౌసియా బేగం, ఆమె తండ్రి మహ్మద్ మౌలానా, కుమారుడు మహ్మద్ షోయబ్, మక్కా యాత్రకు వెళ్లారు. ప్రమాదం వేళ షోయబ్ మాత్రం బస్సు అద్దాలను పగలగొట్టి బయటకు దూకి ప్రాణాలను రక్షించుకున్నారు. ఆయనకు స్వల్పగాయాలయ్యాయి. అతడి కుటుంబ సభ్యులందరూ మృతి చెందారు.

తల్లి, ఇద్దరు కుమారుల మృతి

"హేయ్... అమ్మీని తీసుకొని వస్తున్నాను... దుబాయ్‌లో కలుద్దాం అక్కడి నుంచి ఉమ్రా, మదీనా వెళ్దాం" అంటూ సోదరుడికి చెప్పి తల్లిని వెంటబెట్టుకొని వెళ్లారా ఐటీ ఉద్యోగి! బస్సు ప్రమాదంలో తన సోదరుడు, తల్లితో పాటు ఆయనా మృత్యువాతపడ్డారు. టోలిచౌకికి చెందిన సైఫ్‌ఉర్ రెహమాన్ కొంతకాలంగా దుబాయ్‌లో పనిచేస్తున్నారు. ఆయన సోదరుడు మహమ్మద్ షోయబ్ రెహమాన్ నగరంలో ఐటీ ఉద్యోగి. తల్లి రహీయత్ బేగం ఆయన వద్దే ఉంటోంది. హజ్ యాత్ర ప్రారంభం కావడంతో మక్కాకు వెళ్లి దర్శనం చేసుకోవాలనుకున్నారు. దుబాయ్‌కి రండి కలిసి వెళ్దామని సైఫ్‌ఉర్ వీరికి సూచించాడు. నేరుగా ఉమ్రాకు వస్తామని, దుబాయ్ నుంచి నువ్వు కుడా అక్కడికి రావాలని చెప్పారు. ఉమ్రాలో తల్లి, ఇద్దరు కొడుకులు కలుసుకొని అక్కడి నుంచి వచ్చిన హైదరాబాద్ టూర్ ప్యాకేజీలో చేరారు. అంతలోనే జరిగిన ప్రమాదంలో సోదరులు ఇద్దరూ తల్లితో సహా అగ్నికి ఆహుతయ్యారు.

రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం

- తొర్రూర్‌లో 59 ప్లాట్ల విక్రయంతో 46 కోట్ల ఆదాయం
- నేడు మరో 104 ప్లాట్లకు వేలం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలకు మరోసారి మంచి స్పందన వచ్చింది. ఓఆర్ఆర్‌కు సమీపంలోని తొర్రూర్, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని 163 ప్లాట్లకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలి రోజున తొర్రూర్‌లోని 59 ప్లాట్లను విక్రయించారు. అత్యధికంగా చదరపు గజానికి రూ.39 వేల ధర పలికింది. మొత్తం మీద ఈ ప్రాంతంలో సగటున రూ. 28,700 పలికింది. కనీస ధర రూ. 25 వేలుగా నిర్ధారించి వేలం నిర్వహించారు. సోమవారం నాటి విక్రయాల ద్వారా మొత్తం రూ.46 కోట్ల మేర ఆదాయం వచ్చిందని స్వగృహ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతమ్ తెలిపారు. 110మంది బిడ్డర్లు పాల్గొన్నారని వెల్లడించారు. తొర్రూర్ ప్రాంతంలోనే మిగిలిన 65, కుర్మల్‌గూడలోని 25, బహదూర్‌పల్లిలోని 13తో పాటు మొత్తం 104 ప్లాట్లకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ మినహాయించండి

- కిషన్‌రెడ్డి, పంకజ్ అరోరాలకు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దామోదర్ రెడ్డి, బిక్షం గౌడ్‌లతో కలిసి ఆయన సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, జాతీయ విద్యామండలి చైర్మన్ పంకజ్ అరోరాలను కలిశారు. టెట్ తప్పనిసరితో తెలంగాణలో దాదాపు 30వేలకుపైగా ఉపాధ్యాయులపై ప్రభావం పడుతోందన్నారు. తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాలన్న సుప్రీం కోర్టు తీర్పు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై మంగళవారం విద్యామంత్రితో జరిగే సమావేశంలో చర్చిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేందుకు సహకరిస్తామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు త్వరలో ఇన్‌సర్వీస్ షార్ట్‌టర్మ్ డిప్లొమా కోర్సు ప్రవేశపెట్టనున్నట్టు పంకజ్ అరోరా తెలిపారు. దీంతో ఎస్జీటీలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు.

మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థుల ఆందోళన

- రవాణా, హాస్టల్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు కోఠిలోని రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తక్షణమే రవాణా సౌకర్యం కల్పించాలని, క్యాంపస్‌లోనే హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎంఈ డాక్టర్ శివరాం ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతీ రోజూ క్లినికల్ పోస్టింగ్‌లు ఉదయం 9నుంచి 12వరకు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వేస్తున్నారని, ఆ తర్వాత 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగళపల్లిలోని మెడికల్ కాలేజీ క్యాంపస్‌కు వెళ్లాలంటే కాలేజీ బస్సు సదుపాయం కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సివస్తోందన్నారు.

కనకాల కృష్ణారెడ్డికి జాతీయ గోపాల రత్న అవార్డు

న్యూఢిల్లీ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పశువులు, పాడి పరిశ్రమ రంగంలో అందించిన ఉత్తమ సేవలకు గాను తెలంగాణకు చెందిన డాక్టర్ కనకాల కృష్ణారెడ్డికి 'జాతీయ గోపాల రత్న' అవార్డు దక్కింది. కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సోమవారం జాతీయ గోపాల రత్న-2025(ఎన్‌జీఆర్‌ఏ) అవార్డులను ప్రకటించింది. దేశీయ పశువులు, గేదె జాతుల పెంపకంలో ఉత్తమ పాడి రైతు కేటగిరీ కింద నాన్-ఎన్‌ఈఆర్(ఈశాన్య ప్రాంతం కాని) విభాగంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కంకణాల కృష్ణారెడ్డి రెండో ర్యాంకు సాధించారు. ఈనెల 26న జాతీయ పాల దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ విజేతలకు అవార్డులు అందజేస్తారని మంత్రిత్వ శాఖ తెలిపింది.

నేటి నుంచి వాట్సాప్‌లోనూ 'మీసేవ'

హైదరాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'మీసేవ' ద్వారా అందించే సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై మీ-సేవ కేంద్రాలకు పదేపదే వెళ్లాల్సిన అవసరంలేదు. ప్రభుత్వం అందించే పలు ముఖ్య సేవల వివరాలు, అప్‌డేట్లు, సర్టిఫికెట్ ఆమోదస్థితి వంటివన్నీ వాట్సాప్‌లోనే చెక్ చేసుకోవచ్చు. ఆమోదం పొందిన ధ్రువపత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించనుంది. దీంతో సర్వర్ బిజీ, క్యూలైన్లో వేచి ఉండడంలాంటి అవస్థలన్నీ తొలగిపోనున్నాయి. ఈ వాట్సాప్ 'మీ-సేవ'లను ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ప్రారంభించనుంది.

డెత్ సర్టిఫికెట్ తెస్తేనే పరిహారం

- బస్సు డ్రైవర్ భార్యకు తహసీల్దార్ స్పష్టీకరణ

బషీరాబాద్, నవంబరు 17 ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చెవేళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ పరిహారం విషయంలో గందరగోళం నెలకొంది. డ్రైవర్ దస్తగిరిబాబా మొదటి భార్య అసీనాబేగం సోమవారం బషీరాబాద్ తహసీల్దార్ షాహిదా బేగంను కలిసి, తన భర్తకు ప్రభుత్వం ప్రకటించిన రూ.7లక్షల పరిహారం చెక్కులు ఎవరి వద్ద ఉన్నాయో తెలుసుకోవాలని, ఆ డబ్బులు తనకెప్పుడు అందుతాయో చెప్పాలని కోరుతూ మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ స్పందిస్తూ, ముందుగా దస్తగిరిబాబా డెత్ సర్టిఫికెట్ తీసుకురావాలని, ఆ తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయగలమని స్పష్టం చేశారు. ఈ పత్రాలు ఉంటేనే బ్యాంకు ద్వారా పరిహారం తీసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. భర్త ప్రస్తుత కుటుంబసభ్యులు తనకు డబ్బులు ఇచ్చేలా లేరని, ఇద్దరు పిల్లలను పోషించుకోవడం కష్టమని అసీనాబేగం ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబసభ్యుల మధ్య సమస్య ఉంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని, లీగల్ వారసులకు తెలియకుండా ఎవరూ డబ్బులు డ్రా చేసుకునే అవకాశం లేదని తహసీల్దార్ ఆమెకు వివరించి పంపించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ బంధువులకే టోకరా

- ఏపీ మంత్రి పేరిట నకిలీ సిఫారసు లేఖ ఇచ్చిన యువకుడు

అమరావతి/విజయవాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ మంత్రి సత్యకుమార్ పేరిట నకిలీ సిఫారసు లేఖ ఇచ్చి కేంద్రమంత్రి బండి సంజయ్ బంధువులనే మోసం చేశాడు ఓ యువకుడు. ఆ లేఖతో తిరుమల వెంకన్న బ్రేక్ దర్శనానికి వారు వెళ్లగా.. అది నకిలీదని గుర్తించి అధికారులు తిరస్కరించారు. దీంతో దర్శనానికి వెళ్లిన వారు సత్యకుమార్ పీఏకు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆ లేఖ ఎవరిచ్చారని ఆరా తీయగా ఒకప్పుడు మంత్రి కార్యాలయంలో పనిచేసి మానేసిన యువకుడు ఇచ్చినట్టు వివరించారు. దీనిపై సీరియస్ అయిన మంత్రి సత్యకుమార్ విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు లేఖను మంత్రి పీఏ సృజన్ నేరుగా తీసుకెళ్లి సీపీకి అందజేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తామని కమిషనర్ తెలిపారు.

న్యూ ఇయర్‌కి ఎక్కడుంటారో తేల్చుకోండి!

(మొదటి పేజీ తరువాయి)



సదస్సులు, విదేశీ పర్యటనల కారణంగా సుప్రీంకోర్టు విధించిన గడువులోగా విచారించడం సాధ్యం కాలేదని చెబుతూ అక్టోబరు 31న స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు లేఖ రాసింది. ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న ఎమ్మెల్యేలు సైతం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అకాల వర్షాల నేపథ్యంలో వరద సహాయక చర్యల్లో పాల్గొనడం కారణంగా నియోజక వర్గాల్లోనే ఉండాల్సి వస్తోందని, మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై విచారణలో స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. గడువు కోరుతూ స్పీకర్ దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు బీఆర్ఎస్ రెండు పిటిషన్లు కలిపి సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించింది.

ఉద్దేశ పూర్వకంగానే స్పీకర్ తాత్సారం: బీఆర్ఎస్

అసెంబ్లీ స్పీకర్‌కు అనర్హత పిటిషన్లపై విచారణను ముగించాలనే ఉద్దేశం లేదని, కావాలనే తాత్సారం చేస్తున్నారని బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేనందున విచారణను వాయిదా వేయాలని ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్ కోరారు. ఉదయమే ఒకసారి పాస్ ఓవర్ అడిగితే ఇచ్చామని, ఇంకెన్ని సార్లు ఇవ్వాలని సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. ఎండ్ ఆఫ్ ది బోర్డు(రోజులో చివరి కేసుగా) విచారించాలని శ్రవణ్ అభ్యర్థించగా, సీజేఐ తిరస్కరించారు. రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో శ్రవణ్ వాదనలు వినిపించడం ప్రారంభించారు. నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి విచారణ పూర్తయిందని, తీర్పు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. "పది మంది ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లపై రోజువారీ విచారణ జరపాలని గతంలోనే చెప్పాం కదా?" అని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం కలుగజేసుకుని, నలుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి కూడా స్పీకర్ మూడు వారాల క్రితం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మరో నలుగురికి సంబంధించి ఆధారాలన్నీ సమర్పించినా విచారణ తేదీలు ఇవ్వలేదని తెలిపారు. ఫిరాయింపు వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఇద్దరు ఎమ్మెల్యేలు స్పీకర్ నోటీసులకు కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదని వెల్లడించారు. స్పీకర్ కావాలనే కాలయాపన చేస్తున్నారని, అనర్హతపై నిర్ణయం తీసుకునే ఉద్దేశం ఆయనకు లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాలను ఏ మాత్రం లెక్కచేయలేదని, దీనిని అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉన్నదని, స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు ఇవ్వాలని కోరారు. స్పీకర్ కార్యాలయం తరఫున మరోసారి శ్రవణ్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ మను సింఘ్వి కోర్టు హాలుకు చేరుకున్నారు. అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ, హైదరాబాద్‌లో వరదల కారణంగా 10 రోజులు ఆలస్యం అయిందని, విచారణ పూర్తి చేయడానికి మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని ధర్మాసనం ఎదుట అభ్యర్థించారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు 20 మంచి నిర్ణయాలు తీసుకున్నామని, మరో ఎనిమిది, తొమ్మిది వారాల సమయం ఇస్తే మరింత పురోగతి సాధ్యమని తెలిపారు. సింఘ్వి అభ్యర్థనపై సీజేఐ, జస్టిస్ బీఆర్ గవాయి అసహనం వ్యక్తం చేశారు. "10 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపునకు సంబంధించి రోజువారీగా విచారించాలని గత ఆదేశాల్లో స్పష్టం చేశాం. ఒకవేళ ఎవరైనా ఎమ్మెల్యేలు ఉద్దేశ పూర్వకంగా విచారణను పొడిగించాలని చూస్తే వేటు వేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. మళ్లీ వచ్చి సమయం అడుగుతున్నారు. ఇదేం మంచి పద్ధతి కాదు. ఎమ్మెల్యేల అనర్హతపై చర్యలు తీసుకుంటారో? కోర్టు ధిక్కారాన్ని ఎదుర్కొంటారో? ఆయన(స్పీకర్‌ను ఉద్దేశిస్తూ) ఇష్టం. 10వ షెడ్యూల్ పరిధిలోని అంశాలను పరిగణనలోకి తీసుకునే సమయంలో స్పీకర్‌కు రాజ్యాంగ పరమైన అంశాల్లో వెసులుబాటు ఉండదు. ఈ విషయాన్ని గత మా తీర్పులోనే స్పష్టంగా తెలియజేశాం. ఇక ఆయన ఇష్టం. నాలుగు వారాల్లో తేలుస్తారో? లేదంటే ఈ న్యూ ఇయర్ వేడుకలు ఎక్కడైనా, ఇంకెక్కడైనా చేసుకోవాలని నిర్ణయించుకుంటారో? ఆయన ఇష్టం" అని జస్టిస్ గవాయ్ హెచ్చరికగా వ్యాఖ్యానించారు. ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని, తప్పనిసరిగా ఈలోపు విచారణను ముగిస్తామని అభిషేక్ సింఘ్వి అభ్యర్థించారు. అలా కుదరదని, రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాల్సిందేనని సీజేఐ మౌఖికంగా ఉత్తర్వులు ఇస్తుండగా, మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి కనీసం నాలుగు వారాల సమయమైనా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం స్పీకర్‌తోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీచేస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. సుప్రీం కోర్టు కేసుల జాబితా ప్రకారం ఈ అంశం మరోసారి డిసెంబర్ 19న విచారణకు వచ్చే అవకాశముంది.

ఇదీ నేపథ్యం

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. అదే రోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్ కుమార్ పార్టీలు ఫిరాయించారని కేటీ రామారావు, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు. ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఆలేటి మహేశ్వర్‌రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. దానం నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఆ పిటిషన్లు అన్నింటినీ కలిపి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారించి జూలై 31న తీర్పు వెలువరించింది.

స్పీకర్‌పై సుప్రీం వ్యాఖ్యలు తెలంగాణకు అవమానకరం

- ఫిరాయింపులపై చట్టానికి లోబడి చర్యలు తీసుకోవాలి
- అసెంబ్లీ స్పీకర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచన

న్యూఢిల్లీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ పట్ల సుప్రీంకోర్టు వ్యాఖ్యలు యావత్ తెలంగాణ సమాజానికి అవమానమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై స్పీకర్ సొంతంగా వ్యవహరిస్తున్నారని తాననుకోవడం లేదని, వారిపై రాజకీయ ఒత్తిడి ఉండొచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఏ రాజకీయ ఒత్తిడికి ఖాతరు చేయకుండా చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫిరాయింపులపై రాష్ట్ర శాసన సభ్యులు ప్రజాతీర్పును కాలరాసే విధంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యేలు తాము గెలిచిన పార్టీలకు రాజీనామా చేయాలన్నారు. ఏ పార్టీ నుంచి గెలిచినా ఎమ్మెల్యేలు చేరేది పాలక పార్టీలోకేనని 12 ఏళ్లుగా చూస్తున్నామన్నారు. పార్టీ ఫిరాయింపులతో నేతల పట్ల ప్రజల్లో అసహ్యం ఏర్పడుతోందని కిషన్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఫిరాయింపుదారులు బరి తెగించి ప్రజాతీర్పును కాలరాసి పార్టీలు మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిధుల కోసం సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని పేర్కొన్నారు. కేంద్ర నిధులందక రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందన్నారు. గతంలో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనుల బిల్లులను కూడా సర్కారు చెల్లించలేకపోతుందన్న కిషన్ రెడ్డి.. సకాలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.

మొంథా తుఫాను ఉపశమన చర్యల వివరాలు ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను భారీ నష్టం కలిగించిన నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన ఉపశమన చర్యల వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నష్టం వాటిల్లినా విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం లేదని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ హైకోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఈనెల 24లోగా వివరాలు సమర్పించాలని ప్రభుత్వ న్యాయవాదులకు ఆదేశాలు జారీ చేసింది.



సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో కార్మికులతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

ఎవరిపై ఆరోపణలు వస్తే.. వారే వివరణ ఇవ్వాలి

- వందిమాగధులతో తిట్టిస్తానంటే కుదరదు
- హరీశ్‌నుద్దేశించి మరోసారి కవిత వ్యాఖ్యలు
- ఖమ్మం జిల్లాలో తెలంగాణ జాగృతి జనం బాట

ఖమ్మం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావును ఉద్దేశించి విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరిపై ఆరోపణలు వస్తే వారే వివరణ ఇవ్వాలి తప్ప.. వందిమాగధులు మాట్లాడితే కుదరదని అన్నారు. తన విషయంలోనూ ఇదే వర్తిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కవిత సోమవారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్‌రావుపై విమర్శలు చేయవద్దన్న సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వ్యాఖ్యలపై స్పందించారు. వాళ్లతో, వీళ్లతో తిట్టిస్తామంటే ప్రజలన్నీ గమనిస్తారని తెలిపారు. ఇక ప్రజల్లో కాంగ్రెస్‌పై కోపం ఉన్నా, ప్రభుత్వ పథకాలు ఏ ఒక్కటీ అమలు కాకపోయినా జూబ్లీహిల్స్‌లో ఆ పార్టీ గెలవడానికి కారణం ప్రతిపక్షాలుగా బీఆర్ఎస్, బీజేపీల వైఫల్యమేనన్నారు. అందుకే ఆ బాధ్యతను తెలంగాణ జాగృతి తీసుకుందని తెలిపారు. కవిత తొలుత మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మధిర పట్టణంలో లెదర్‌పార్కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. తరువాత సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. యాతాలకుంటలో సీతారామ ఎత్తిపోతల పథకం 9వప్యాకేజీ టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో రూ.7కోట్లతో మొదలైన ఈ ప్రాజెక్టు అంచనా రూ.19కోట్లకు పెరిగిందన్నారు. అక్కడి నుంచి కవిత తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. తెలంగాణలోని కొత్త బొగ్గు బ్లాకులను జాతీయస్థాయిలో వేలం పాట పెట్టడంతో నష్టం మనకేనన్నారు. సత్తుపల్లిలోని వెంగళరావునగర్‌లో జేవీఆర్ ఓసీలోని కార్మికులతో కవిత మాట్లాడారు. సింగరేణికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.40వేల కోట్లు బకాయి పడిందన్నారు.

'చిన్న గుడ్డు'పై సర్కారు సీరియస్

కాంట్రాక్టర్ల మోసంపై ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గుడ్ల కాంట్రాక్టర్లతో నేడు మంత్రి సీతక్క సమావేశం

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు, గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరాలో కాంట్రాక్టర్ల మోసంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. గుడ్డు ధర పెంచినప్పటికీ కాంట్రాక్టర్లు నిర్ణీత పరిమాణం కంటే చిన్న గుడ్లను సరఫరా చేస్తుండటంపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'చిన్నగుడ్డు.. పెద్ద మోసం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేయాలని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. దీంతో మంత్రితో మంగళవారం గుడ్ల కాంట్రాక్టర్ల సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ గురుకులాలు, అంగన్‌వాడీలు, వసతి గృహాలకు గుడ్ల సరఫరా కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించటం లేదనే విమర్శలు ఉన్నాయి. గుడ్డు బరువు 45-52 గ్రాములు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించినా.. కాంట్రాక్టర్లు ఎక్కువగా 30-40 గ్రాముల బరువు ఉన్న చిన్న గుడ్లనే సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడ్లు పాడవకుండా ఉండేందుకు ప్రతి పది రోజులకు ఒకసారి సరఫరా చేయాల్సి ఉన్నా.. రవాణా ఖర్చు కలిసివస్తుందనే ఆశతో చాలా మంది కాంట్రాక్టర్లు నెలలో ఒకటి రెండు దఫాలతో సరిపెడుతున్నారు. దీంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల ఆ గుడ్లు కుళ్లిపోతున్నాయి. అంతేకాకుండా నాణ్యమైన గుడ్లను అందించేందుకు ప్రభుత్వం అగ్‌మార్క్ సర్టిఫికెట్ ఉన్న పౌల్ట్రీ నిర్వాహకులకే కాంట్రాక్టు ఇచ్చినా.. అగ్‌మార్క్ లేకుండానే చాలాచోట్ల సరఫరా అవుతున్నాయి. దీంతో నిబంధనలు పాటించేలా కాంట్రాక్టర్లను హెచ్చరించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు, పాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లతో కూడా మంత్రి సమావేశం కానున్నారు.

సమన్వయ లోపం

గతానికి భిన్నంగా గుడ్ల సరఫరా కోసం ఈసారి ఏకీకృత టెండర్లు నిర్వహించడం వల్ల పర్యవేక్షణ బాధ్యత జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ)లతో పాటు ఆయా శాఖల అధికారులపై కూడా పడింది. అయితే, వీరి మధ్య సమన్వయం లేకపోవడంతో క్షేత్రస్థాయిలో గుడ్ల సరఫరా ఎలా జరుగుతుందనేదానిపై పర్యవేక్షణ కరువైంది. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని అంటున్నారు. ఈ పరిస్థితులకు చెక్‌పెట్టాలని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

ఓట్ల చోరీ మాని.. చేతనైతే అభివృద్ధి చేయండి

- బీజేపీ నేతలకు మహేశ్ గౌడ్ హితవు
- ఈసీ నోరు మెదపట్లేదేం?: పొన్నం
- ఓట్ చోరీపై యూత్ కాంగ్రెస్ నిరసన

హైదరాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగతనం వల్లే బిహార్‌లో ఎన్డీయే గెలిచిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎన్డీయే కంటే మహాగఠ్‌బంధన్‌కు ఎక్కువ ఓట్లు వచ్చాయని, అయినా ఎన్డీయేనే గెలవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా అక్కడ ఎన్నికలు జరిగుంటే మహాగఠ్‌బంధన్‌కు 200 సీట్లు వచ్చుండేవన్నారు. కేంద్రం ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుబంధ సంఘంలా మారిందని మండిపడ్డారు. బీజేపీ నేతలు ఓట్ల దొంగతనం మానుకోవాలని, చేతనైతే దేశాన్ని అభివృద్ధి చేసి చూపాలని హితవు పలికారు. 'సర్' పేరిట బిహార్‌లో సెక్యులర్ ఓట్లను తొలగించారని ఆరోపించారు. భవిష్యత్తులో తెలంగాణలోనూ సర్ పేరిట సెక్యులర్ ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని, కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా సోమవారం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహా నిరసన కార్యక్రమం జరిగింది. ఇందులో మంత్రి పొన్నం ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఓట్ చోరీపై ప్రజలను చైతన్యపరుస్తూ రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేశారన్నారు. అధికారమే పరమావధిగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడ్డారని విమర్శించారు. మంగళవారం నుంచి ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉధృతం చేయనున్నట్లు చెప్పారు. ఒక వ్యక్తి కోసమో తాత్కాలిక లబ్ధి కోసమో ఇలా ఓట్ చోరీ చేస్తే దేశానికే నష్టం జరుగుతుందన్నారు. యువత దీన్ని అర్థం చేసుకోవాలని కోరారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఓట్ చోరీని రాహుల్ ఆధారాలతో సహా బయటపెట్టినా.. ఈసీ ఎందుకు నోరు మెదపట్లేదని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉదయ్‌భాను చిబ్ మాట్లాడుతూ మోదీ సర్కారు.. ఈసీతో కుమ్మక్కై ప్రజల ఓట్లను హరించడం సిగ్గుచేటన్నారు. అ. ఆ తర్వాత యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఓట్ చోరీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం తదితరులు

సంపత్ లేవనెత్తిన అంశాన్ని పరిశీలిస్తాం..

కాంగ్రెస్‌లో అక్కడక్కడా కలుపు, గంజాయి మొక్కలున్నాయని, వాటిని ఏరిపారేయాలంటూ సంపత్ చేసిన వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందించారు. కలుపు, గంజాయి మొక్కలు ఎవరన్నది సంపత్ పేర్లు ఇస్తే పరిశీలన చేస్తామని చెప్పారు. పాత నేతలకు ప్రాధాన్యం, అవకాశాలిస్తూనే కొత్త నేతలనూ కలుపుకుపోతామని చెప్పారు. డీసీసీ అధ్యక్షుల ఏ క్షణమైనా ప్రకటించవచ్చని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.